

# అమృతధార - ఖడ్గధార

(నిసర్గ దత్త మహారాజ్ బోధ)

నీలంరాజు లక్ష్మీప్రసాద్

# అమృతధార : ఖడ్గధార

నీలంరాజు లక్ష్మీప్రసాద్

**అమృతధార : ఖడ్గధార**

© నీలంరాజు లక్ష్మీప్రసాద్

సంవత్సరం : 2012

కాపీరైటు కలదు.

కవర్‌పేజి : అన్వర్

**వెల : 80/-**

*సోల్ డిస్ట్రిబ్యూటర్స్ :*
**నవోదయ బుక్‌హౌస్**
ఆర్యసమాజ్ మందిర్ ఎదురు వీధి,
కాచిగూడ, హైదరాబాద్-27.
ఫోను : 24652337

అడ్రసు :
**నీలంరాజు లక్ష్మీప్రసాద్**
91/3 ఆర్.టి., విజయనగర్ కాలనీ,
హైదరాబాద్-500 057.
ఫోన్ : 23346115

ముద్రణ :
**అనుపమ ప్రింటర్స్**
గ్రీన్‌వ్యూ, 126, శాంతినగర్,
హైదరాబాద్-28.
ఫోన్ : 23391364, 23304194

# అంకితం



శ్రీమతి దమయంతి

*2011 ఫిబ్రవరిలో 17న నిర్యాణమొందిన నా జీవిత భాగస్వామిని, శ్రీమతి దమయంతి, తాను బ్రతికున్న చివరి నెలల్లో, ఒకటి రెండుసార్లు నిసర్గదత్త బోధను పుస్తకంగా ప్రచురించే విషయం గుర్తుచేసింది. ఇప్పుడు ప్రచురిస్తున్న ఈ "అమృతధార : ఖడ్గధార" ఆమెకు అంకితమిస్తున్నాను.*

*ఈ పుస్తక ప్రచురణలో నాకు ప్రోత్సాహ సహకారాలందించిన 'ఆత్మ' బంధువు శ్రీ మోచర్ల పార్థసారథికి కృతజ్ఞతలు.*

*ఈ పుస్తకంలోని వ్యాసాలు, ఆంధ్రప్రభ వారపత్రికలోనూ, నవ్య (ఆంధ్రజ్యోతి వారపత్రిక)లోనూ ఆంధ్రభూమి డైలీ ఆదివారం సప్లిమెంటులోనూ ప్రచురించ బడినవి. ఆ పత్రికా సంపాదకులకు, యాజమాన్యానికి కృతజ్ఞతలు.*

**నీలంరాజు లక్ష్మీప్రసాద్**

# నిసర్గ సూక్తులు

జీవితం నిన్ను చైతన్యవంతుణ్ణి చేస్తుంది. కానీ గురువు నిన్ను ఎఱుకగలవానిగా చేస్తాడు.

ఈ మంచీ చెడూ అనేవి వాటంతటఅవి నా లోకంలో వుండవు. అవసరమైనది మంచిది, అనవసరమైనది చెడ్డది. నీ లోకంలో సుఖప్రదమైనది మంచిది. బాధాకరమైనది చెడ్డది.

ఎదగడం అవసరం. మంచిని మించిన దాని కొఱకై మంచిని వదిలేయడం అవసరం.

పండు పక్వమైనప్పుడు అందులోని గింజ భూమి చెంతకు చేరిపోతుంది. పక్వమవడమే సమస్తమూను.

నిన్ను గురించి నువ్వు పడే మౌలికమైన ఆదుర్దాను మాత్రం వీడమంటున్నాను.

శ్రద్ధ అనేది అసత్యమైన దాని నుండి, అనవసరమైన దాని నుండి వ్యక్తిగతమైన దాని నుండి మనిషి అంతరంగంలో కలిగిన స్థలం యొక్క అభివ్యక్తీకరణ.

సుఖం అందివ్వలేని ఆనందం నీకు బాధలోనూ దుఃఖంలోనూ ద్యోతకమవుతుంది. కారణమల్లా, బాధను స్వీకరించడానికి అంగీకరించినప్పుడు, అది నిన్ను సుఖం తీసుకు వెళ్ళగలిగిన లోతుకన్నా మరింత లోతుకు తీసుకు వెళ్తుంది.

బాధను స్వీకరించడానికి సిద్ధపడినప్పుడు మహా సుఖం ఉబుక్కుంటూ వెలువడుతుంది.

మీతో మాట్లాడగలిగిన ఈ(నా) శరీరం మీకు అవసరమైనది, నాకు కాదు.

సూర్యోదయం, సూర్యాస్తమయం కారణంగా సూర్యుడు ఎలాగైతే ఏ ప్రభావానికి లోనుకాడో, అదేవిధంగా నేనూ మరణంవల్ల ఏమీకాను.

నీలోన అన్ని స్థాయిల్లోనూ నువ్వు ఏకీకృతమైతే బాహ్యజ్ఞానం దానంతట అదే సిద్ధిస్తుంది. జీవితంలో ప్రతి క్షణం ఏది తెలియాల్సిన అవసరముంటుందో, అది తెలుస్తూ వుంటుంది.

ఆత్మసాక్షాత్కారం సంపాద్యం కాదు. అది అవగాహన యొక్క స్వభావాన్ని కలిగుంటుంది. ఒకసారి అది ప్రాప్తిస్తే, ఇక దానిని కోల్పోయే ప్రసక్తి లేదు.

భగవంతుడి రూప దర్శనమెంతో, ఒక పుష్పం కనిపించడం కూడా అంత అద్భుతమైనదే.

నువ్వీ ప్రపంచంలో పుట్టానని నీ వేర్పరచుకున్న నమ్మకం కేవలం నీ బలహీనత.

(కామవాంఛ అనేది) జ్ఞప్తికి తెచ్చుకోడం, ఊహించడం, ఎదురు చూడడం మొదలైన వాటితో కూడుకున్నది. అంతే! అంతకన్నా మరేమీకాదు.

మతమంటే ఏమిటి? ఆకాశంలో ఒక మబ్బు. నేను ఆకాశంలో నివసిస్తుంటాను, మబ్బుల్లో కాదు.

మతమనేది తన నిజస్వరూపాన్ని తన చర్యల్లో ప్రదర్శిస్తుంది.

ఏదో పురాణ గాథలను వాస్తవాలుగా భావించే స్థితిలో లేను. నావరకు నాకు ఈ కనిపించే అజ్ఞానం, దీని నుండి విముక్తిని గురించే నా శ్రద్ధ అంతాను.

ఏ బండరాళ్ళయితే విముక్తికి అవరోధాలుగా పరిణమిస్తాయో, వాటి ఆధారంగానే అవి తమకవసరమైన వారధి నిర్మించుకోగలుగుతాయి.

వెలుపలి నుండి నువ్వు కోరదగింది ఏదీ లేదనీ, ఆఖరికి గురువైన తాను కూడా అనవసరమేననీ, విసుగూ విరామం లేకుండా గుర్తుచేస్తుంటాను.

పరిమితమైనదెల్లా భ్రాంతి జనితమే. అపరిమితమైనదే సత్యం.

మనుషులు తమ మూలస్థానానికి, తమ అసలు స్వభావం వద్దకు చేరినప్పుడు తమలోని జ్ఞానాన్ని యధార్థం చేసుకుంటారు.

మీ కోర్కెను ప్రేమగా మలుచుకోండి. సమస్తమైన కోర్కెలూ – అవి ఎలాంటివైనా – ఆనందాబ్ధికై మీ వెంపర్లాట యొక్క చిహ్నాలే.

మీ నిజమైన ఆత్మను ఎరుగనందువల్ల మీరు ఎంత కోల్పోతున్నారో మీకెవరికీ తెలియదు. మీరు ఈ శరీరమూ కాదు, మనసూ కాదు. కాలే కట్టెలు, అందులో నుండి పుట్టే అగ్గీ కాదు. అవి వాటి వాటి న్యాయాన్ననుసరించి వాటికి అవి కనిపిస్తై, అదృశ్యమవుతై.

నీ ఆత్మజ్ఞాన ఫలితంగా నువ్వు ఇతర్లను ప్రేమించడం సంభవిస్తుంది కానీ, ఇతర్లపై నువ్వు ప్రకటించే ప్రేమ నీ ఆత్మజ్ఞానానికి కారణం కాదు. ఆత్మ సిద్ధించే వరకూ ఏ సద్గుణమూ సత్యమైనది కాదు.

నిన్ను నువ్వు అర్థం చేసుకో. అదే శాశ్వతత్వం.

నీ కోరికే ఈ విశ్వాన్ని సృష్టిస్తూన్నది. ఈ ప్రపంచం నీ సృష్టేనన్న సంగతి గ్రహించి, స్వేచ్ఛ నొందు.

కోరిక లేకపోతే నువ్వు చచ్చిపోయినట్లే. కానీ నీచమైన కోర్కెలు కలిగుంటే, నువ్వు పిశాచానివి.

సాక్షాత్కారమంటే వినూత్న అనుభవం కాదు. అది ప్రతి ఒక్క అనుభంలోని కాలాతీత అంశాన్ని కనుగొనడం మాత్రమే.

ప్రతిదీ ప్రతి ఒక్కదాని మీద తన ప్రభావం చూపుతూంటుంది. ఈ విశ్వంలో ఒక్కటి మార్పుచెందితే అన్నీ మారుతూ వుంటై.

# విషయసూచిక


| | |
|---|---|
| అమృతధార : ఖడ్గధార | 1 |
| వేదాంత బెబ్బులి నిసర్గదత్త | 5 |
| బీడీ బాబా | 8 |
| బోధ గురువులు : బాధ గురువులు | 11 |
| సత్యమిచ్చేది అసత్యం నుండి విడుదలే | 16 |
| జీవితం అర్థమవడానికే సుఖదుఃఖాలు | 19 |
| శరీరాలెన్ని నాశనమైనా, చైతన్యం సజీవమే | 22 |
| అజ్ఞానం అంతమవ్వడమే లోకోపకారం | 25 |
| ఆధ్యాత్మికుడికి జూదరి మనస్తత్వమా? | 28 |
| నువ్వు ఎవరో నీకు తెలియాలంటే... | 31 |
| పదాల పరిమితి | 34 |
| కామవాంఛ | 36 |
| మతమంటే? | 38 |
| సాధు జీవనం దుఃఖరహితం | 41 |
| ఆశ్రమస్థాపన | 44 |
| గురుకర్తవ్యం | 47 |
| సహాయం | 50 |
| అహింస | 53 |
| కర్మ, దేవుడు, ఫ్రీవిల్ | 57 |
| శ్రద్ధగల జీవితం | 62 |

లోకంలో జ్ఞాని పాత్ర 65

అంతటా మేల్కొన్న మనిషి ! 69

'నేను', 'నాది'కి స్వతహాగా ఉనికి లేదు 74

నీ ఊహ లేకపోతే ప్రపంచమే లేదు 76

మనో శరీరాల యెడల మరణించి, జీవించు 78

కాలమూ, దేశమూ, నీ మనసులోనివి 84

ఆగు, చూడు, అర్థం చేసుకో 86

ఆత్మదర్శనానికి అవగాహన అత్యావశ్యకం 88

అవాస్తవాన్ని గట్టిగా చూడు: వాస్తవమవుతుంది 90

సృష్టించేది విశ్వజనీనమైన ప్రేమ 92

కాలాతీతమైన గురువు 94

ఇతడే నీ గురువని ఎలా తెలియాలి? 98

మార్పు అవసరాన్ని స్పష్టంగా గుర్తించు 100

# అమృతధార : ఖడ్గధార

అరుణాచల రమణుణ్ణి ప్రప్రథమంలో గుర్తించి తమ ఇంగ్లీష్ పుస్తకాల ద్వారా ప్రపంచానికి పరిచయం చేసిన వారిలో పాల్ బ్రంటన్, మారిస్ ఫ్రిడ్‌మన్‌లను ప్రధానంగా పేర్కొన్నవచ్చు.



**వృ**త్తిపరంగా ఫ్రిడ్‌మన్ ఎలెక్ట్రికల్ ఇంజనీర్ అయినప్పటికీ, చిన్నప్పటి నుండీ అతడిలో ఉండిన ఆధ్యాత్మికాభిలాష, తపన, అతణ్ణి ఒక మహా అన్వేషకుడిగా రూపొందించాయి. తాను జన్మించిన యూదు మతంతో కొన్నాళ్ళు తంటాలుపడి చూచాడు కానీ, 'ఇది చేయద్దు, అది చేయద్దు, నన్నుసుసరించు, నే దోవ చూపిస్తాను' అనే పద్ధతి మీద అతడికి విసుగెత్తింది. అసలీ ఆధ్యాత్మికత, ఈ అన్వేషణ అంటే ఏమిటో, స్వేచ్ఛగా, సంతోషంగా, జిజ్ఞాసాపూర్వకంగా కనుగొనాలని నిశ్చయించుకున్నాడు. యూరప్‌లో సంచరిస్తున్న శ్రీ జిడ్డు కృష్ణమూర్తిని కలవ నారంభించాడు. సుమారు ఒక అర్ధ శతాబ్దంపాటు కృష్ణమూర్తితో సన్నిహితంగా ఉన్నాడు. అసలు కథ ఎప్పుడు ప్రారంభమయిందంటే 1935లో మైసూరు సంస్థాన దివాన్ సర్ మీర్జా ఇస్మేయిల్ తన యూరప్ పర్యటన సమయంలో ఫ్రాన్స్‌లో ఇంజనీర్‌గా పనిచేస్తున్న ఈ ప్రజ్ఞాశాలియైన ఫ్రిడ్‌మన్‌ను కలిశాడు. భారతదేశానికి వచ్చి తమ సంస్థానాభివృద్ధికి కృషిచేయమని కోరాడు.

వేదాంతం, ఉపనిషత్తుల మీద అప్పటికే అభిమానం పెంచుకున్న యువ ఫ్రిడ్‌మన్ అడిగిందే తడవుగా బయలుదేరి భారతదేశం వచ్చాడు. వచ్చిన రెండేళ్ళలోగానే బెంగుళూరు లోని ప్రభుత్వ విద్యుచ్ఛక్తి పరికరాల ఉత్పత్తి ఫ్యాక్టరీలో సంస్థానానికి సరిపడేటన్ని స్విచ్ గీర్లు, ఇన్సులేటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు చకచకా తయారు చేయించాడు.

ఇంజనీర్ ఫ్రిడ్‌మన్‌కు ఇదంతా ఒక ఎత్తు; అన్వేషకుడైన ఫ్రిడ్‌మన్‌కు తన 'ట్రాన్స్‌ఫర్మేషన్' ఎలా అనేదే ప్రధాన సమస్య. భారతదేశానికి వచ్చిన ఆరు నెలలలోగానే అరుణాచల రమణుణ్ణి సందర్శించి ఆయన బోధను స్వీకరించ నారంభించాడు. తనకు సన్యాసమిప్పించమని రమణుణ్ణి వేడుకున్నాడు.

'అయ్యా, నీకివ్వడానికి నావద్ద సన్యాసి దుకూలాలేవీ లేవు. అదీగాక, నీ వంటి వాడికి, వాటి అవసరమూ లేదు' అన్నాడు శ్రీ రమణుడు. కానీ సన్యాసం మీద ఫ్రిడ్‌మన్ మనస్సు ఎంతగా లగ్నమైందంటే, కర్ణాటకలోని కన్‌గన్‌హాడ్‌లో ఆనందాశ్రమాన్ని నడుపుతున్న స్వామీ రాందాస్ అనే మహనీయుడి వద్దకు వెళ్ళి ఆయన వద్ద సన్యాస దీక్ష పుచ్చుకున్నాడు. శిరోముండన, పాశ్చాత్యవేష విసర్జన, స్వామి భరతానంద అనే నూతన నామధారణ మొదలైనవన్నీ జరిగిపోయినై. భిక్షమెత్తుకుంటానని ప్రతిజ్ఞచేసి, అందుకుగాను ఆఖరికి ఒక భిక్షాపాత్ర కూడా కొనుక్కొన్నాడు.

కానీ శ్రీ కృష్ణమూర్తి, శ్రీ రమణుల సాన్నిహిత్యం కారణాన, ఈ పైపై వేషాలు అనవసరం అనే విషయం మెల్లగా గ్రహించాడు – 1947 నాటికి ఈ వేషధారణ వదిలేశాడు. ఆత్మాన్వేషణ మాత్రం నిరాఘాటంగా సాగిపోతూనే ఉండేది.

మారిస్ ఫ్రిడ్‌మన్, మనిషి ఎటువంటివాడో తెలుసుకుంటే, అతడి మానసిక సన్యాసమెటువంటిదో తెలుస్తుంది. బెంగుళూరు ఫ్యాక్టరీ మేనేజరుగా పనిచేస్తున్న రోజుల్లో ఫ్రిడ్‌మన్ నెల జీతం మూడువేల రూపాయలు. ఆనాడు ఓ సాధారణ మధ్యతరగతి కుటుంబం నలభై, యాభై రూపాయల్లో సంసారం సుఖంగానే ఈదేవారంటే, మూడువేల జీతమెంతటిదో ఊహించుకోవచ్చు. అసాధారణ ప్రజ్ఞావంతుడైన తన విదేశీ ఇంజనీర్, సన్యాసం స్వీకరించి కాషాయాంబరాల్లో కార్ఖానాకు వస్తున్నాడని, శిరోజాలు లేని శిరస్సుతో తిరుగుతున్నాడని, తనకు జీతంగా వచ్చే మూడువేల రూపాయలు దానధర్మాలకు వినియోగించి, తాను భిక్షాటన ద్వారా పొట్టపోసుకుంటున్నాడని తెలిసేసరికి, సర్ మీర్జాకు పట్టరాని ఆగ్రహ మొచ్చింది.

'నేను, ఫ్యాక్టరీలో పనిజేయడానికి ఒక ఇంజనీర్‌ని నియమించాను కానీ, సన్యాసిని కాదు. ముందు ఆ వేషం తీసెయ్' అన్నాడు సర్ మీర్జా.

'నేనిక్కడ వృత్తిపరంగా చేయవలసిన పని అంతా శ్రద్ధగా చేస్తున్నాను. నేను ఏ వేషంలో ఉంటే మీకేమి సంబంధం? కాదు గూడదంటే, ఇదిగో తీసుకోండి రాజీనామా పత్రం' అన్నాడు మారిస్.

ఆ తర్వాత ఇద్దరికీ కాస్త కోపం దిగి వచ్చింది. ఫ్యాక్టరీకి ఎవరైనా ప్రముఖులు వచ్చినప్పుడు సూట్ ధరించేటట్లు, అలాంటి అవసరం లేనప్పుడు మారిస్ తన సన్యాసి వలువలు వేసుకునే వీలు కల్పిస్తూ, ఒక అంగీకారం కుదిరింది.

ఔండ్ (Oundh) అనే ఒక చిన్న సంస్థానంలో గైనకాలజిస్టు సర్జన్‌గా పనిచేస్తున్న నళిని అనే తన మిత్రుడి భార్య ఒకసారి బొంబాయిలో మారిస్‌ను కలిసినప్పుడు 'ఆ సంస్థాన కోశాగారంలో తగినంత డబ్బులేదు. అక్కడ పేదరాళ్ళ ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన కనీస పనిముట్లు కూడా లేకపోతే నేనేమి చేయగలను?' అని తన విచారం వ్యక్తం చేసింది. 'ఎంత కావాలిసుంటుంది?' అని అడిగాడు మారిస్. 'ఓ పదివేల రూపాయలు అవసరముంటుంది' అన్నది నళిని. ఇంతకుముందే మనం అనుకున్నట్లు, పదివేలు అంటే, సామాన్యుడికి ఓ జీవిత కాలానికి సరిపడే మొత్తంగా భావించవచ్చు.

మర్నాడు ఉదయం మారిస్ నళిని వద్దకు నూరు రూపాయల నోట్ల రూపంలో పదివేలు పట్టుకువచ్చాడు. 'పని ప్రారంభం చేయమ్మా' అన్నాడు. తన వద్ద ఎంత ఉంటే అంతా నిస్సంకోచంగా ఇచ్చేశాడు మారిస్. కరుణతో నిండిన అతడి హృదయ మటువంటిది.

జీవితం చరమ దశలో ఈ మహానుభావుడు మరొక మహనీయుణ్ణి తారసిల్లాడు. బొంబాయి నగరంలోని ఒక చిన్న సందులో ఒక సామాన్య గృహంలో నివసించే నిసర్గదత్త మహరాజ్ అనే మహారాష్ట్ర ఆధ్యాత్మికుడితో మారిస్‌కు పరిచయమేర్పడింది. రమణుడు, జిడ్డు కృష్ణమూర్తి వంటి అధ్యాత్మిక సమ్రాట్టుల బోధను అవగాహన చేసుకున్న మారిస్‌కు నిసర్గదత్త మహరాజ్ బోధలోని విశిష్టతను గ్రహించడానికి ఎక్కువసేపు పట్టలేదు.

ఇక అంతే ! వీలైనప్పుడల్లా ఆయన వద్దకు వెళ్ళి కూచునేవాడు. మారిస్‌కు అనేక భాషలు వచ్చు. మరాఠీ కూడా నేర్చాడు. నిసర్గదత్తుని వద్దకు అనేకమంది జిజ్ఞాసువులు, సాధకులూ వచ్చిపోతూంటేవారు ఆయన బోధ యావత్తూ వీరితో జరిపే సంభాషణల ద్వారానే సాగిపోతూండేది.

నిసర్గదత్తుడొక సామాన్య గృహస్థు. ఇంట్లో వాళ్ళు అలవాటు ప్రకారం మాంసం వండితే కొద్దిగా తానూ తినేవాడు. బీడీలు కాలుస్తుండేవాడు. అందువల్లనే పదిమందీ అతణ్ణి 'బీడీ బాబా' అని కూడా వ్యవహరిస్తుండేవారు. కానీ 'కొల్లాయి గట్టితే నేమీ' అని కవివర్యుడు గాంధీజీని గురించి రాసినట్లు, నిసర్గుడు శాకాహారి కాకపోతేనేమి, పొగ తాగితేనేమి, హృదయాంతరాళాల్లో నుండి పుట్టుకొచ్చిన అతడి అనుభవ జ్ఞానం మాత్రం సనాతన, అధునాతన బోధకు ఏ విధంగానూ తీసిపోదు.

నిసర్గుని బోధ ఒక విధంగా 'అమృతధార' అనవచ్చు; మరోవిధంగా 'ఖడ్గధార' అని కూడా అనవచ్చు. ఆ బోధ అతి నిశితమైనది; నిజంగా అర్థమయితే, అర క్షణంలో అహాన్ని విస్ఫోటన చెందించగలిగేటంత శక్తివంతమైనది.

ఒకప్పుడు కృష్ణమూర్తి రమణ బోధామృతాలను గ్రోలి ప్రపంచానికి వాటిని పంచి పెట్టిన మారిస్ మహనీయుడు, తన చివరి కర్తవ్యంగా ఈ నిసర్గని బోధను మరాఠీ నుండి ఆంగ్లంలోకి అనువదించి, లోకానికి తన చివరి కానుకగా సమర్పించుకున్నాడేమో ననిపిస్తుంది.

ఈ పుణ్య పురుషులిద్దరూ బొంబాయిలో తారసిల్లడం, నిసర్గదత్తుని వద్దకు రాకముందే జిడ్డు కృష్ణమూర్తి, అరుణాచల రమణుల సాంగత్య కారణాన ఆధ్యాత్మిక విద్యలో మారిస్ సుశిక్షితుడవ్వడం, నిసర్గని మాటల్ని అమిత ఖచ్చితంగా, నిర్దుష్టంగా ఆంగ్లంలోకి సాధికారంగా అనువదించడం మన అదృష్టం. 'ఐ యామ్ దట్' అనే పేరుతో మారిస్ ఫ్రిడ్మన్ ప్రచురించిన గ్రంథం పాశ్చాత్య దేశాల్లో ఎంత సంచలనం సృష్టించిందంటే, బ్రిటన్‌లోని కొందరు యువకులు లండన్‌లో ప్లేన్ ఎక్కి నేరుగా బొంబాయి వచ్చి ప్లేన్ దిగి నిసర్గని వద్దకొచ్చి ఓ వారం రోజులపాటు సంభాషణల్లో పాల్గొని, మళ్ళీ ప్లేన్ ఎక్కి నేరుగా లండన్ వెళ్ళిపోతూండేవారు.

తన బోధను సంపూర్ణంగా అర్థం చేసుకున్న వారిలో ఫ్రిడ్మన్‌ను ప్రథమంగా పేర్కొంటుండేవాడు నిసర్గదత్త మహరాజ్. అంతేకాక ఫ్రిడ్మన్ ఆధ్యాత్మిక హృదయాన్ని ఎంత లోతుగా చూశాడో ఏమో కానీ, ఫ్రిడ్మన్ మరణానంతరం, అతడి ఫోటోను మిగతా సంతులు, దేవతల ఫోటోల సరసన ఉంచి పూలు కుంకుమలతో అర్చిస్తూండేవాడు మహరాజ్.

# వేదాంత బెబ్బులి నిసర్గదత్త

**పూ**ర్వపు బొంబాయి నగరంలోని ఖేట్‌వాడిలో పదవ సందులో ఒక దుకాణం వుండేది. అక్కడ బీడీలు కొనుక్కోవడానికి వచ్చినవారు నిసర్గదత్త మహరాజ్ దుకాణం నడుపుతూ మాట్లాడుతూ వుంటే, గంటల తరబడి వింటూ వుండిపోయేవారు. ఆ ప్రాంతం లోనే నివసించే వృద్ధులు కొందరు ప్రతిరోజూ ఆ దుకాణం వద్దకు వచ్చి ఆయన మాటలకు సమ్మోహితులై అక్కడే ఆగిపోయేవారు; జరూరుగా చేసుకోవలసిన తమ స్వంత పనుల ఒత్తిడివల్ల, అయిష్టంగానే అక్కడినుంచి వెళుతూండేవారు.

నిసర్గదత్త మహారాష్ట్రకు చెందిన రత్నగిరి జిల్లాలో కంగల్ గాంవ్ అనే కుగ్రామంలో 1897 మార్చి మాసంలో పౌర్ణమినాడు జన్మించాడంటారు; ఆ విషయం నిర్ధారణగా ఎవరికీ తెలియకపోయినా, పెరగడం మాత్రం ఆ గ్రామంలోనే పెరిగాడు. హనుమాన్ జయంతినాడు పుట్టిన కారణంచేత తల్లిదండ్రులు మారుతి' అనే పేరు పెట్టుకున్నారు.

పేదవాడైన తన తండ్రి, ఇల్లు గడవడానికి అవలంబించిన వృత్తులన్నింటిలోనూ పిల్లవాడు సహాయపడుతుండేవాడు – ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకల్ని మేపడం, ఎడ్లబండి తోలడం, పొలంలో కూలీనాలీ పని ఇతర చిల్లర పనులు చేయడం, ఇలా గడిపోపోయింది బాల్యజీవితం. అక్షరం ముక్కకు నోచుకోలేదు. మరి తండ్రి శివరామ్‌పంత్ బీదవాడాయె– పేదవాడి కడుపున పుట్టిన మారుతికి ఇంతకన్న మరేమి దక్కుతుంది? కానీ ఈ పేద బాలుడు తర్వాతి జీవితంలో ఎంతటి అంతరైశ్వర్యవంతుడైనాడో! మారుతికి ఆ చిన్నతనం లోనే ప్రతి విషయాన్ని తఱచిచూసే అతి చురుకయిన మేధ వుండటమే ఈ అంతర్ భాగ్య సాధనకు కారణమనుకోవచ్చు; మనస్సు అనేక ప్రశ్నలతో నిండి వుండేది. ఆ ప్రశ్నలన్నింటికీ సమాధానాలు దొరికేవరకూ అన్వేషించాడు. దొరికిన ఉత్తేజపూరిత సమాధానాలు మన కందించి, మనల్నీ అదే అన్వేషణకై ప్రేరేపించి పోయాడు.

తండ్రికో బ్రాహ్మణ మిత్రుడుండేవాడు – విష్ణుహరిభావ్‌గోరే – మనిషి సాధు స్వభావుడు. అతడు మతపరమైన విషయాలు గంటల తరబడి మాట్లాడుతూండేవాడు. కుర్రవాడు మారుతి అమిత శ్రద్ధగా వింటూండేవాడు. మారుతికి, గోరే ఆదర్శ పురుషుడు. ఆయన శ్రద్ధ, దయ, జ్ఞానం మారుతిని ఎంతగానో ప్రభావితం చేశాయి.

మారుతి పద్దెనిమిదేళ్ళ యవ్వనంలోకి అడుగిడే సమయానికి తండ్రి మరణించాడు. వారికున్న కొద్దిపాటి పొలంమీది ఆదాయం మొత్తం కుటుంబ పోషణకు సరిపోదు. పెద్దన్నయ్య, వృత్తి వెతుక్కుంటూ బొంబాయి నగరానికి వెళ్ళాడు. కొన్నాళ్ళకు మారుతి కూడా అదే దోవ ననుసరించాడు. బొంబాయిలో ఒక ప్రైవేట్ కంపెనీలో చిన్న గుమాస్తాగా పనిచేసి, విసుగు జనించి ఆపని వదిలేశాడు.

"స్వేచ్ఛలేని ఒక జీవితకాలంకన్నా, ఒక్కరోజు స్వతంత్రంగా బ్రతకగలిగితే చాలు' అంటుండేవాడు తర్వాతి కాలంలో. తలలో ఆ భావం అప్పుడే మెదిలినట్టుంది. చిల్లర సామాన్ల అమ్మకం ప్రారంభించాడు. పిల్లల దుస్తులు, పొగాకు, బీడీలు అమ్మే దుకాణం తెరిచాడు ఖేట్‌వాడిలో. లాభం గడించ నారంభించాడు. పెళ్ళిచేసుకున్నాడు. ఒక మగపిల్లవాడు, ముగ్గురు ఆడపిల్లలు సంతానం కలిగారు.

అదృష్టం కలిసి వచ్చింది. వ్యాపారం అభివృద్ధి చెందేసరికి, తన ప్రథమ దుకాణం లాంటివే ఎనిమిది దుకాణాలు తెరిచాడు. మధ్యవయస్కుడయ్యేంతవరకూ, అందరిలాంటి జీవితమే గడిపాడు. మిత్రుడు. యశ్వంత్‌రావ్ ద్వారా నవనాథ్ సంప్రదాయానికి చెందిన శ్రీ సిద్ధరామేశ్వర్ మహరాజ్‌ని తారసిల్లాడు. అతడు మంత్రోపదేశం చేసి ధ్యానమార్గం చెప్పి పంపాడు. సాధన ప్రారంభంలో మారుతికి అద్భుత దృశ్యాలు గోచరించేవి. మధ్య మధ్య మూర్ఛావస్థ వంటి సమాధిలోకి జారుకునేవాడు.

ఒకరోజున, మారుతి హృదయ కుహరంలో ఏదో 'భావ విస్ఫోటన' సంభవించింది. సాంసారిక జీవితంలోని మారుతి 'మాయమై' ఆ స్థానంలో ఏదో విశ్వచైతన్యం, శాశ్వత జీవితం, ప్రవేశించినై. నిసర్గ (సహజస్థితి) దత్త అనే నూతన నామం స్థిరపడింది. అయితే జ్ఞానిగా రూపొంది, నలభై అయిదేళ్ళపాటు ఆ జ్ఞానాన్ని పదిమందికీ పంచిన ఈ నిసర్గదత్త మహరాజ్ ఆ విశ్వచైతన్యంలో అలాగే వుండి పోయి 'దిగిరాను, దిగిరాను, దివినుండి భువికి' అనలేదు. ద్వివిధ జీవితాన్ని నిరాటంకంగా కొనసాగించాడు. దుకాణం నడుపుతూనే వుండేవాడు. హృదయంలో పెల్లుబుకుతున్న జ్ఞానాన్ని దోసిలొగ్గిన వారికి పోస్తూనే వుండేవాడు. ఒక దశలో కుటుంబాన్ని, లాభసాటి వ్యాపారాన్ని వదిలేసి హిమాలయాలవైపు కాలినడక సాగించాడు. అక్కడే తిరుగుతూ జీవితాన్ని అంతం చేసేద్దామనుకున్నాడు.

కానీ, నిధి అలా అనుకోలేదు. విపణి వీధిలో పలురకాల బేరసారాలు, గడబిడలు, నిత్యవ్యవహారాల మధ్య బొంబాయి నగర గల్లీలో, పాశ్చాత్య సందర్శకులు 'వేదాంత బెబ్బులి'గా అభివర్ణించిన నిసర్గదత్త, తన చెంతకు వచ్చిన వారందరికీ బోధగఉపేటట్టు చేసింది.

*నీలంరాజు లక్ష్మీప్రసాద్*

పులివాతను పడినవాడు తప్పించుకోలేడంటారు. వేదాంత బెబ్బులిగా పేర్కొనబడిన నిసర్గదత్త బోధను శ్రద్ధగా విన్నవాడు అసలే తప్పించుకోలేడు. శిష్యుని శ్రేయస్సు కొఱకై, నిసర్గ ఎలాపడితే అలా ప్రవర్తించేవాడు. ఒక్కొక్క సమయంలో ఒక్కోరకంగా వుండేది ఆయన ప్రవర్తన. దయాళువు, సున్నిత మనస్కుడు, ఓరిమి గలవాడు అన్నట్టుగానూ ప్రవర్తించేవాడు. అతడి మనో ఆకాశం ఒకసారి మబ్బులు లేనట్టుగా కనిపించేది. మరోసారి ఉరుములతో మెరుపులతో కూడుకొని వుండేది.

స్నేహశీలి అనీ, సుకుమార హృదయుడనీ, చతురోక్తిపరుడనీ, పూర్తి నిర్భయస్థుడనీ, సత్యవ్రతుడనీ, స్ఫూర్తిప్రదాత అనీ, తన వద్దకు వచ్చిన వారికందరికీ మార్గం చూపిస్తూ బలపరుస్తూ వుండేవాడని అంటాడు మారిస్ ఫ్రిడ్‌మాన్.

నిసర్గదత్త ప్రవర్తన, మరెందరో మర్మయోగుల లాగానే, బాహ్యంగా అనేక విరుద్ధ భావాలతో కూడుకుని వున్నట్టు కనిపించినా, నిజానికి అతణ్ణి ఏ భావమూ అంటేది కాదు; శిష్యుని శ్రేయస్సే అతడి పరమధ్యేయంగా వుండేది.

కురుక్షేత్ర యుద్ధ భూమిలో గీతను బోధించిన శ్రీకృష్ణునివలె, మార్కెట్ రణగొణ ధ్వనుల మధ్య, తన ఇంటి మేడమీద పదిమంది తీరిగ్గా కూచోడానికి కూడా చోటులేని ఓ చాలీచాలని గదిలో, తన బోధను సాగించిన నిసర్గదత్త మహాశయుడు, 'మౌనికిల్లైననేమి, అడవైననేమి?' అనే సత్యాన్ని రుజువు చేశాడు.

# బీడీ బాబా

మనమెవరో మనకు తెలియదు. మన మూలం నుండి మనం చాలాదూరం పయనించిన వారం. ఆప్తులు ఎవరైనా గట్టిగా కేకపెట్టి పిలిచినా, మనకు వినిపించనంత ఎడం ఏర్పడ్డది.

మనం మన మూలం వద్దకు రమ్మని పిలుస్తున్నాడు నిసర్గదత్త మహరాజ్. ఇన్నాళ్ళుగా మనం నేర్చినదంతా మరొకరి వద్దనుండి; స్వయంగా మననుంచి మనం నేర్చుకున్నదంటూ ఏమీలేదు. భిక్షాపాత్ర పట్టుకొని ఇతర్ల ప్రేమకై అర్థించాము. మనమే ఇతర్లపై, ఏమీ ఆశించకుండా, ఇంత ప్రేమ కురిపించగల్గిన సమర్థులం కాదు. మనకు కలిగే సంతోషం కానీ, దుఃఖం కానీ మరొకరి వల్ల జనిస్తున్నది; రెండూ మనలో నుండే మన ద్వారానే సంభవిస్తున్నాయని మనం గ్రహించగలిగి లేము.

నిసర్గదత్త మనల్ని మనం చూసుకునేట్లు చేస్తాడు. మన స్వభావం కనుగొనే వరకూ మనల్ని వదలడు.

నిసర్గదత్త జీవితం ఎలా సాగిందో ఒకసారి చూద్దాం. ఉదయం నాలుగు గంటలకు నిద్రలేచేవాడు. తన ఇంటి ఎదురుగా వున్న పబ్లిక్ పాయిఖానా వాడాల్సిన పరిస్థితి; అక్కడి దుర్గంధాన్ని అలాగే సహించేవాడు. ఇంట్లో స్నానాలగది అంటూ ఏదీ విడిగా లేనందువల్ల వంటయింట్లోనే స్నానం చేసేవాడు. ఈ నేపథ్యాన్ని ఎందుకు వివరించాల్సి వచ్చిందంటే, ఆ మహాశక్తి తాను ఎన్నుకుంటే, ఎక్కడైనా ఎట్టి దుర్భర పరిస్థితుల్లోనైనా ప్రకటితమవుతుంది అని తెలియజేయడానికి.

అది అరవిందయోగికి జైలుగోడల మధ్య, కబీరుకు అతడి లేమిలో, కుండలు తయారుచేసి అమ్ముకుంటూ బ్రతికిన గోరా దారిద్ర్యంలో, రాణా భార్య అయి వుండి కూడా బజార్నపడి కృష్ణభక్తిని ప్రకటించిన మీరా సామాన్య జీవితంలో, ఇక్కడ అక్కడ అనే తేడా లేకుండా ప్రకటితమయింది. అది బాహ్యాభాగ్యం. బాహ్య సంపత్తిని చూడడం లేదు; అంతర్ భాగ్యానికి అందరూ అర్హులే. మానవులే కాదు, జీవరాశిలో సాధులక్షణాలు ఏర్పడిన ఏ జీవమైనా ఒకటే.

నిసర్గదత్త, తన కొద్దిపాటి ఇంటి మిద్దె మీద ఒక చిన్నగదిలో కూచొని ప్రసంగిస్తుండేవాడు; గట్టిగా పదిహేను ఇరవైమంది కూడా కూచోడానికి ఆ గది చాలేది కాదు. కొంతమంది మేడమెట్లమీద కూచొని కూడా వింటుండేవారు. నిసర్గ ఏ కాషాయ వస్త్రాలు ధరించేవాడు కాదు. ఒకప్పుడు మాంసాహారం తింటుండేవాడు. ఇదేమిటని ఎవరైనా అడిగితే, "మాంసాహారం ప్రత్యేకంగా వండిపెట్టమని నేను కోరను. వాళ్ళ అలవాటు కొద్దీ ఇంట్లో వాళ్ళు చేస్తే, 'తినను' అని అనను" అని సమాధానమిచ్చేవాడు.

ఇక్కడ సాత్వికాహార నియమాన్ని ఉల్లంఘించమని ఉద్దేశం కాదు. కానీ ఒక్కో దేశంలో ఒక్కో ప్రాంతపు ఆచారం ఒక్కోరకంగా వుంటుంది. వంగదేశంలో నివసించిన రామకృష్ణ పరమహంస అక్కడి అలవాటు ననుసరించి మీనభక్షణ చేసేవాడు. జిడ్డు కృష్ణమూర్తి గారు కోడిగుడ్ల వంటకాలు తినేవాడు. అందుకై వీరందరినీ నిరసించగలమా? పూర్వబందిపోట్ల బారిన పడిన ఒక చైనీస్ యోగి, వారందరూ మాంసం ముక్కలు వేసి పులుసు వండుకుంటే, తన ఆహారం కోసం, తనకు కావలసిన పులుసు గరిటెతో తీసుకునేటప్పుడు, అందులోకి మాంసపు ముక్కలు రాకుండా జాగ్రత్తపడి, ఆ పులుసుతో తినేవాడు. తానున్న పరిస్థితుల్లో అంతకన్నా మరేమీ చేయగలిగిలేడు.

ఈ విషయమై అరుణాచల శ్రీరమణుల వారితో జరిగిన సంభాషణనొకదానిని గమనించండి.

శ్రీరమణులు : కొన్ని వంటకాలు రుచికరమైనవనీ, మంచివనీ మనసు తన అలవాటు ననుసరించి అనుకుంటుంది. శాకాహారంలోనూ మాంసాహారంలోనూ, తగిన పోషక పదార్థాలు లభిస్తూనే వున్నాయి. కాన మనసు తన రుచి ననుసరించి అభిలషించే ఆహారమే కావాలంటుంది.

ప్రశ్న : సత్య సాక్షాత్కారం పొందిన మనిషికి కూడా మీరు చెప్పే నియమాలు వర్తిస్తాయా?

శ్రీరమణులు : వర్తించవు. అతడు నిలకడగా వుంటాడు. కాబట్టి, తీసుకునే ఆహారం అతణ్ణి ప్రభావితం చేయగలిగి లేదు.

నిజానికి నిసర్గదత్త తర్వాతి కాలంలో శాకాహారమే తీసుకుంటుండేవాడు; కానీ, చిన్నప్పుడు అలవాటైన బీడీలు తాగడం మాత్రం జీవితాంతం కొనసాగించినట్లే కనిపిస్తుంది. అందువల్ల బొంబాయిలో ఇతడ్ని బీడీబాబా అని వ్యవహరిస్తుండేవారు. కానీ రామకృష్ణ పరమహంస, వివేకానందుడు తమ జీవితాల్లో అడపాదడపా గంజాయి సేవించినట్లు

తెలుస్తుంది; రామకృష్ణ సంస్థకు చెందిన స్వామి ప్రేమానంద, స్వామి ప్రభవానంద–వీరిద్దరూ అమెరికాలో నివసిస్తుండేవారు–సిగరెట్లు కాల్చేవారు.

ఈ అలవాట్లకు మరీ ఎక్కువ ప్రాధాన్యమివ్వడం అంత సరికాదు. జ్ఞానం మన ఆంతర్యాన్ని సంపూర్ణంగా మార్చేస్తుంది, అనే మాట ఎంత నిజమో, బాహ్యంగా మనల్ని ఎలా జీవింపజేస్తుందో మనం చెప్పలేము అనేది కూడా అంతే నిజం. స్నానపానాలు లేకుండా ఏదిపడితే అది తింటూ అపరిశుభ్ర వాతావరణంలో జీవించిన గొప్ప దైవ భక్తులు, ఫకీర్లు ఉన్నారు. నిత్యమూ కావేరీ నదిలో స్నానంచేసి పూజా నైవేదికాలు కావించి, నిష్ఠగా బ్రతికిన మహానుభావులూ వున్నారు. అనేక రకాల పూలు పరిశుభ్ర వాతావరణం లోనూ పుష్పిస్తాయి. మరి తామర పుష్పమేమో బురదలో నుండి అందాలు విరజిమ్ముతూ వెలికి వస్తుంది.

నిసర్గదత్త ఏదో సందర్భంలో, "నేనొక పురుషాకారంలోనున్న మానవుడిగా భావిస్తాను. వివాహమాడి పిల్లల్ని కన్నాను. అటు తర్వాత నా గురువును తారసిల్లాను. ఆయన దీక్ష ఇచ్చిన అనంతరం నేను ఆ బ్రహ్మమునే అని కనుగొన్నాను" అన్నాడు.

నిసర్గదత్త దైనిక కార్యక్రమం ఇలా వుంటుండేది: తెల్లవారుఝాము నాలుగు గంటలకు నిద్రలేచి కాలకృత్యాలు తీర్చుకొని, గురువు ఫొటోకు హారతిపట్టి, సామాన్యులకు మూర్ఛలా కనిపించే సమాధిస్థితిలోకి జారుకునేవాడు. ఉదయం ఐదు గంటలవేళకే దుకాణం తెఱచి, తమలపాకులు, వక్కలు, బీడీలు లాటరీ టిక్కెట్లు అమ్ముతూ కూచునేవాడు. కాసేపయిన తర్వాత అతడి కొడుకు వచ్చి దుకాణ నిర్వహణ చూచుకునేవాడు. అప్పుడు నిసర్గ తన ఇంటి మిద్దెమీదికి వెళ్ళి, ధ్యానిస్తూ కూచునేవాడు. ఆ తర్వాత సమర్థ రామదాసు రాసిన దాసబోధ' పఠించేవాడు. సుమారు ఎనిమిదిన్నర గంటల వేళకు తన బృందంతో భజనచేస్తూ తన్మయు డయ్యేవాడు. పదిగంట లయినప్పటినుంచీ, తనను చూడవచ్చేవారు రావడం ప్రారంభమయేది.

# బోధగురువులు : బాధగురువులు

కళ్ళప్పజెప్పి, ఊరక చూస్తూ కూచునే వారంటే, నిసర్గదత్తకు ఇష్టముండేది కాదు.

తనని చూస్తూ కూచుంటే ఒరిగేదేమిటి? వచ్చినవాళ్ళు చురుగ్గా పాలు పంచుకుంటూ తాను చెప్పే మాటల్ని అర్థం చేసుకుంటేనే తనకీ వారికీ సాఫల్యముంటుంది. అందుచేత "ఇక్కడ గదిలో తగినంత చోటు లేదు కాబట్టి క్రింది గదిలో కూచోండి. కొత్త అభాగ్యగతులు వచ్చి కూచోడానికి వీలు కల్పించండి' అని విజ్ఞప్తి చేస్తుండేవాడు. ఊరక చూస్తూ వుండి పోయేవారిని, పదిరోజులకన్నా ఎక్కువ కాలం తన సమక్షంలో వుండనక్కరలేదని అంటుండేవాడు. అలాంటివారిని చూచి విచారం చెందుతుండేవాడు. ఎక్కడైనా ఆశ్రమంలో చేరి అక్కడేదైనా సాధన ప్రారంభిస్తే వారికే మేలు అంటుండేవాడు. కేవలం శ్రద్ధాన్వితులైన అన్వేషకులే తన వద్దకు రావాలని కోరుకునేవాడు.

బోధ గురువు మనస్సు ఇలానే ప్రవర్తిల్లుతుంది. బోధను అర్థం చేసుకోవాలనీ, ఆ విధంగా శ్రోతలు విముక్తమవాలనీ ఆరాటపడుతుంటాడు.

బాధగురువుల తరహా వేరుగా వుంటుంది. తమ శిష్యుల సంఖ్య ఇంత అని చెప్పుకోవాలి. శిష్యుల తలలోకి ఏమి ప్రవేశించింది, వారు ఎంత మాత్రం అర్థం చేసుకున్నారు అనే ప్రశ్నలతో నిమిత్తం లేదు. వారి ద్వారా తన ప్రయోజనాలు ఏమి సిద్ధిస్తాయి అనే ఆలోచన నడుస్తూ వుంటుంది.

నిసర్గదత్త తన గురువు మాటల్ని తన ఆహారంగా వర్ణించేవాడు. వాటిని తాను ఆలకించాననే బదులు, భుజించానని అంటుండేవాడు. ఆ విధంగా తన శరీరమంతా శ్రవణ యంత్రమై పోయిందనేవాడు.

తన శ్రోతలతో "గురువును మీ హృదయంలో వుంచుకోండి" అని చెప్తూ "అయితే నేను మాత్రం మీ గురువును కాను" అని హెచ్చరించేవాడు.

తన అంత్యదశలో నిసర్గదత్త "ఒక విధంగా నేనిక్కడ మీకు కనిపించకపోవడమే, సంపూర్ణంగా నేనిక్కడ వున్నట్లు అర్థం చేసుకోండి. నేను మరణించే క్షణం, నా ఆనంద పారవశ్యం మిన్నుముట్టిన క్షణమని గ్రహించండి" అన్నాడు.

ఆత్మని గురించి మాట్లాడుతూ ఒకసారి "ఆత్మజ్ఞానంలో ఆత్మని విస్మరించడం అనేది కూడా వుండనే వుంది. ఈ లోకాన్ని చూస్తూ దీనిని గురించి తెలుసుకోడానికి, ఆత్మని విస్మరించక తప్పదు. అదేవిధంగా ఆత్మని తెలుసుకోడానికి లోకాన్ని విస్మరింపక తప్పదు. ఆత్మసాక్షాత్కారంలో దేనినీ అంటిపెట్టుకోడమూ లేదు. విస్మరించడమూ లేదు. అన్నీ తెలుస్తుంటాయి. ఏదీ జ్ఞాపకం వుంచుకోవడముండదు"

"సత్యం కనుగొన్నానని నాకెప్పుడు తెలుస్తుంది?" అని ఎవరో ప్రశ్నించారు. "ఇది నిజము. అది నిజము" అనేది అసలు ఉదయించకుండా పోయినప్పుడు. సత్యం తనను తాను గట్టిగా ప్రకటించుకోదు. అసత్యమైన దానిని అసత్యమైనది అని చూచి, పక్కకి నెట్టేయడంలో సత్యం ప్రకటితమవుతుంది. మనసు అసత్యమైన దానిని చూడలేని అంధత్వంలో వున్నంతకాలం సత్యానికి వెతుకులాడడం నిరర్థకం. మనసులోని అసత్యాన్ని సంపూర్తిగా క్షాళన సలిపిన తర్వాతనే సత్యముదయించగలదు" అన్నాడు.

"ఫలాని అయన త్యజించాడు' అనే మాట వచ్చినప్పుడు నిసర్గదత్త మహారాజ్ ఇలా అన్నాడు: "అన్నీ వదిలేయడం అంటే, వదిలేయడానికి నీకు నిజానికి ఏమీలేదని తెలియడమే; ఈ భూమి మీద నీ సొంతమైనది ఏమున్నది? గాఢ నిద్రావస్థలో, నువు పడుకున్న పరుపును 'వదిలేస్తున్నావా'? నిద్రించేసరికల్లా పరుపును మర్చిపోతావు"

'ప్రేమనెలా సాధించాలి? వినయాన్ని ఎలా సంపాదించాలి?' అని ఎవరో అడిగారు.

"పుష్పాల సుగంధాన్ని ఎలా ఆఘ్రాణిస్తున్నావ్? అక్కడి పుష్పమూ తన సుగంధం వెదజల్లడానికి ఏ ప్రయత్నమూ చేయడంలేదు. నువ్వూ ఏ ప్రయాసపడకుండా ఆఘ్రాణిస్తున్నావ్" అన్నాడు నిసర్గదత్త.

ఇంగ్లీషు భాషలోని 'యు' అనే పదాన్ని ఏదో కొన్ని సందర్భాలలో తప్పితే, మిగతా అన్ని వేళలా 'నీవు', 'నువ్వు' అనే అనువదించాను. నిసర్గతో సంభాషించిన వ్యక్తులమీద గానీ, పాఠకులమీద గానీ గౌరవం కొరవడిగాదు. 'నువ్వు' అనే పదమే సూటిగా బాణంలాగా తగులుతుంది. కొన్ని సంభాషణల్లో నిసర్గచేత అవతలి వ్యక్తిని 'మీరు' అనే సంబోధించిప చేసినప్పటికీ, చివరకొచ్చేసరికి మర్యాదసూచకంగా వాడిన 'మీరు' 'నువ్వు'గా మారిపోయి వుంటుంది. పృచ్ఛకుడి శ్రేయస్సే కాంక్షించే నిసర్గ ఆత్మీయమైన 'నువ్వు' తప్పితే మరొక పదం వాడలేదు.

ఓ పాశ్చాత్య అన్వేషకుడితో నిసర్గదత్త నడిపిన సంభాషణ చూద్దాం.

నిసర్గ : కోర్కెలు కలగడం, అవి నెరవేరడం, భయాలు జనించడం, వాటి నుండి తప్పించుకోడం, మొదలైన వాటితో కూడుకున్న నీ ప్రపంచము నిశ్చయంగా నా ప్రపంచం

కాదు. నీ ప్రపంచమసలు నాకు కనిపించను కూడా కనిపించదు – నువు దానిని గురించి చెప్తుంటే వినడం తప్ప; అది నీ స్వకీయ స్వాప్నిక ప్రపంచం. దానిని గురించి నే చెప్పగలిగిందల్లా నువ్వు కలలు కనడం మానేయమని మాత్రమే చెప్పగలిగి వున్నాను.

**ప్రశ్న :** యుద్ధాలు, విప్లవాలు, స్వప్నాలని మీరైనా అనలేరు గదా; రోగిష్ఠి తల్లులూ, ఆకలితో మలమలలాడే పిల్లలూ స్వప్నాలు కాదు. అక్రమ మార్గాల ద్వారా సంపాదించే భాగ్యమూ, అది దుర్వినియోగం జరుగుతూ వుండటం స్వప్నమవదు కదా?

**నిసర్గ :** ఇంకా ఏమేమి చెప్పదలచుకున్నావు?

**ప్రశ్న :** స్వప్నాన్ని పంచుకోలేము.

**నిసర్గ :** అలాగే మేల్కొన్న స్థితిని కూడా పంచుకోలేము. మూడు అవస్థలూ– స్వప్నావస్థా, నిద్రావస్థా, జాగ్రదావస్థ – ఈ మూడూ కూడా వ్యక్తిపరమైనవి. కేవలం ఆ వ్యక్తికి మాత్రమే చెందినవి. ఈ మూడు అవస్థలూ కూడా, ఈ చైతన్యంలోని 'నేను' అనే చిన్న బుడగకే సంభవిస్తాయి. ఆ బుడగలోనే వుంటాయి. అసలు ప్రపంచం, ఈ 'స్వ'కు అవతల వుంటుంది.

**ప్ర :** 'స్వ' అనండి, 'స్వ' రహితమనండి; ఎట్ట ఎదుట కనిపిస్తున్న విషయాలు వాస్తవాలు.

**ని :** ఎట్ట ఎదుట కనిపించేవి వాస్తవాలే, అందుకు సందేహమేమున్నది? నేను వాటి మధ్యనే జీవిస్తున్నాను. కానీ నువ్వు, నీ భ్రాంతుల మధ్య జీవిస్తున్నావు. వాస్తవాల నడుమ కాదు. వాస్తవాలెప్పుడూ ఒక దానితో మరొకటి సంఘర్షించవు. కానీ నీ జీవితమూ నీవు చూచే ప్రపంచమూ, ఈ రెంటికీ ఎన్నో వైరుధ్యాలు. వైరుధ్యమనేది అవాస్తవమైన దాని చిహ్నమన్న మాట. వాస్తవమైనది ఏనాడు వైరుధ్యానికి గురికాదు.

మాట వరుసకు, మనుషులు దుర్భర దారిద్ర్యంలో మ్రగ్గుతున్నారని నీవు మొరపెడ్తున్నావు. అయివుండి కూడా నీ భాగ్యాన్ని వారితో పంచుకోవు. నీకు సమీపాన జరిగే యుద్ధం గురించి చింతిస్తావు కానీ, అదే ఎక్కడో దూరాన సంభవిస్తే, దానిని గురించి తలచుకోను కూడా తలచుకోవు. నీ లాభనష్టాల ననుసరించి నీ విలువలు ఏర్పడుతూ వుంటాయి. 'నేనిలా అనుకుంటున్నాను 'నాకిదికావాలి', 'నేనిది చేసితీరాలి', ఇలాంటివన్నీ నీకు తిరుగులేని సత్యాలుగా రూపొందుతూ వుంటాయి.

**ప్ర :** అయినప్పటికీ, జరిగే పాపమూ కీడూ వాస్తవాలే కదా?

**ని :** నువ్వెంత సత్యమో, అవీ అంతే. సమస్యని అపార్థం చేసుకోడం, దుర్వినియోగ పరిచే దృష్టితో దానిని సమీపించడం మొదలైన వాటి నుండే పాపమూ, కీడూ జనిస్తున్నాయి. ఇదో విషవలయం.

**ప్ర :** దీనిని ఛేదించగలమా?

**ని :** మిథ్యావలయాన్ని ఛేదించనవసరం లేదు. ఉన్నది ఉన్నట్లు చూడడమే – 'ఇది లేనిది' అని గ్రహించడమే.

**ప్ర :** కానీ, ఇది మనల్ని లొంగదీసి సహింపజేసే అవమానాలూ, దుర్మార్గాలూ, మనం ఇతర్లపై ఇలాంటివే జరుపుతుండడాలూ, ఈ వాస్తవమేమీ తగ్గడం లేదు కదా?

**ని :** వెర్రి, ఉన్మాదం అనేవి సార్వజనీనం. మానసిక స్వస్థత చాలా అరుదుగా కనిపిస్తుంది. అయినప్పటికీ, ఆశను వీడనక్కరలేదు. ఎందుచేతనంటే, మన ఉన్మాదాన్ని మనం చూసీ చూడడంతోనే మానసిక స్వాస్థ్యంవైపు అడుగుపడ్డదన్నమాటే. గురువు యొక్క కర్తవ్యమిదే – మన దైనందిన జీవితంలో మనం ప్రదర్శించే వెర్రి లక్షణాలను చూసేట్లు చేయడమే. జీవితం నిన్ను చైతన్యవంతుణ్ణి చేస్తుంది. కానీ గురువు నిన్ను ఎఱుకగలవాడిగా చేస్తాడు.

**ప్ర :** (శ్రీరాముడు క్రీస్తు మొదలైన మహానుభావులు భూమి మీదికి వచ్చి వెళ్ళారు. అయిననప్పటికీ ప్రజల మనస్తత్వంలో ఆనాటికీ ఈనాటికీ వచ్చిన మార్పేమీ లేదు అనే ప్రస్తావన చేస్తూ) ఈ మహనీయులు కానీ, ఆ మాటకొస్తే మీరు కానీ ఈ ప్రపంచం ఏ బంధంలోనైతే చిక్కుపడిపోయిందో దానిని తొలగించడానికి ఏమి చేయగలిగారు?

**ని :** నువు సృష్టించిన ఈ బంధమనే చిక్కుముడిని నువ్వే విప్పగలిగి వున్నావు. దీనికంతటికీ మూలం నీ మొండి స్వార్థమే. ముందు నీ ఇల్లు చక్కదిద్దుకో; నీ పని పూర్తయినట్లే.

**ప్ర :** జ్ఞానులైనవారు ఎన్నో త్యాగాలు చేసి ఎన్నో కష్టాలకోర్చి తమ జీవితాలను సరిదిద్దుకున్నారు. ఏమిటి దాని ఫలితం? ఆకాశంలో దూసుకుపోయే ఒక నక్షత్రం వెలుగు ఎంతటిదైనా, రాత్రి చీకటిని తగ్గించలేదు కదా?

**ని :** వారిని గురించీ, వారి పనిని గురించీ తీర్పు చెప్పడానికి నువ్వూ వారిలో ఒకడివవాలి. కూపస్థమండూకానికి గాలిలో విహరించే పక్షుల సంగతి తెలియదు.

**ప్ర :** అంటే మీరనేది, మంచి చెడుల మధ్య గోడే లేదంటారా?

**ని :** గోడలేకపోవడానికి కారణం, మంచి చెడూ అనేవి లేవు కాబట్టి, ప్రతి యధార్థ పరిస్థితిలోనూ అవసరమైనదీ, అనవసరమైనదీ అనేవి మాత్రం వున్నాయి. అవసరమైనది ఒప్పు, అనవసరమైనది తప్పు.

ప్ర : నిర్ణయించేది ఎవరు?

**ని :** పరిస్థితే నిర్ణయిస్తుంది. ప్రతి పరిస్థితీ ఒక సవాల్; దాని యెడల సరిగా స్పందించగలిగి వుండాలి. స్పందన సరిగా వుంటే, సమస్య తీరినట్లే. స్పందన గనక సరిగా లేని పక్షంలో సవాల్‌ని ఎదుర్కొన్నట్లు కాదు; అప్పుడు సమస్య అలాగే వుండిపోతుంది. నీ అపరిష్కృత సమస్యలే నీ కర్మను రూపొందిస్తుంటాయి. వాటిని సరిగ్గా పరిష్కరించు. స్వేచ్ఛనొందు.

ఈ మంచీ చెడూ అనేవి వాటంతట అవి నా లోకంలో వుండవు. అవసరమైనది మంచిది, అనవసరమైనది చెడ్డది. నీ లోకంలో సుఖప్రదమైనది మంచిది, బాధాకరమైనది చెడ్డది.

**ప్ర :** ఏది అవసరమంటారు?

**ని :** ఎదగడం అవసరం. మంచిని మించిన దాని కొఱకై మంచిని వదిలేయడం అవసరం.

**ప్ర :** ఎందుకు? ఏమి సాధించడానికట?

**ని :** సాధించేది ప్రారంభంలోనే వున్నది. ఎక్కడ ప్రారంభిస్తావో అక్కడే అంతమవుతుంది – కేవలంలో.

**ప్ర :** అయితే ఈ అవస్థంతా దేనికి? ఎక్కడ ప్రారంభించావో అక్కడికే తిరిగి రావడానికా?

**ని :** ఎవరి అవస్థ? ఏమి అవస్థ? పెరిగి పెద్దదై అనేకానేక వృక్షరూపాలను ధరించి, మహారణ్యంగా రూపొందేంతవరకూ విస్తరిల్లే విత్తనాన్ని చూచి జాలిపడతావా? 'జీవించడం అనే చికాకు ఈ శిశువుకు ఎందుకొచ్చిన తంటా అని, ముందే చంపేస్తావా? జీవితంలో కానీ, మరింత హెచ్చుగా జీవించడంలో కానీ వున్న దోషమేమిటి? జీవి ఎదగడానికి ఆటంకంగా వుండే వాటినన్నిటినీ తొలగించు; నీ వ్యక్తిగతమైన సాంఘిక, ఆర్థిక, రాజకీయ సమస్యలన్నీ ఇట్టే మాయమవుతాయి. ఈ విశ్వాన్ని మొత్తంగా చూచినట్లయితే, ఇది పరిపూర్ణమైనది; ఈ విశ్వంలోని ఒక భాగం ఈ పరిపూర్ణత్వానికై ప్రయత్నించడం ఆనందాతిశయానికి ఒక మార్గం. అపరిపూర్ణమైన దానిని, సంపూర్ణమైన దానికై స్వేచ్ఛగా త్యజించు. అప్పుడే మంచీ చెడూ అనే చర్చ వుండదు.

**ప్ర :** అయినప్పటికీ ఇంతకన్నా మేలైనదంటే మనకు భయమే; మరింత చెడ్డనైన దానిని అంటిపెట్టుకు బ్రతుకుతుంటాం.

**ని :** ఇది మన మౌఢ్యం, ఉన్మాదం అంచున వుండే మూర్ఖం.

# సత్యమిచ్చేది అసత్యం నుండి విడుదలే

**ఒ**కరికి శ్రద్ధ వుండటం, మరొకరికి లేకపోవడం ఎందుకు సంభవిస్తుందో మనకు తెలియదు. ఈ సంవాదంలో శ్రద్ధయొక్క మూలాన్ని చర్చిస్తాడు శ్రీ నిసర్గదత్త మహరాజ్. సత్యదర్శనం వల్ల మన జీవితాలకు ఒరిగేదల్లా అసత్యం నుండి విముక్తి మాత్రమే. అయినప్పటికీ కొందరు శ్రద్ధాళువులు సత్యదర్శనానికై తమ జీవితాన్ని అంకితం చేయడానికి కారణం అదొక్కటే. మనిషి చెర, అంటే అతడి దుఃఖం నుంచి విముక్తి కలిగిస్తుంది కాబట్టి ఆ విధంగా అపరిమితమైన ఆనందం అనుగ్రహిస్తుంది కాబట్టినీ.

నిసర్గ : శ్రద్ధ కలిగి వున్నావంటే, నువు ఏ మార్గం ఎంచుకున్నా అది నిన్ను నీ లక్ష్యం వద్దకు చేరుస్తుంది. నీ శ్రద్ధే నిర్ణయాత్మకమైన కీలకాంశం.

**పృచ్ఛకుడు :** ఈ శ్రద్ధ యొక్క మూలమేమిటి?

**నిసర్గ :** పర్వతాల మధ్య ప్రవాహంలో పుట్టిన చేప మళ్ళీ అక్కడికే చేరాలని ఎలా ప్రయత్నిస్తుందో, పక్షి తన సొంతగూటికే తిరగి వెళ్ళడానికి ఎలా చూస్తుంటుందో, స్వస్థానానికి చేరుకుందామనే సహజేచ్ఛ మనిషిలోని ఈ శ్రద్ధకు కారణం. పండు పక్వమైనప్పుడు అందులోని గింజ భూమిచెంతకు చేరిపోతుంది. పక్వమవడమే సమస్తమూను.

**పృ :** ఏది నన్ను పక్వమొందేట్లు చేస్తుంది? నాకు మరింత అనుభవం అవసరమంటారా?

**ని :** నీకు అవసరమైన అనుభవమంతా వుండనే వున్నది; లేకపోయినట్లయితే నువ్వసలు నా వద్దకు వచ్చి వుండేవాడివే కాదు. మరింత అనుభవాన్ని పోగేసుకోనక్కరలేదు సరికదా, నిజానికి నువ్విప్పుడు అనుభవాన్ని దాటివెళ్ళాల్సి వున్నది. ఈ సమయంలో నువ్వు ఏ ప్రయత్నం చేసినా ఏ సాధన మార్గాన్ని అనుసరించినా, అది మరింత అనుభవాన్ని కలగజేస్తుందే కాని, నిన్ను అవతలకి కొంపోదు. గ్రంథపఠనమూ నీకక్కరకు రాదు. అవి నీ మనసును సుసంపన్నం చేయగలవే కానీ, వ్యక్తిగా నువ్విప్పుడు ఎట్లా వున్నావో, అట్లానే వుంచేస్తాయి. భౌతికంగా కానీ మానసికంగా గానీ, ఆధ్యాత్మికంగా గానీ, నీ అన్వేషణ

ద్వారా ఏదో ఫలితం లభిస్తుందని నీవు ఆశిస్తున్నావంటే, అసలు విషయం అర్థం కాలేదన్నమాట.

సత్యం నీకేమీ ఒనగూర్చదు. నీకే కొత్త హోదాను కల్పించదు; ఎవరినీ నీకు స్వాధీనపరచదు; దొరికేదల్లా సత్యమొక్కటీ, నీ అసత్యం నుండి విడుదలాను.

**పృ :** సత్యం కనుగొన్నానని నాకెప్పుడు తెలుస్తుంది?

**ని :** ఇది సత్యం, ఇది అసత్యం అనే భావం జనించకుండా పోయినప్పుడు. సత్యం, 'నేను సత్యాన్ని' అని నొక్కి వక్కాణించదు. అసత్యాన్ని అసత్యంగా గమనించి, తిరస్కరించినప్పుడు, సత్యదర్శనం దానంతట అదే సంభవిస్తుంది. అసత్యం యెడల మనసు గ్రుడ్డిదై ప్రవర్తిల్లినంత కాలం, సత్యాన్ని అన్వేషించడం వ్యర్థం. మనసు నుంచి అసత్యం పూర్తిగా వదిలిపోతేనే, సత్యం ఉదయించగలదు.

వాస్తవాన్ని వెదకదలచుకుంటే, నువ్వు అన్ని రకాల నేపథ్యాలు, అన్ని సంస్కృతులు, అన్ని ఆలోచనలు, అనుభూతుల మూసల నుండి విడుదలనొందాలి. ఆఖరికి పురుషుణ్ని, స్త్రీని, ఆ మాటకొస్తే మానవజాతికి చెందినవాణ్ణి అనే విషయం కూడా విస్మరించాలి.

ఈ జీవితసాగరంలో అన్నీ ఉన్నాయి. అందరూ వున్నారు; మనుషులొక్కరే కాదు, అందువల్ల ముందు నిన్ను నువ్వు మరిచిపో. నిన్ను గురించిన ఏ ఆలోచన–నేను అది అని కానీ, ఇది అనికానీ, ఫలానా అని కానీ– ఏదీ రానివ్వకు. నీ గురించి, నీ క్షేమాన్ని గురించి, భౌతిక ఆధ్యాత్మిక విషయాలను గురించి ప్రతి కోరికలోనూ – అది స్థూలమైనా, సూక్ష్మమైనా, అది సాధించాలనీ, ఇది సాధించాలని, సమస్తమూ వదిలెయ్. నీవు ఇక్కడికిక్కడే సంపూర్ణ మానవుడివి, నీకు అవసరమైనదేమీ లేదు.

దీని అర్థం నువు అనాలోచితంగా, బుద్ధి తక్కువగా జీవించాలని కానీ, రేపు అనేది లేకుండా అంతా వ్యయపరచుకోమనీ, నిర్లక్ష్యంగా బ్రతకమనీ కాదు; నిన్ను గురించి నువ్వు పడే మౌలికమైన ఆదుర్దాను మాత్రం వీడమంటున్నాను. నీకు, నీ వాళ్ళకు ఒకింత తిండి, బట్ట వసతి అవసరం. కానీ ఈ అవసరాలు వుండటం, వేరు. పేరాశ ప్రబలడం వేరు. ఉన్నవాటితో సర్దుకుపోవడం నేర్చుకో; నువు ఊహించినట్లు వుండాలని ఆశించకు"

❖ ❖ ❖ ❖

అధికమైన ఆశ కలిగుండటం ఆధ్యాత్మికునికి తగదని అంటారు. భగవంతుణ్ణి దర్శింపజేసుకోవాలని ఆశించడం, అందుకోసం కృషిసల్పడం అత్యాశ కాదా? అనే సందేహం మనకు జనించవచ్చు. దానికి నిసర్గదత్త మహరాజ్ ఏమంటాడో చూద్దాం.

**పృ :** ఆధ్యాత్మికత నెలకొనడానికి, మనిషి, అత్యాశ నుండి విడివడి తీరాలి అని అంటే, సాధకుడికి ప్రేరణ కలిగించి ముందుకు నడిపించేది ఏది? మనిషైనవాడు విముక్తి సాధించడం అత్యవసరమని యోగశాస్త్రం ఘోషిస్తున్నది. కానీ ఈ దర్శనాభిలాష అన్ని ఆశల్లోకి అతిపెద్ద ఆశ కాదా?

**ని :** అత్యాశ వ్యక్తిగతమైనది. మరి, విముక్తేమో ఈ వ్యక్తి అనే వాని నుండి స్వేచ్ఛ నొందడం. విముక్తిలో ఈ సాధకుడు గానీ, అతడు సాధించబూనిన వస్తువుకానీ వుండవు.

శ్రద్ధ కలిగుండటం వేరు; తాను పడిన కష్టానికి ఫలితం ఆశించడం వేరు. శ్రద్ధ అనేది అసత్యమైన దాని నుండి, అనవసరమైన దాని నుండి, వ్యక్తిగతమైన దాని నుండి, మనిషి అంతరంగంలో కలిగిన స్థలం యొక్క అభివ్యక్తీకరణ అని తెలుసుకోండి.

# జీవితం అర్థమవడానికే సుఖదుఃఖాలు

**జీ**వితమనేది సుఖదుఃఖాల అల్లిక. మనిషికి ఒకటి వాంఛనీయం. మరొకటి అవాంఛనీయంగా కనిపిస్తుంది. రెంటినీ సమాన దృష్టితో వీక్షించి స్వీకరించమంటారు వేదాంతులు. మనకది అసాధ్యంగా కనిపిస్తుంది.

'అసాధ్యం కాదు' అంటూ నిసర్గదత్త మహరాజ్, 'పై పెచ్చు, ఈ రెంటికీ సమ్మతించడం మన జీవితానికి అత్యంతావశ్యకమని' అంటాడు. శారీరక బాధల్ని పరిశోధించిన అరవిందయోగి కూడా, బాధ అట్టడుగున ఆనందం వున్నదని తన యోగ సాధన ద్వారా స్వయంగా కనుగొన్నాడు. తదితర యోగులు కూడా బాధను సాధన క్రమంలో ఓర్చుకోవడం నేర్చుకున్నవారే.

'స్వ'ను నిర్మూలించగల శక్తి 'బాధకే' వున్నదని, అదే 'మహాసుఖాన్ని' వేగంగా అందించగలదనే విషయాన్ని నిసర్గ తన సంవాదంలో తెలియజేసిన తీరు చూడండి" అన్నాడు మిత్రశ్రీ.

**నిసర్గదత్త :** అంటే, నీ అభ్యంతరం సుఖానుభవం యెడల కాదు; తత్కారణంగా సంభవించే నొప్పి, దుఃఖం రూపంలో నువ్వు చెల్లించాల్సిన మూల్యాన్ని గురించేనన్నమాట.

**పృచ్ఛకుడు :** వాస్తవమనేది ఆనంద స్వరూపమైతే, సుఖం ఏదో రకంగా దానికి సంబంధించే వుండాలి కదా?

**నిసర్గ :** వాక్ తర్కంతో మనం ఈ సంభాషణ సాగించి లాభం లేదు. వాస్తవం అందించే ఆనందంలో, దుఃఖం లేకుండాపోదు. అదీగాక నీకు సుఖమొక్కటే తెలుసు; స్వచ్ఛమైన నీ సత్త యొక్క ఆనందం నువ్వెరగవు. అందుచేత సుఖాన్ని దానిస్థాయిలోనే దానిని అర్థం చేసుకోడానికి ప్రయత్నిద్దాం.

నీకు సుఖానుభూతి దుఃఖానుభూతి కలిగినప్పుడు, నీవంక నువ్వు చూసుకుంటే, కేవలం ఆ వస్తువే దానంతటది అదే నీకు సుఖాన్ని గానీ దుఃఖాన్నిగానీ కలిగించడం లేదనీ, ఏ సందర్భంలో ఏ నేపథ్యంలో అదొక భాగంగా ప్రవర్తిల్లిందో, దానినిబట్టి అది సుఖంగానూ, దుఃఖంగానూ నీకు అనిపించింది అనీ, గ్రహిస్తావు. అనుభవించేవాడు,

అనుభవించే వస్తువు మధ్యనున్న సంబంధంలో నుండి సుఖం జనిస్తుంది. ఇకపోతే ఈ సుఖసారం నీ సమ్మతి మీద నీ స్వీకార భావం మీద ఆధారపడి వుంటుంది. పరిస్థితి ఎటువంటిదైనా అది నీకు స్వీకారయోగ్యమైతే, అది సుఖంగానే వుంటుంది. నీకు స్వీకార యోగ్యం కాకపోతే అది నొప్పిని కలగజేస్తుంది.

అది ఏ కారణాన స్వీకారయోగ్యం అనే దానితో నిమిత్తం లేదు; శారీరక మానసిక కారణాలనవచ్చు. లేక మనం కనిపెట్టలేని మరేదైనా కారణమవచ్చు. కానీ దాని యెడల నీ స్వీకార అంగీకార భావం అనేదే నిశ్చయమైన అంతిమ కారణమని గ్రహించు. ఇక దుఃఖమనేది తద్విరుద్ధంగా నీ అనంగీకారం, తిరస్కారం నుండి పుట్టుకొస్తాయి అని వేరే చెప్పనక్కరలేదు.

**పృ :** దుఃఖాన్ని, నొప్పినీ అంగీకరించే ప్రశ్న ఉదయించదు.

**నిసర్గ :** ఎందుకనిట? అసలెప్పుడైనా ప్రయత్నించి చూశావా?

నిజంగా ప్రయత్నించి చూడు. సుఖం అందివ్వలేని ఆనందం నీకు బాధలోనూ, దుఃఖంలోనూ ద్యోకతమవుతుంది. కారణమల్లా బాధను స్వీకరించడానికి అంగీకరించి నప్పుడు, అది నిన్ను సుఖం తీసుకువెళ్ళగలిగిన లోతులకన్నా, మరింత లోతుకు తీసు కెళ్తుంది కాబట్టి.

ఈ 'స్వ' అనేది తన స్వభావరీత్యా సుఖాన్నే అన్వేషిస్తూ, బాధకు దూర దూరంగా తొలగుతుంటుంది. ఈ నమూనాను అంతం చేసినప్పుడు. 'స్వ'ను అంతమొందించినట్లే అవుతుంది. తన కోర్కెలు, తన భయాలతో కూడుకున్న ఈ 'స్వ'ను అంతంచేస్తే, సమస్త సుఖశాంతులకు మూలమైన నీ అసలు స్వభావానికి మరలినట్లవుతుంది. నీలోని కాలాతీతమైన సామరస్యం యొక్క ప్రతిరూపమే, శాశ్వతంగా సాగే ఈ సుఖాన్వేషణ.

సుఖదుఃఖాల సంఘర్షణ మధ్య చిక్కుకున్నప్పుడు ఎంచుకోడం, నిర్ణయించడం అవసరమవుతాయి. అప్పుడే నీకు నువ్వు గుర్తురావడమనేది సంభవిస్తుందనేది ఎవరికైనా తెలుసు. కోరిక, భయాల మధ్య ఏర్పడే ఈ ఘర్షణే ఆగ్రహాన్ని పురికొల్పుతుంది. ఆ ఆగ్రహమే జీవితంలో వుండాల్సిన స్వస్థతను కోల్పోయేటట్లు చేస్తుంది.

బాధను వున్న పళంగా స్వీకరిస్తే– అంటే ఓ గుణపాఠంగానూ, ఒక హెచ్చరికగా అంగీకరించి, మన్నించి దానిలోతుల్లోకి చూచినట్లయితే, సుఖదుఃఖాల మధ్యనున్న తేడా అంతరిస్తుంది. రెండూ కూడా అనుభవంగా రూపొందుతాయి. అడ్డుకుంటే బాధగానూ, స్వీకరిస్తే ఆనందంగానూ తయారవుతాయి.

**పృ :** సుఖం కన్నా బాధే ఎందుకని ఎక్కువ ఉపయుక్తంగా వుండాల్సి వచ్చింది?

**ని :** సుఖాన్ని స్వీకరించడానికి మనిషి ఎప్పుడూ సిద్ధంగా వుంటాడు; 'స్వ' యొక్క శక్తులన్నీ నొప్పిని ఎంతమాత్రం ఒల్లవు. బాధకు అంగీకారం తెలపడమనేది 'స్వ'ను రద్దు చేసినట్లవుతుంది. నిజమైన సుఖం అనగా మహాసుఖానికి ఈ 'స్వ'యే ఆటంకం కాబట్టి, బాధను స్వీకరించడానికి సిద్ధపడినప్పుడు మహాసుఖం ఉబుక్కుంటూ వెలువడుతుంది.

**పృ :** దుఃఖాన్ని స్వీకరించడానికి సిద్ధపడ్డప్పుడు కూడా ఇదే ప్రక్రియ సంభవిస్తుందా?

**నిసర్గ :** నొప్పి, బాధ అనే వాటిని ఎరుక పరిధిలోకి సులభంగా తీసుకొచ్చే వీలున్నది. దుఃఖం విషయంలో అది అంత సులభం కాదు. దుఃఖం యెడల కేవలం ఎరుక కలిగి వుండడం చాలదు; ఇప్పుడు మనమెరిగిన ఈ మనసు ఏదో ఒక సందర్భంలో ఒక దుఃఖానికి లోనవుతుం దనుకోరాదు. అది ఎల్లప్పుడూ దుఃఖిస్తూనే వుంటుంది. ఆ దుఃఖప్రవాహం లోతుల్లోకి వెళ్ళాలి అక్కడ దాని వేళ్ళు, వాంఛ, భయంతో ఎలా పెనవేసుకు పోయాయో చూడాలి. భయంతో ఎలా విధ్వంసం నెరపుకుంటున్నామో, గమనించాలి.

"నిసర్గదత్త చెప్పిన మాటలు సరిగా అర్థం చేసుకోవాలి. మహాసుఖాన్ని కనుగొనడానికి కోరి కోరి బాధను తెచ్చుకోవాలని అనుకోరాదు. దానంతట అది ప్రాప్తించిన బాధనుండి తప్పించుకో చూడకుండా, అదీ దైవానుగ్రహమేనని గ్రహించి, దానిని పరశోధించి మహాసుఖాన్ని కనుగొనగలిగుండాలి' అని వ్యాఖ్యానించాడు మిత్రశ్రీ.

# శరీరాలెన్ని నాశనమైనా, చైతన్యం సజీవమే

**త**మ సందేహ నివృత్తికై పాశ్చాత్య దేశాల నుండి నిసర్గదత్త మహరాజ్ వద్దకు వచ్చే యువకులు, అంతకు మునుపు ఎవరి వద్దా ఏ ఆధ్యాత్మిక శిక్షణపొందిన వారు అయి వుండరు; అందువల్ల తమకున్న ప్రాజ్ఞతతో ఆయన్ని ప్రశ్నించేటప్పుడు అంతగా వినయం పాటించేవారు కాదు. అయితే వారెంత నిస్సంకోచంగా ప్రశ్నించేవారో, నిసర్గ అంత నిర్దాక్షిణ్యంగానూ సూటిగానూ సమాధానం చెప్పేవారు.

ఇరుపక్షాలు 'చావు'ను గురించి తేలికగా, లెక్కలేకుండా మాట్లాడేవాడు. మరి మనసు యెడల మనిషి చచ్చిపోవడమే, నిసర్గ వేదాంతానికి మొదటిమెట్టు. సంవాదం ఇలా కాక మరెలా వుంటుంది?

**ప్రశ్న : ఎవరైనా అకస్మాత్తుగా మిమ్మల్ని శిరచ్ఛేదం చేయడానికి దూసుకువస్తే, మీకెలా వుంటుంది?**

నిసర్గ : ఏమీ వుండదు. ఈ శరీరానికి, తల లేకుండా పోతుంది. తత్కారణంగా సమాచారం అందే కొన్ని తంత్రులు తెగిపోతాయి. అంతే టెలిఫోన్ మీద ఇద్దరు మాట్లాడుకుంటూ వుంటారు. మాటల మధ్య 'లైన్' తెగిపోతుంది. వారిద్దరికీ ఏమీ కాదు. సంభాషించడానికై వారు మరేదో సాధనాన్ని వెతుక్కోవలసి వుంటుంది.

ప్రసార సాధనాలు ఏవి వున్నా లేకపోయినా, చైతన్యం సజీవంగానే వుంటుంది. చైతన్యం అగ్గిలాంటిది; ఇంధన వస్తువులను దగ్ధం చేస్తుంది కానీ తానేమీ కాదు. కొండంత ఇంధనాన్నైనా కాల్చేసి, అగ్ని ఏ విధంగా జీవిస్తుంటుందో, అనేకానేక శరీరాలు నాశనమై పోతున్నా, చైతన్యం జీవించే వుంటుంది.

**ప్ర : మీరు ఆ దేవుడే అయి వుండచ్చు. కానీ మా అందరితో సంభాషించడానికి, బాగా పోషణ అందేటువంటి శరీరమొకటి కావలసి వుంటుంది కదా?**

ని : మీతో మాట్లాడగలిగిన ఈ శరీరం మీకు అవసరమైనది, నాకు కాదు. నేనీ దేహాన్ని కాను, నాకిది అవసరమూ లేదు. నేను కేవలం సాక్షినే. నాకు సొంత ఆకారమంటూ ఏదీ లేదు.

చైతన్యం కలిగిన శరీరాలుగా మిమ్మల్ని మీరు భావించుకోవడం మీకెంత అలవాటై పోయిందంటే, మీరు సాక్షాత్తూ ఆ చైతన్యమేననీ, ఆ చైతన్యానికి ఇన్ని దేహాలున్నాయనేది, మీ ఊహకి అందడం లేదు. శారీరక వునికి ఒక మానసిక స్థితి అని కనుగొనాలి, ఈ శరీరం చైతన్యానికి సంబంధించిన ఒక చలనం. ఈ చైతన్య సాగరం అనంతం, శాశ్వతం. ఈ చైతన్యంతో నీ సంబంధం సాక్షిగా ప్రవర్తిల్లడం మాత్రమే. ఇవన్నీ గనక అర్థమైతే చైతన్యానికి అతీతంగా బ్రతక నేర్చుకుంటావ్"

పృచ్ఛకులు వేసే ప్రశ్నలు ఎంత అడ్డదిడ్డంగా వున్నా, నిసర్గ ఇచ్చే సమాధానాల నుండి మనమెంతైనా నేర్చుకునే వీలుంది.

**ప్ర : మీరు చనిపోయిన తర్వాత మళ్ళీ తిరిగి వస్తారా? నేను తగినంత కాలం జీవిస్తే, మిమ్మల్ని మళ్ళీ కలవగలనా?**

**ని :** నీకు శరీరం వాస్తవమన్నట్లు కనిపిస్తుంది. నాకు అలాంటిదేమీ వుండదు. నన్నిప్పుడు నువ్వు చూస్తున్న తీరుగా, నీ ఊహలో మాత్రమే వున్నాను. నాతో నీకవసరం ఏర్పడ్డప్పుడు నేను నీకు తప్పక కనబడతాను. సూర్యోదయం సూర్యాస్తమయ కారణంగా, సూర్యుడు ఎలాగైతే, ఏ ప్రభావానికీ లోనుకాడో, అదేవిధంగా, నేనూ మరణంవల్ల ఏమీ కాను. మరణం, దానిని ఏమీ చేయగలిగి లేదు కాబట్టి, అవసరం పడినప్పుడు అది వుండి తీరుతుంది.

నీకు ఆ విషయ పరిజ్ఞానం ముఖ్యంగా తోస్తుంది; నాకది ముఖ్యం కాదు. నీ అభద్రత అనే భావం, ప్రతిదీ తెలుసుకోవాలనే ఇచ్ఛను బలపరుస్తుంటుంది; నాకా అభద్రత అనే భావంలేదు. ఇదేమిటి, అదేమిటి అని కనుక్కుంటూ వుండే పసిపిల్లాడి తత్వం నాది. విషయ పరిజ్ఞానంలో ఆశ్రయం పొందాలనే ఆదుర్దా నాకు లేదు. అందువల్ల నేను మళ్ళీ పుడతానా పుట్టనా అని కానీ, ప్రపంచం ఎన్నాళ్ళు వుంటుంది అని కానీ, ఆలోచన చేయను. ఈ ప్రశ్నలు భయంలో నుండి జనిస్తున్నటువంటివి.

**ప్ర : మీరేమైనా అనండి. మరణించడం అనేది మాత్రం నాకిష్టంలేదు.**

**ని :** నువ్వింత చిన్నవాడివి కాబట్టి అలా అనిపిస్తుంటుంది. నిన్ను గురించి నీకు తెలిసిన కొద్దీ, భయం తగ్గనారంభిస్తుంది. మరణావస్థ, ఆ సమయాన అది కలిగించే బాధ, చూడడానికీ ఏమాత్రం బాగుండదనే మాట నిజమే. కానీ మరణించే వ్యక్తి, ఆ అవస్థను గమనించేంత చైతన్యవంతుడై వుండడు.

**ప్ర : మళ్ళీ చైతన్యావస్థకు తిరిగి వస్తాడా?**

ని : చాలా వరకు అదొక నిద్రలాంటిది. కాసేపు వ్యక్తి మీద దృష్టి నిలవదు. అటుపైన వ్యక్తి మళ్ళీ తిరిగి వస్తాడు.

**ప్ర : అదే వ్యక్తేనా?**

ని : వ్యక్తి పరిస్థితుల నుండి జనించిన వాడు; పరిస్థితులు మారుతుంటే, వాటితో బాటు అతడూ మారుతుంటాడు. ఇంధనాన్ని బట్టి అగ్నిజ్వాల మారినట్లు, అతడూ మార్పు చెందుతుంటాడు. దేశకాలాలను సృష్టించుకుంటూ ఈ ప్రక్రియ మాత్రం సాగుతూ వుంటుంది.

**ప్ర : భగవంతుడు నన్ను రక్షిస్తాడనుకుంటాను. అంతా ఆయనకే వదిలేస్తున్నాను.**

ని : భగవద్విశ్వాసం అనేది కూడా దోవలో ఒక మజిలీ మాత్రమే. చిట్టచివరకు అన్నిటినీ వదిలేస్తావు; ఎంత సరళమైన స్థితికి వస్తావంటే, ఆ స్థితిని మాటలలో బంధించలేవు.

**ప్ర : ఈ వ్యవహారమంతా నేనిప్పుడే ప్రారంభిస్తున్నాను. నన్ను పెరగనివ్వండి. నా తాహతుకు తగినట్లు ముందుకు సాగనివ్వండి.**

ని : నిరభ్యంతరంగాను. కానీ నువ్వలా చేయడంలేదే. ఇప్పటికీ ఆడా మొగా అనే భావాల మధ్య పెద్దా చిన్నా అనే తేడాల మధ్య జీవన్మరణాల మధ్య చిక్కుకొని వున్నావే. కదులు, ముందుకి కదులు. వీటన్నిటినీ దాటి అవతలకి వెళ్ళు. ఒక దానిని గనక గుర్తించగలిగావంటే, దానిని దాటినట్లే."

"ఇక్కడ నిసర్గ మాటలను జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. మనం ఈ ప్రపంచంలో దేనినైనా గుర్తించగలిగామంటే, అది ఒకప్పుడు మనం ఎరిగున్నదే అయి వుంటుంది. అది మన పూర్వానుభవం లోనిదే, మన స్మృతిలో నుండి బయటికి లాగినదే. మనం ఎరిగున్నదేదీ, మనం ఎరుగని దానికి దారితీయదు. మనం ఎరుగనిది ఏనాటికీ 'ఎరుగ'లేము. కానీ మనం, 'అది' అవగలం" అని వ్యాఖ్యానించాడు మిత్రశ్రీ.

# అజ్ఞానం అంతమవ్వడమే లోకోపకారం

ఈ లోకాన్ని తమ స్వప్రయోజనానికి వాడుకోవాలనుకునే వారే మనకు ఎక్కువ మంది కనిపిస్తారు. మితిమీరిన స్వార్థంతో తమ స్వలాభం కోసం లోకుల్ని, పర్యావరణాన్ని ధ్వంసం చేయడానికి వెనుకాడరు. కొందరు మాత్రం తాము లోకోద్ధారకులమని భావించి లోకానికి మేలుచేసే కార్యక్రమాలు తలపెట్టి అమలు జరుపుతున్నామంటారు. అజ్ఞానం అనేక స్థాయిల్లో కొనసాగుతుంటుంది.

మనిషి తన అజ్ఞానాన్ని నిర్మూలించుకోవడమే, అన్నింటికన్నా పెద్ద లోకోపకారం అంటున్నాడు నిసర్గదత్త మహరాజ్. అది జరిగితే నీ ప్రతి కర్మ కూడా లోకానికి ఉ పయోగమే సుమా, అని సూచిస్తున్నాడు.

మానవ చైతన్యంలోని మొత్తం జ్ఞానం నీకవసరం లేదు. నీకు అవసరమైనంత మేరకు తెలిస్తే చాలు. మనసా వాచా కర్మణ్యా, నీవు త్రికరణ శుద్ధిగా బతక నేరిస్తే, నిస్వార్థుడివై తెలివిగా జీవిస్తే ప్రకృతి శక్తులు నీకు సహకరిస్తాయి అని తెలియజేస్తున్నాడు. నువ్వు మంచివాడివవడం–సంఘాన్ని అనుసరించి 'మంచి' అనిపించుకోవడం కాదు–త్రికరణశుద్ధిగా మంచివాడివైతే, లోకం కానీ లోకేశుడు కానీ నీ వద్ద నుంచి మరేదీ ఆశించరు.

**పృచ్ఛకుడు : భవిష్యత్తు ఎలా నిర్మితమవుతుంది?**

**నిసర్గదత్త :** అనివార్యంగా సంభవించే సంఘటనలనే వాటికి నీ అజ్ఞానం కారణం.

**పృ : దేనిని గురించిన అజ్ఞానం?**

**ని :** ప్రప్రధానంగా నిన్ను గురించిన అజ్ఞానం, ఆపైన వస్తువులు, సంఘటనల గురించిన కార్యకారణాలు, వాటి అసలు స్వభావం గురించిన జ్ఞానరాహిత్యం, నీ అజ్ఞానాన్ని అంతమొందించడం కన్నా నువ్వు ప్రపంచానికి చేయగలిగిన మేలు మరొకటి లేదు. అప్పుడిక లోకానికి ప్రత్యేకంగా నువ్వు చేయాల్సింది ఏమీలేదు. నువ్వు కర్మనాచరించినా, ఆచరించకపోయినా, నువ్వసలు ఇక్కడ వుండడమే ఆ లోకానికి మేలు చేసినట్లు.

**పృ : అజ్ఞానం ఎలా తెలియాలి? అజ్ఞానం తెలియాలంటే, జ్ఞానం వుండుండాలనే కదా?**

**ని :** ఆ మాట నిజం. 'నేను అజ్ఞానిని' అని తెలుసుకుంటే జ్ఞానం ఉదయించినట్లే. అజ్ఞానికి తాను అజ్ఞానిని అనే విషయం తెలియదు. అజ్ఞానాన్ని చూసీ చూడడంతోటే, అది అజ్ఞానమని తెలిస్తే అజ్ఞానం లేనట్లే. అందువల్ల దానిని అవ్యక్తస్థితి, లేక అంధత్వం అనవచ్చు. నీలోన, నీ చుట్టూతా నువ్వు చేసేదంతా నీకు తెలియనూ తెలియదు, అర్థమూ కాదు. పైగా 'ఇది తెలియదు, అర్థమూ కాదు' అని కూడా తెలియదు. 'నాకు తెలియదు, అర్థం కాదు' అని తెలియడం నిజమైన జ్ఞానం, ఓ అణుకువగలవాని, వినయవంతుని హృదయజ్ఞానం. తన అజ్ఞానం తెలియడమే జ్ఞానం. 'నాకు తెలియదు' అన్న సంగతి తెలుసుకుంటారు.

('తెలిసికొంటి నాకేమీ తెలియదంచు' అన్న భర్తృహరి పద్యపాదం గర్తురావడం లేదూ? అన్నాడు మిత్రశ్రీ)

**పృ : అజ్ఞానం అసలు తొలిగేనా?**

**ని :** తెలియనందువల్ల వచ్చిన చిక్కేమిటి? మొత్తం తెలియాల్సిన అవసరం లేదు. ఏది తెలియాలో అది తెలిస్తే చాలు. మిగతాది దాని సంగతేదో అది చూసుకుంటుంది. అది ఎలా చూసుకుంటుంది అనేది నీకు తెలియనక్కర్లేదు. నీ అవ్యక్త చైతన్యం నీ వ్యక్త చైతన్యానికి వ్యతిరేకంగా పనిచేయకుండా ఉండడం ముఖ్యం. అన్ని స్థాయిల్లోనూ ఏకీకరణ వుండడం ప్రధానం. తెలియడం అంత ముఖ్యం కాదు.

**పృ : మనస్సంబంధంగా మీరనేది నిజమే. కానీ ఇతర్లను గురించి తెలుసు కునేటప్పుడు లోకాన్ని గురించి తెలుసుకునే సందర్భంలోనూ 'నాకు తెలియదు' అనేది తెలియడం అంత ప్రయోజకరంగా వుండదు.**

**ని :** నీలోన అన్ని స్థాయిల్లోనూ నువ్వు ఏకీకృతమైతే, బాహ్య జ్ఞానం దానంతట అదే సిద్ధిస్తుంది. జీవితంలో ప్రతి క్షణం ఏది తెలియాల్సిన అవసర ముంటుందో అది తెలుస్తూ వుంటుంది. విశ్వాత్మసాగరంలో జ్ఞానమంతా నిక్షిప్తమై వున్నది. నీవు కావాలను కున్నప్పుడు అది నీదవుతుంది. అదంతా తెలుసుకోవలసిన అవసరం నీకెలాగూ రాదు– అయినప్పటికీ అదంతా నీదే. జ్ఞానంతో ఎలాగో, శక్తితో కూడా అంతే. ఏది జరగడం అవసరమని నీవు అనుకుంటావో, తప్పనిసరిగా జరిగితీరుతుంది. ఈ విశ్వాన్ని నిర్వహించే వ్యవహారమంతా భగవంతుడు చూసుకుంటున్నాడన్న మాటలో సందేహంలేదు. కానీ ఎవరైనా కాస్త సహాయమందిస్తే ఆయనకు సంతోషమే. ఈ సహాయకుడు నిస్వార్థపరుడై 'తెలివి'గలవాడైతే విశ్వశక్తులన్నీ అతడి ఆజ్ఞను శిరసావహిస్తయి.

**ప్ర : ప్రకృతిలోని అంధశక్తులు కూడానా?**

**ని :** అంధశక్తులంటూ లేవు. చైతన్యమనేది శక్తి. ఏది జరగాల్సి వున్నదో దానియెడల ఎరుక కలిగివుండు. అది జరిగితీరుతుంది. నువ్వు చేయాల్సిందల్లా సావధానుడివై ప్రశాంతంగా వుండడమే. నీ గమ్యం వద్దకు నీవు చేరినప్పుడు, నీ అసలు స్వభావం నీకు తెలిసినప్పుడు, నీ ఉనికి అందరికీ ఒక మహా దీవెనగా రూపొందుతుంది.

**భక్తుల పునరాగమనం**

పునర్జన్మ సిద్ధాంతాలను సర్వసాధారణంగా కొట్టి వేసినా, తన పాశ్చాత్య శిష్యుల గురించి చమత్కరిస్తూ నిసర్గ, ఓ కల్పిత కథ చెప్పేవాడు.

'రామాయణ అంత్యంలో, శ్రీరాముడికి యుద్ధంలో తోడ్పడిన జంతువులన్నిటికీ బహుమతి ప్రదానం చేయాలని రాముడు నిశ్చయించాడు. కోతులన్నిటినీ వానర స్వర్గానికి వెళ్ళేట్లు అనుగ్రహించాడు. ఇక, కోతికి స్వర్గమంటే కావలసినంత తిండి, కోరుకున్నంత పోరు, అపరిమితమైన శృంగారం కాబట్టి, కోతులన్నీ తమ భావాన్ననుసరించి,స్వర్గమనుభ వించడానికి పశ్చిమంలో నరజన్మ దాల్చినై. కొంత కాలం గడచిన తదుపరి, మళ్ళీ శ్రీరాముడి సాన్నిధ్యం పొందడానికి ఒకరి తర్వాత ఒకరు భారతదేశానికి తిరిగిరా మొదలెట్టారు' అనేవాడు.

# ఆధ్యాత్మికుడికి జూదరి మనస్తత్వమా?

ఆధ్యాత్మిక జీవనంలో 'అనుభవాలు' నిరర్థకమైనవని జిడ్డు కృష్ణమూర్తి గారు హెచ్చరిస్తూ ఉండేవారు. ఆఖరికి అంతర్‌దృష్టి ద్వారా కనిపించినదైనా శంకించి, తర్కించి, దాని నిజానిజాలు నిర్ధారించుకోమన్నారు. గుడ్డిగా దేనినీ సమ్మతించవద్దని చెప్తూ ఉండేవారు.

"అది ఎంత గొప్ప అనుభవమైనా, ఒక క్షణాన వచ్చి మరో క్షణాల వెళ్ళిపోయేదే కదా? అది సత్యమే అయితే, నిత్యం ఉండేదే అయి ఉండాలి కదా? వచ్చి వెళ్ళిపోయేది ఎట్లా అవుతుంది?" అనేవారు అరుణాచల రమణులు.

ఈ మహనీయులు చెప్పిన మాటలే కాక, ఈ సందర్భంగా నిసర్గదత్త మహరాజ్ చెప్పిన మాటలు కూడా గమనార్హం. గమ్యం అందుకోవడానికి మనిషి బలీయమైన, సుదృఢమైన కోరిక కలిగుండాలి అంటాడు ఆయన. ఆ ఉద్దేశం, తత్సంబంధమైన సంకల్పం లేకపోతే ఆ ప్రయత్నానికి తగినంత శక్తి జనించదు. ఇక రెండవది, తన ప్రయత్నంలో విజయం సాధించగలననే గ్యారంటీ లేకపోవడం. ఇక్కడ జూదరి యొక్క మనస్తత్వాన్ని ఉదహరిస్తాడు నిసర్గదత్త. అధ్యాత్మికుడికి కూడా ఈ జూదరి మనస్తత్వం అవసరమవుతుంది. ఉన్నదంతా, జూదరి పందెం కాసినట్లే ఈ సాహసయాత్రలో, కలిగున్నదంతా తిరస్కరించాలి. ఊరు, పేరు, హోదా, ఆస్తి, అంతస్తు మనిషికి సంఘంలో వున్న గుర్తింపు యావత్తూ పక్కకు నెట్టేయాలి. గతమంతా తుడిచిపెట్టుకు పోవాలి. అవతల ఏమున్నదో, తన గతి ఏమి కానున్నదో తెలియకుండా అగాధమైన లోతుల్లోకి ఉరక గలిగుండాలి. అది లభిస్తుందనే దృఢ విశ్వాసంతో దూకుతున్నాడే కానీ అది దక్కి తీరుతుంది అని ఎవరూ హామీ ఇవ్వగలిగిలేరు. కానీ మహా సాహసం చేయక తప్పదు.

నిసర్గ : ఆధ్యాత్మికతానుభావం ఎంత మహత్తరమైన దైనప్పటికీ అది అసలు వస్తువు కాదు. స్వభావరీత్యా అది వస్తుంటుంది. పోతుంటుంది. ఆత్మసాక్షాత్కారం, సంపాద్యంకాదు. అది అవగాహన యొక్క స్వభావాన్ని కలిగుంటుంది. ఒకసారి అది ప్రాప్తిస్తే మనిషి దాని వద్దకు చేరితే, ఇక దానిని కోల్పోయే ప్రసక్తిలేదు. ఇక చైతన్య

స్రవంతి అంటావా, అది తరచూ పరివర్తన చెందుతూ వుంటుంది, ప్రవహిస్తూ వుంటుంది. క్షణక్షణం మారిపోతూ వుంటుంది. చైతన్యమూ, దానిలోనున్న విషయాలను అంటిపెట్టుకుని వుండకు. చైతన్యాన్ని పట్టుకు కూచున్నావంటే సాక్షాత్కారం ఆగిపోతుంది. అంతర్ దృష్టి యొక్క మెరుపును, లేక ఆనందాతిశయాన్ని అలాగే శాశ్వతంగా వుండేట్లు చేద్దామనుకుంటే అది దాని వినాశనానికి కారణమవుతుంది. ఏదైతే వచ్చిందో అది పోక తప్పదు. శాశ్వతమైనది, వచ్చేదీ కాదు పోయేదీ కాదు. సమస్తమైన అనుభవాలకు మూలమయిన వ్రేళ్ళ వద్దకు, అనగా నీ సత్త వద్దకు వెళ్ళు. సత్తకూ, సత్త కానిదానికి ఆవలనున్నది. ఆ బ్రహ్మాండమైన వాస్తవం. మళ్ళీ మళ్ళీ ప్రయత్నిస్తూ ఉండు.

**పృచ్ఛకుడు :** అలా ప్రయత్నించడానికి మనిషికి విశ్వాసం వుండాలి.

**నిసర్గ :** ముందసలు ఆ కోరిక ఉండాలి. కోరిక బలీయంగా ఉంటే ప్రయత్నించాలనే పట్టుదల వస్తుంది. గట్టిగా కోరడం జరిగితే విజయం ఖాయమనే హామీ యొక్క అవసరం వుండదు. దానితో జూదమాడేందుకు సిద్ధపడతావు.

**పృ :** నేనింతకన్న చిన్నవాణ్ణయినప్పుడు నాకేదో వింత అనుభవాలు–చిన్నవే అయినప్పటికీ, జ్ఞాపకముంచుకోదగినవి కలుగుతుండేవి. నేను ఏమీ కాదని, కేవలం ఏదో శూన్యమన్నట్లుగా వుండేది. కానీ చైతన్య స్పృహలోనే వుండేవాణ్ణి. ఇక్కడొచ్చిన ప్రమాదమల్లా ఒక్కటే. అలా చెల్లిపోయిన క్షణాలను మళ్ళీ మళ్ళీ తలచుకుని వాటిని పునఃసృష్టించుకోవాలనే కోరిక బయలుదేరడం.

**నిసర్గ** : ఇదంతా ఊహ. చైతన్యం వెలుగులో అనేకం సంభవిస్తూ ఉంటై. వాటికి ప్రత్యేకమైన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం లేదు. భగవంతుడి రూపదర్శనమెంతో, ఒక పుష్పం కనిపించడం కూడా అంత అద్భుతమైనదే. వాటి పాటికి వాటినలా వుండనీ. వాటిని గుర్తు తెచ్చుకోవడం దేనికి? ఆ తర్వాత జ్ఞాపకాలు ఒక సమస్యగా చేసుకోవడం ఎందుకు? వాటియెడల మార్దవంగా ఉండిపో. వాటికి ఉచ్ఛ నీచాలు ఆపాదించవద్దు. గొప్పవనీ అధమమైనవనీ, అంతర్గతమైనవనీ, బాహ్యామైనవనీ, శాశ్వతమైనవనీ, తాత్కాలిక మైనవనీ విభజిస్తూ కూచోవద్దు. ఏది సంభవిస్తున్నటికీ వీటన్నిటికీ మూలమైన నీ ఆత్మ వద్దకు వెళ్ళు. నువ్వీ ప్రపంచంలో పుట్టావని నీవేర్పరచుకున్న నమ్మకం, కేవలం నీ బలహీనత. నిజానికి ఈ ప్రపంచం నీలో, నీచేత ఎల్లప్పుడూ పునఃసృష్టింపబడుతున్నది. నీ సత్తకు మూలమైన వెలుగునుండే ఇవన్నీ జనిస్తున్నవనే విషయం చూడు. ఆ వెలుగులో ప్రేమ, అనంతమైన శక్తి వున్నాయని నీవే గ్రహిస్తావు.

**పృ :** నేనిక్కడ జీవించి ఉంటానికే నేను 'చూడాల్సిన' అవసరం ఉందంటారా?

**నిసర్గ :** నువ్వు ఏమిటిగా వున్నావో చూడు, వారినీ వీరినీ అడుగకు. నిన్ను గురించి ఇతరులను, నీవు చెప్పనివ్వకు. నీలోనికి నువ్వు చూసుకుని గ్రహించు. మార్గ దర్శకుడు చెప్పగలిగినదంతా ఇంతే. ఒకరివద్ద నుండి మరొకరి వద్దకు వెళ్ళాల్సిన అవసరం లేదు. అన్ని బావుల్లో ఉండే నీరు ఒకటే. ఏ బావి సమీపంగా ఉంటే దాని నుండి నీరు తోడుకో. నా విషయానికొస్తే నాలో ఆ నీరు వున్నది, నేనా నీటినే.

# నువ్వు ఎవరో నీకు తెలియాలంటే...

కొన్ని అద్దాలలో మనం మొహం చూచుకుంటే వంకరటింకరగా ఉంటుంది. మరికొన్నిటిలోనయితే మసక మసకగా ఉంటుంది. కాని మన మొహం ఎట్లా ఉంటుందో మనకు తెలుసు గనుక, అద్దంలోని ప్రతిబింబం సరిగా లేకపోతే అది 'నా మొహం కాదు' అన్న విషయం మనకు స్పష్టంగా తెలుస్తుంది. మీ మొహం మీద తెలియదు అనుకోండి, అప్పుడు ఏ అద్దం ఎట్లా చూపిస్తే అదే మీ మొహం అనుకుని – 'అయ్యో ! ఇదా నా ఆకారం' అని బాధపడుతుంటారు.

కనుకనే రమణమహర్షి ఎవరు వెళ్ళి అడిగినా ముందుగా 'నే నెవరు' అని ప్రశ్నించుకో అని చెప్పేవారు.

ఈ 'నేను' ఏమిటో తెలుసుకుంటే 'నేను కానిది' (ఇది అనేక భ్రాంతుల రూపంలో, వికారాల రూపంలో తానే అసలు దానిని అని మనల్ని నమ్మింపచేస్తుంటుంది.) సూర్య కిరణం సోకిన చీకటిలా మాయమవుతుంది.

'లేనిది లేకుండా పోయినప్పుడు' ఉన్నదొక్కటే మిగులుతుంది.

ఇదే విసయాన్ని నిసర్గదత్త మహరాజ్ తన మాటల్లో ఎట్లా విశదీకరించారో గమనించండి !

**నిసర్గదత్త :** "నువ్వెవరో నీకు తెలియాలంటే ముందు నువ్వు ఏది కాదో పరిశోధనాత్మకంగా కనుక్కోవాలి. నీలో ఉన్నది ఏదేది నీవు కాదో కనుక్కో. నువ్వీ దేహానివా? ఈ అనుభూతులూ, ఆలోచనలూ, నువ్వు నివసిస్తున్న ఈ కాలమూ దేశమూ, ఇవన్నీ నీవేమో పరిశీలనగా చూడు. ఘనీభవించింది కానీ, ఘనీభవించనిది కానీ, రూపం ధరించినది కానీ, ధరించనిది కానీ కంటితో చూడగలిగినదేదీ నువ్వు కాదు. నువ్వు చూచే దేదీ నువ్వు కాదు. నువ్వు చూచేదేదీ నువ్వు కాదని ఈ చూచే క్రియ ద్వారా తెలుస్తుంది.

"మనసు ద్వారా తెలుసుకోగలిగిందల్లా నువ్వు అది కాదు, ఇది కాదు అని మాత్రమే. ఈ గ్రహింపు ఎంత శీఘ్రంగా సిద్ధిస్తే అంత శీఘ్రంగా నువ్వా అపరిమితమైన ఉనికిని తెలుసుకుంటావు. అంతటితో నీ అన్వేషణ అంతమవుతుంది.

"నువ్వీ శరీరమో, మరేదైనానో, లేక అసలేమీ కాదో తెలుసుకోవడం నీకు ముఖ్యమనిపించడంలేదా? నీ సమస్యలన్నీ ఈ శరీరానికి సంబంధించిన సమస్యలేనన్న విషయం నీకు కనిపించడంలేదా? నువ్వు కేవలం ఈ శరీరంకావని స్ఫురించినప్పుడు ఈ తిండీ తిప్పలూ, వసతీ, కుటుంబమూ, మిత్రులూ, పరువు. ప్రతిష్ఠా, భద్రతా, ఎలాగోలా బ్రతకాలనే ఈ కాంక్షా – వీటికేమంత అర్థముంటుంది?"

**ప్రశ్న :** "మరి నే నెవరు?"

**నిసర్గ :** నీ వెవరు కాదో అది తెలిస్తే చాలు. నీవెవరో తెలియాల్సిన అవసరం లేదు. మనం చూచినది, భావించినదానినిబట్టే అనగా మనం ఎరిగున్నదాని ననుసరించే ఎఱుగని దానిని వర్ణంచగలం. మన జ్ఞానమింతే; అయినప్పుడు, మన ఆత్మజ్ఞానం కూడా అంతకే పరిమితమవుతుంది. కానీ ఈ పరిమితమైన జ్ఞానంతో ఆ అపరిమితమైన "నిన్ను" నెలా వర్ణించడం? 'అది కాదు, ఇది కాదు' అనే 'నెగేషన్' (Negation) తో మాత్రమే మాట్లాడవీలవుతుంది."

**ప్రశ్న :** "మీరు ఉన్నతులు. మీరు సత్యాన్ని ఎరిగున్నామంటున్నారు. నేను ఎరగని వాణ్ని."

**నిసర్గ :** "నీవు ఎరగనివాడివనీ, అందుచేత నువ్వు తక్కువ స్థాయిలో ఉన్నావనీ నే నెన్నడైనా నీతో అన్నానా? ఇలాంటి అంతరాలు సృష్టించిన వారినే, వాటిని రుజువు చేయమని అడగండి. నీకు తెలియనిది నాకు తెలుసునని నేననడంలేదే?"

**ప్ర :** "మీ మాటలు జ్ఞానయుతమైనవి. మీ ప్రవర్తన ఉదాత్తమైనది. మీ దయాగుణం అత్యంత శక్తివంతమైనది."

**నిసర్గ :** "నాకవన్నీ తెలియవు. నీకూ నాకూ తేడా లేదని మాత్రమే తెలుసు. నీ జీవితంలాగానే నా జీవితం కూడా. ఒక వరుస క్రమంలో జరిగే సంఘటనల సముదాయం. నీకూ నాకూ ఉన్న భేదమల్లా, నేను ఈ నడిచే నాటకాన్ని నన్ను అంటనీయకుండా చూస్తుంటాను; నువ్వేమో వాటిని అంటిపెట్టుకుని వాటితోనే కదులుతుంటావు.

"నన్ను గురించి నీవేర్పరచుకున్న గొప్ప అభిప్రాయం, కేవలం నీ అభిప్రాయం మాత్రమే. అది ఏ క్షణాననైనా మారిపోగలదు. అభిప్రాయాలనే వాటికి, అవి నీ అభిప్రాయాలైనప్పటికీ, ఎందుకంత ప్రాధాన్యమిస్తావ్?"

**ప్ర** : "ఏది ఏమైనప్పటికీ మీరు వేరు. మీ మనసు ఎల్లప్పుడూ ప్రశాంతంగానూ, ఆనందంగానూ ఉన్నట్లు కనిపిస్తుంది. ఇక మీ సమక్షంలో చూద్దామా, అనేక అద్భుతాలు జరుగుతూ ఉంటాయి."

**నిసర్గ :** "నువ్వు చెప్పే అద్భుతాలను గురించి నాకేమీ తెలియదు. ప్రకృతి తన ధర్మాన్ని అతిక్రమించి ఏదీ జరగనిస్తుందని నేననుకోను. కాకపోతే ఈ కనిపిస్తున్నదంతా ఒక మహాద్భుతమనుకుంటే అది వేరే సంగతి; అప్పుడు అంతా అద్భుతమే. నాకు తెలిసినంత వరకూ అలాంటిదేమీ లేదు. సంభవిస్తున్నదంతా ఈ చైతన్యరంగంలోనే సంభవిస్తున్నది. ఇది అందరికీ విశదంగా కనిపిస్తున్నదే. అందరూ అనుభవించడానికి వీలయినదే. నువ్వు జాగ్రత్తగా చూడలేదు. అంతే. పరిశీలనగా చూడు, నాకు కనిపించేది నీకూ కనిపిస్తుంది."

**ప్రశ్న :** "మీకేమి కనిపిస్తున్నదంటారు?"

**నిసర్గ :** "నీవెలా చరిస్తున్నావో, నీ ఉద్దేశాలేమిటో, నీ చర్యల ఫలితాలెలా ఉంటున్నాయో తిన్నగా చూడు. ఇవన్నీ నువ్వు కాదని తెలిసినప్పుడు, నువ్వెవరో నీకు స్ఫురిస్తుంది. నిన్ను నీవు తెలుసుకోడానికి మార్గమొక్కటే. ఇప్పటి నువ్వూ, నీ ప్రస్తుత చర్యలూ ఇవేవీ కూడా 'నిజమైన నీకు' చెందవనీ, వీటన్నిటినీ తిరస్కరించి తోసిపుచ్చడం ఒక్కటే మార్గమనీ తెలుసుకో. ఒకటి మాత్రం ఖాయం. వాస్తవమైనటువంటిది మనసు కల్పించుకున్న ఊహ కాదు, అది మనో నిర్మితమైనది కాదని గుర్తుంచుకో.

"ఈ శరీరమే నేను అనే భావం నీ మనసునిప్పుడు సంపూర్తిగా ఆక్రమించి ఉన్నది; ఇది తొలగగానే నీ స్వభావసిద్ధమైన స్థితిని సహజంగా అనాయాసంగా అందు కుంటావు. మనిద్దరిమధ్యా ఉన్న భేదమల్లా, నేనేమో ఈ సహజమైన స్థితిని ఎరిగుండడం, మరి నీకేమో మైకంకమ్మి ఉన్నందువల్ల దీనిని ఎరిగుండకపోవడం.

"ముడి బంగారానికి, బంగారపు వస్తువులకీ తేడా ఏమున్నది? ఆ నగలకు మనసు ఒక విలువ నాపాదిస్తే, విలువ ఉన్నట్లు తోస్తుంది. అలాగే నీకూ నాకూ ఉనికిలో తేడా ఏమీ లేదు. పైపైన మనిద్దరి మధ్యా భేదమున్నట్లు ఊహించుకుని, అంతరాలు సృష్టిస్తున్నాం. పూటపూటా నిరంతరం ఈ విచారణ ఎడలే ధ్యాస కలిగి ఉండి జీవితాన్ని ఈ అన్వేషణకే అంకితంచేసి శ్రద్ధగా జిజ్ఞాసాపూర్వకంగా జీవించే వారందరూ దీనిని కనుగొనవచ్చు."

# పదాల పరిమితి

**త**త్త్వం అర్థం చేసుకున్నవాడికి ఏ మతమైనా ఒక్కటే; మతం అనేది లేకపోయినా ఒక్కటే. పరతత్త్వాన్ని స్వయంగా తెలుసుకున్నవాడికి మతమేమి ఉంటుంది, కులమేమి ఉంటుంది? అందువల్లే జిడ్డు కృష్ణమూర్తిగారు, మానవత్వం తప్పితే, మరేదీ గుర్తించకుండా 'I am Humanity' అని అంటూండేవారు.

ఇస్లాం మత సంప్రదాయాల్లో పుట్టి పెరిగిన సూఫీ మహనీయులు, ఆ మత విధులన్నిటినీ అనుసరిస్తూనే, వాటికి అతీతమైన ఆ మహాశక్తిని దర్శించారు. హిందూ మతంలోని కాళీ దేవతను పూజిస్తూ కూడా, రామకృష్ణ పరమహంస, అన్ని మతాలనూ సూక్ష్మంగా సాధనచేసి, వాటి పరమార్థాన్ని గ్రహించారు. రమణమహర్షి, నిసర్గదత్త మహరాజ్ వంటి మహాయోగులు హిందూ దేవతామూర్తులను ఆరాధిస్తూనే, బ్రహ్మ విష్ణు మహేశ్వరుల నామాలను దాటి ఆవలనున్న దానిని దర్శించారు.

సాధకులకు తమ తమ మతాలను గురించి సమగ్రమైన అవగాహన అయినా ఉండాలి. లేదా, మతమనేది లేకుండా తత్త్వ విచారణ చేయగలిగి ఉండాలి. రెండిట్లో ఏదైనా సాధనకుపయుక్తమే.

ఇదే పరమార్థాన్ని శ్రీ నిసర్గదత్త మహరాజ్ ఎట్లా వివరాంచారో చూద్దాం :

**పృచ్ఛకుడు :** మీరు హిందువైనందువల్ల బ్రహ్మ, విష్ణు, శివ అనే త్రిమూర్తుల పేర్లు వాడుతుంటారు. హిందువులు తమ విగ్రహాల యెడల చూపించే దృక్పథమే మీరూ చూపిస్తూంటారు. కానీ మీరు వాడే ఈ పదాల వెనుకనున్న అనుభవమేమిటో దయచేసి చెప్పండి; వీటి వెనుక వాస్తవమేమిటో తెలియజెయ్యండి.

**నిసర్గదత్త :** ఇది నా మాట్లాడే తీరు. అంతే తప్ప మరేమీ లేదు. నాకీ పదజాలం నేర్పారు కాబట్టి నేను ఈ పదాల్ని వాడుతున్నాను.

**పృ :** కానీ ఈ భాష, ఈ పదాల ఆవలనున్నదేమిటి?

**ని :** దానిని నేను మాటలతో ఎలా వర్ణించగలను? 'అది' ఈ మాటలు కాదు అని మాత్రమే చెప్పగలను. అందుకనే కాలాతీతము, దేశాతీతము, అహేతుకము అనే పదాలు

వాడుతుంటాను. కానీ, ఇవి కూడా పదాలే సుమా ! అయినప్పటికీ వాటికి ఒక అర్థమంటూ ఏదీ లేదు కాబట్టి అవి నాకు అనుకూలమైన పదాలనవచ్చు.

**పృ :** అవి అర్థరహితమంటూ కూడా ఆ పదాలు ఎందుకు వాడుతున్నట్లు?

**ని :** మీ అందరికీ పదాలు కావలసి వచ్చినాయి కాబట్టి. పదాలనేవి దేని విషయంలోనైతే వర్తించవో, అలాంటిదానికి కూడా మీకు పదాలు అవసరమనిపిస్తున్నాయి. నేనేమి చేసేది?

**పృ :** మీరు చెప్పేది నాకర్థమయింది. నాకు ఇక ప్రశ్నలే మిగల్చకుండా దోచేస్తున్నారు మీరు.

# కామవాంఛ

ఈనాడు 'కామవాంఛ' అనేది మానవులకందరికీ అతి ప్రబలమైన సమస్యగా రూపొందింది. స్త్రీ పురుషులకుండే సహజమైన కామేచ్ఛ మానవాళి ఆవిర్భవించినప్పటి నుండీ ఉన్నటువంటిదే; మనమీనాడు ఈ విషయమై కొత్తగా కనుగొన్నదేమీ లేదు. కొత్తగా రంగంలోకి ప్రవేశించినదల్లా ఈ సహజమైన లక్షణాన్ని ప్రేరేపించి, రెచ్చగొట్టి నిరంతరమూ దానిని గురించే ప్రసంగిస్తూ, చర్చిస్తూ, ప్రచురిస్తూ డబ్బు చేసుకునే చలన చిత్రాలు, పత్రికలు, అశ్లీల ప్రచురణలు మాత్రమేనని చెప్పుకోవాలి.

ప్రతి ప్రకటనదారు తన వస్తువును అమ్ముకోడానికి ఈ స్త్రీ, పురుష లైంగిక వాంఛనే వినియోగించుకుంటున్నాడు. మనిషిని లోభంతోనైనా లొంగదీసుకోవచ్చు. లైంగిక వాంఛను సూచించి లొంగదీసుకోవచ్చునని కనుగొన్న నేటి 'మీడియా' నిర్వాహకులు, ప్రజల్ని ఎంతగా వంచిస్తున్నారో, ఎంతగా 'మేనిపులేట్' చేస్తున్నారో ప్రజలకు తెలిస్తే, రేపు పొద్దునకల్లా ఇవన్నీ నిర్జీవ స్థితికి చేరుకుంటై.

ఈ 'సెక్సు' అనే దానికి ఇంత ప్రాధాన్యమిచ్చి, జాతిని ఎంత నిర్వీర్యం చేస్తున్నారో తలచుకుంటే వీరి పాపానికి నిష్కృతి ఉంటుందా అనిపిస్తుంది.

"అయితే లైంగిక వాంఛను అణగద్రొక్కి, బ్రహ్మచర్యమవలంబించండి" అని దీనికి వ్యతిరేకమైన దానిని ప్రతిపాదించిన వారూ ఉన్నారు. ఇది చాలా అసందర్భం. జాతి యావత్తూ బ్రహ్మచర్య మవలంబించడం అసాధ్యం, అనభిలషణీయం. జీవితంలో గృహస్థు, దేనికెంత ప్రాధాన్యమివ్వాలో ఎరిగుండాలి. లైంగిక వాంఛను దాటదలుచుకున్న సాధకులు, దానిని అణగదొక్కే, విధానం కాకుండా, నేర్పుగా తెలివితేటలతో దానిని అర్థం చేసుకొని దాటగలిగి ఉండాలి. నిసర్గదత్త మహరాజ్ ఏమంటారో చూద్దాం.

**పృచ్ఛకుడు :** కామవాంఛ ఏమిటంటారు?

**నిసర్గదత్త :** జ్ఞప్తికి తెచ్చుకోవడం, ఊహించడం, ఎదురుచూడడం మొదలైన వాటితో కూడుకున్నది. అంతే ! అంతకన్న మరేమీ కాదు ! ఆ వాంఛ ఇంద్రియ సంబంధి. 'మనిషి ఆలోచనల నుండి పుట్టే ఉద్రేకం మాటల మూలాన సంభవిస్తుంది. అలవాటు పడినందువల్ల మరిగినందువల్ల ఏర్పడినదనవచ్చు.

**పృ :** బ్రహ్మచర్యము, ఇంద్రియ నిగ్రహము యోగాభ్యాసానికి విధాయకమంటారా?

**నిసర్గ :** నిర్బంధపరచడం, అణచివేయడంతో కూడుకున్న జీవితం యోగం కాదు. మనసు వాంఛల నుండి విముక్తి చెంది, బిగువు లేకండా 'రిలాక్స్‌డ్'గా ఉండాలి. ఈ స్థితి అవగాహన ద్వారా కలుగుతుంది కానీ, మనసులో ఒక నిశ్చయం చేసుకున్నందువల్ల రాదు. ఇలా నిశ్చయం చేసుకోవడాలు నిజానికి స్మృతి నుండి జనించినవే. కానీ అవగాహన ద్వారా సంభవించేది మాత్రం వాంఛలు భయాలు నుండి విముక్తమయినటువంటిది.

**పృ :** నాకీ అవగాహన ఎలా వస్తుందంటారు?

**నిసర్గ :** ధ్యానం ద్వారా వస్తుంది. అంటే సావధానంగా ఏ విషయం వంకనైనా 'చూచి'నందువల్ల వస్తుంది. నీ సమస్యను గురించి సంపూర్తిగా ఎరుకను కలిగివుండు; ఆ సమస్యను అన్ని కోణాల నుండి జాగ్రత్తగా పరిశీలించు. అది నీ జీవితాన్ని ఏమి చేస్తున్నదో, ఎలా బాధిస్తున్నదో, తిన్నగా గమనించు. ఇదంతా క్షుణ్ణంగా చేసిన తర్వాత దాని సంగతి పూర్తిగా వదిలేసి ఊరుకో. అంతకన్న నీవు చేయగలిగిందేమీ లేదు.

**పృ :** ఇలా చేస్తే అది నాకు విముక్తి సాధించి పెడుతుందంటారా?

**నిసర్గ :** నీకు ఏది పూర్తిగా అర్థమయిందో, దేనినైతే నువ్వు అవగాహన చేసుకుంటావో దాని నుండి నువ్వు విముక్తి చెందినట్లే. ఆ విముక్తి యొక్క బాహ్య చిహ్నాలు కనిపించడానికి కొంత వ్యవధి పట్టవచ్చు. కానీ విముక్తి మాత్రం అప్పటికే నీలో నెలకొన్నట్లే. మరీ పరిపక్వ స్థితికై ఎదురుచూడకు, ఈ భూమి మీద కనిపించే దానిలో సంపూర్ణత అనేది ఉండదు. వివరాల వద్దకొచ్చేసరికి కొంత పొసగనట్లు ఉంటుంది. ఏ సమస్య అయినా సంపూర్ణంగా పరిష్కారం కాదు, కానీ అది నిన్ను సాధించి బాధించే స్థితి నుండి, నీ దృష్టిని మరో అతీతమైన స్థితి వైపు మళ్ళిస్తుంది; ఆ స్థితిలో ఇక ఆ సమస్యను ఆదరించడం ఉండదు.

# మతమంటే?

'**చ**దువులలో సారమెల్ల చదివితి తండ్రీ' అని ప్రహ్లాదుడు తన తండ్రికి చెప్పినట్లు, మహానుభావులు మతాలలోని సారం కూడా ఇట్టే పట్టేస్తారు.

ఏ మతమైనా దర్శనంలో నుండి జనించాల్సిందే. అయితే ఆ ప్రథమ దార్శనికుడు ఉన్నది ఉన్నట్లుగా, విన్నది విన్నట్లుగా ప్రకటించి నటువంటిది మాత్రమే సత్యమవుతుంది. తన ఆలోచన గనక అందులో కలిస్తే, అది తప్పనిసరిగా కలుషిత మవుతుంది. ఒకవేళ అతడు దానిని స్వయంగా కలుషితం చేయపోయినా, అతడి అనుచరులు తమ ఆలోచనకు అనుకూలంగా దానిని రూపొందించి, తప్పనిసరిగా భ్రష్టుపట్టిస్తారు.

ఈ శతాబ్దపు నాలుగవ దశకంలో లభించిన "The Gnostic Gospels" గనక చదివితే, క్రీస్తు ఆనాడు ప్రవచించిన దానికీ, అతడి అనుచరులు, ఆ తర్వాత నాటి మతాధికారులు క్రీస్తు బోధించిన ఆత్మజ్ఞాన ఆవశ్యకతను పక్కకునెట్టి, దైవాన్ని ప్రీస్ట్ ద్వారానే ఆరాధించాలి. కనుగొనాలి అనే పద్ధతిని ఎలా ప్రవేశపెట్టారో తెలుస్తుంది. అందుకే జిడ్డు కృష్ణమూర్తి గారు 'మతాలలో ఏమీలేదు, మతపరమైన మనస్సు (Religious mind) లోనే ఉన్నది, ఉన్నదంతా అంటుండేవారు.

అదే కోవకు చెందిన శ్రీ నిసర్గదత్త మహరాజ్ ఈ విషయమై ఏమంటారో చూడండి.

**ప్రశ్న :** మీకు మతం మీద అంత లక్ష్యమున్నట్లు కనిపించదు.

**నిసర్గ :** మతమంటే ఏమిటి? ఆకాశంలో ఒక మబ్బు, నేను ఆకాశంలో నివసిస్తుంటాను, మబ్బుల్లో కాదు. మతమనేది పదాలపోగు. ఆ పదాలనన్నీ ఒకటిగా చేసి ధరిస్తారు. వాగ్బాహుళ్యాన్ని తొలగించి చూడు, మిగిలేదేమిటి? సత్యం ఒక్కటే మిగులుతుంది.

మార్పులేని చోట నా నివాస మేర్పరుచుకున్నాను; అక్కడ ద్వంద్వాలు, వ్యతిరిక్తాలు నిరంతరం సమాధానపడుతూ, సంపూర్ణమవుతున్నట్లు కనిపిస్తుంటుంది. ఇక్కడికి వచ్చే వారు ఇలాంటి స్థితి ఒకటుందని తెలుసుకోడానికీ, ఆ స్థితి బహిర్గతం కావడానికి ఉన్న ఆటంకాలేమిటో కనుక్కోవడానికీ వస్తుంటారు. ఒకసారి గనక ఆ స్థితి ద్యోతకమైతే దానిని తమ చైతన్యంలో ఎలా స్థిరీకరించాలో, తద్వారా అవగాహనకూ, ఆచరణకూ ఏ విధమైన వైరం లేకుండా ఎలా జీవించాలో, నేర్చుకోడానికి వస్తారు.

నిజానికి ఆ స్థితి మనసుకు ఆవల ఉండేది కాబట్టి నేర్చుకునేది కూడా ఏమీ లేదు. మనసు చేయగలిగిందల్లా, ఈ స్థితిని ఆటంకపరుస్తున్న వాటిపై దృష్టి నిలపడం మాత్రమే. ఆటంకాన్ని ఆటంకంగా చూడడం సార్థకమైన చర్యే, కారణమేమిటంటే మనసే మనసు మీద పనిచేస్తున్నది కాబట్టి.

ఓం ప్రథమం నుండీ ప్రారంభించు. 'నువ్వు ఉన్నావు' అనే సత్యాన్ని ముందు సావధానంగా గమనించు. 'నేను లేను' అనే మాట నీకు నువ్వు ఏ క్షణాన కూడా అనగలిగి లేవు కదా? కాకపోతే 'నాకు జ్ఞాపకం లేదు' అని మాత్రమే అనగలిగి ఉన్నావు. ఈ జ్ఞాపకశక్తి అంత విశ్వసించదగింది కాదని నీకు బాగా తెలుసు. ఏవో చిన్న స్వల్పమైన సొంత వ్యవహారాల్లో మునిగిపోయి నువ్వెవరో విస్మరించావు అన్న సంగతి అంగీకరించు, జ్ఞాతమైన దానిని, ఈ తెలియబడిన దానిని పక్కకునెట్టి, నువ్వు మరిచిపోయిన దానిని జ్ఞప్తికి తెచ్చుకో. అప్పుడు ఏమి జరుగుతుంది అనేది నీకు చెప్పవలనుపడదు; చెప్పడం అభిలషణీయం కూడా కాదు. ముందే తెలుసుకోవాలనే ప్రయత్నం పలురకాల భ్రాంతికి దారితీస్తుంది.

ఈ అంతర్‌శోధనలో ఎదురుచూడనిది తప్పనిసరిగా ఎదురవుతుంది. ఇక్కడ కనుగొనేది ఎప్పుడూ మన ఊహకు అందనటువంటిదే అవుతుంది. భూమిపై జన్మించిన తర్వాత జీవితమెలా ఉంటుందో గర్భస్థ శిశువు తెలుసుకోజాలదు. అందుకు కారణమేమిటంటే, జీవితాన్ని గురించి దృఢమైన, ప్రామాణికమైన ఒక చిత్రం నిర్మించుకోడానికి అప్పటికి ఆ గర్భంలోని శిశువు మనసులో తత్సంబంధమైనదేదీ ఉండదు కాబట్టి, ఈ విషయంలో అది ఏమీ చేయగలిగి లేదు.

అలాగే మనిషి మనసు కూడా, తానొక అవాస్తవిక స్థితిలో ఉంటూ వాస్తవ స్థితిని ఎప్పటికీ కనుగొనలేదు; ఆ మనసు చేయగలిగిందల్లా 'ఇది కాదు, అది కాదు' అని తెలుసుకుంటూ ముందుకు సాగడమే, ఇక్కడ కనిపించే అవాస్తవికమైన దానిని వాస్తవంగా అనుకోవడమే అన్నిటికన్నా పెద్ద ఆటంకం. ఈ అసత్యమైన దానిని అసత్యంగా గుర్తించి విసర్జిస్తే, సత్యం దర్శనమిస్తుంది.

ఈ పరిపూర్ణమైన స్పష్టత, ఈ అపారమైన ప్రేమ, సంపూర్ణమైన నిర్భయత్వం, ఈ స్థితులన్నీ కూడా ఇప్పటికి కేవలం పదాలు మాత్రమే. రంగులేని వెలుపలి ఆకారాలు, అది ఏమై ఉంటుందనుకోడానికి సూచనలు. అంతకన్నా మరేమీ కావు. నీ స్థితి ఏమిటంటే; ఆపరేషను చేయించుకుంటే కంటిచూపు వస్తుందని ఎదురుచూసే గుడ్డివాని స్థితి; అదైనా

నువ్వా ఆపరేషనును తప్పించుకుందామని అనుకోకుండా ఉంటేనూ. నా విషయమంటావా, నేనున్న స్థితిలో మాటలు ఎలాంటివైనా, అవి ఉన్నా లేకపోయినా అంతా ఒకటే. శబ్దాలు, పదాలకు ఏ విలువా లేదు. వాస్తవాలొక్కటే నే పరిగణించేది.

**ప్రశ్న :** మాటలు లేకుండా మతమే లేదు.

**నిసర్గ :** గ్రంథ రూపంలో రాసిపెట్టిన మతాలు అర్థశూన్యమైన మాటల కుప్పలు. మతమనేది తన నిజస్వరూపాన్ని తన చర్యల్లో ప్రదర్శిస్తుంది. నిశ్శబ్దంగా అది ఆచరించే కర్మలో కనపరుస్తుంది. ఒక మనిషి దేనిని నమ్ముతున్నాడో తెలుసుకో దలుచుకుంటే, అతడెలా ప్రవర్తిస్తున్నాడో తిన్నగా చూడు. మనుషుల్లో చాలామంది అనుసరించే మతం, తమ శరీరాలనూ మనస్సులనూ సేవిస్తూ ఉండడమే. వారందరికీ మతపరమైన భావన లుండవచ్చు; కానీ వాటి ననుసరించి కర్మాచరణ మాత్రం ఉండదు. ఆ ఉదాత్త భావనలతో ఆడుకుంటారు. అవంటే ఎంతగానో ఇష్టపడతారు. కానీ వాటని ఏనాడూ ఆచరించరు, అమలుపరచరు.

# సాధు జీవనం దుఃఖరహితం

ఎఱుకలేని చైతన్యమంటూ ఉండదు. కానీ గాఢ నిద్రలోలాగా, చైతన్యం లేని ఎఱుక ఉండగలదు.

దృష్టిలో వస్తువు గనక ఉంటే, ఎఱుక చైతన్యమవుతుంది. వస్తువు ఎప్పుడూ మారుతూ ఉంటుంది. చైతన్యంలో గమనం ఉంటుంది; కేవలం ఎఱుకకు గమనమూ లేదు, కాలమూ లేదు. అది ఎప్పుడైనా ఇక్కడే ఇప్పుడే ఉంటుంటుంది.

మనసు దేహంలో కేంద్రీకృతమై ఉన్నది. చైతన్యం మనసులో కేంద్రీకృతమై ఉన్నది. ఎఱుక మాత్రం స్వతంత్రమైనది. శరీరానికి సంబంధించిన ప్రేరేపణలు, తొందఱలు శరీరానికి ఉండవచ్చు. మనసుకు చెందిన సుఖదుఃఖానుభూతులు మనసుకు ఉండవచ్చు. కాని, ఎఱుకకు మాత్రం దేనితోనూ అనుబంధం లేదు; అది ఎప్పుడూ నిశ్చలంగానూ, నిబ్బరంగానూ ఉంటుంది. అది స్వచ్ఛంగా, తేటతెల్లంగా, నిశ్శబ్దంగా, శాంతంగా, సావధానంగా, నిర్భయంగా ఉంటుంది. దానికి కోరిక లేదు. భయంలేదు. అదే నీ నిజమైన సత్త అని దానినే ధ్యానించు. నిత్య జీవితంలో అదే నువ్వుగా ఉండు. దాని సంపూర్ణత్వం నీలో సాక్షాత్కరించక తప్పదు ! అంటారు నిసర్గదత్త మహరాజ్.

భగవంతుణ్ణి సంపూర్తిగా శరణుజొచ్చిన శ్రీ రామకృష్ణ పరమహంస, అరుణాచల రమణుడు జీవితంలో ఎంత బాధ ననుభవించారో అందరికీ తెలుసు. రామకృష్ణుడి కంఠంలో వచ్చిన వ్యాధి అతడి చివరి దశల్లో ఎంత బాధపెట్టిందో, ఆ బాధను చూడలేక ఆయన శిష్యవర్గం ఎంత విలవిలలాడిందో, అంతా కూడా గ్రంథస్థమై ఉన్నది.

అలాగే శ్రీరమణుడు తన శరీరం మీద పుట్టుకొచ్చిన వ్రణాలతో ఎంత బాధపడ్డాడో, ఆ విషయం కూడా లిఖితమై ఉన్నదే. పిన్న వయసులోనే జీవితం చాలించిన మరొక ఆధ్యాత్మిక సామ్రాట్ స్వామి రామతీర్థ చివరి రోజుల్లో వ్యాధితో చిక్కి నుక్కిపోయాడు.

ఇటీవలి కాలంలో భక్తునిగా ప్రకటించుకోకపోయినా, ఆ మహాశక్తికి జీవితాన్ని అంకితం చేసుకుని జీవించి తరించిన శ్రీ జిడ్డు కృష్ణమూర్తి తన చివరి దశలో 'పాంక్రియాస్' కు వచ్చిన వ్యాధితో ఎంత బాధకు గురైనాడో, అందరికీ ఎఱుకే. వీరేకాక, మరెందరో భక్తులు వారి వారి జీవితాల్లో ఎన్నో బాధలు పడ్డట్లు ఆధారాలున్నాయి.

ఈ పరిస్థితిలో ఎవరికైనా ఒక సందేహం జనిస్తుంది. భగవద్భక్తులైన వారు కూడా, మిగతా అందరిలాగానే అన్ని రకాల వ్యాధులకు, తుదకు క్రూర వ్యాధులకు సైతం గురవుతూ ఉంటే, వారు భగవంతుణ్ణి నమ్ముకున్నందుకు, శరణు జొచ్చినందుకు ఫలితమేమిటి? అని అనిపిస్తుంది. కానీ ఇవతల నుంచున్న మనకు, భక్తులుపడే శారీరక బాధ యావత్తూ 'నరకం'గా కనిపించవచ్చు. కానీ, వారికి అట్లా అనిపించక పోవచ్చు. ప్రేమతత్వాన్ని భక్తి రూపంలో కనుగొన్న ఆ మహనీయులకు తాము ఈ శరీరమనే భావన ఏనాడో నశించి ఉంటుంది. మనసు ఎంత చంచలమైనదో, అది ఎన్ని ద్వంద్వాలకు గురవుతుంటుందో, దానికి వచ్చే తలపులు, కలిగే ఆశలు, భయాలు ఎంత వ్యర్థమైనవో ఏనాడో కనుగొన్నారు. సహజ సమాధి స్థితిలో ఎన్నిమార్లో మనసు యెడలా, శరీరం యెడలా 'మృతి' చెందినవారు. 'నీట ముంచినా పాల ముంచినా నీవే'నని త్రికరణశుద్ధిగా నమ్మడమే కాక, విధి నిర్ణయాలను ఏనాడూ ప్రశ్నించినవారు కాదు.

ఈ అన్ని కారణాలవల్ల 'శరీరమే నేను' అని భావించే మనం పడ్డంత బాధ వారు పడే అవకాశం లేదు. శరీరబాధ ఉన్నా, మనసు దుఃఖించదు. వారిలాగానే మనకు 'ఈ శరీరం నేను కాదనే' విషయం స్పష్టంగా కనిపిస్తే మనకు కూడా బాధ ఉపశమింప నారంభిస్తుంది. ఇది ఎవరికి వారు సాధించవలసిన విషయం.

నిసర్గదత్త మహరాజ్ కూడా తన అంత్యదశలో స్వరపేటికలో ఏర్పడిన వ్యాధితో చాలా 'బాధ' అనుభవించినట్లే కనిపిస్తుంది.

ఇలాంటి 'బాధ'ను గురించి ఆయన ఏమంటారో చూద్దాం.

**పృచ్ఛకుడు :** ఈ భూమి మీద జీవించడం ఏమంత సుఖంగా ఉన్నట్లు తోచదు. ఇది ఇంత దుఃఖమయ మవడానికి కారణమేమిటంటారు?

**నిసర్గదత్త :** నొప్పి అనేది శరీరానికి సంబంధించినది; దుఃఖమనేది మానసికం. మనసు కావల దుఃఖంలేదు. నొప్పి, శరీరం ప్రమాదానికి గురవుతున్నదని తెలియజేసే ఒక సంకేతం. అనగా దాని విషయంలో నువ్వు చేయవలసినదేదో చేయమని సూచిస్తున్నది. అలాగే దుఃఖమనేది ఈ 'జ్ఞాపకాల – అలవాట్ల కట్టడానికి' ఏదో మార్పు సంభవించ బోతున్నదనో, అది ఏదో కోల్పోబోతున్నదనో, జరిగే హెచ్చరిక.

నొప్పి అనేది శరీరం యొక్క ఉనికికి అత్యంత ఆవశ్యకం. కానీ నిన్ను దుఃఖించమని ఎవరూ బలవంతపెట్టగలిలేరు. నీ దుఃఖం ప్రతి ఒక్కదానిక అంటిపెట్టుకుని వేళ్ళాడు తున్నందు వలనా, ఏదైనా కోల్పోతావనగానే ప్రతిఘటించడం వలనా జనిస్తున్నటు వంటిది.

ముందుకు సాగడం, జీవితంతోబాటు ప్రవహించడం మనకు నచ్చలేదన్న మాట. ఆరోగ్య విధులు, ఆహార విహారాల నియమం పాటిస్తూ జీవించే స్వస్థ చిత్తునికి నొప్పి నుండి స్వేచ్ఛ ఎలా లభిస్తుందో అలాగే సాధుపురుషుని జీవితం దుఃఖరహితంగా ఉంటుంది.

**పృ :** కానీ లోకంలో సాధువులు పడినంత బాధ మరెవ్వరూ పడినట్లు కనిపించదు.

**ని :** ఆ మాట వారు నీతో అన్నారా, లేక వారిని గురించి ఊహించుకుని నువ్వీ మాట అంటున్నావా? జీవితంలో క్షణక్షణమూ ఎదురయ్యే పరిస్థితులకు సంపూర్ణాంగీకారం తెలుపుతూ, వాటితో శ్రుతి కలిపి, పొందికగా జీవించడమే సాధు జీవనసారం. పరిస్థితులు ఇలా కాకుండా మరో రకంగా తన ఇచ్ఛ ననుసరించి ఉండాలని సాధు పురుషు డాశించడు. అన్నిటినీ దృష్టిలో ఉంచుకొని చూచినప్పుడు, పరిస్థితి ఇలా కాక మరోలా ఉండదని అతడికి తెలుసు; వీటి నుండి తప్పించుకునే వీలు లేదని కూడా అతడికి తెలుసు. ఏదైతే అనివార్యమో దానితో మైత్రీభావంతో బతుకుతాడు; అందువల్ల అతడికి దుఃఖంలేదు. శారీరక బాధ ఉండవచ్చు. కానీ అది కూడా అతడ్ని చీకాకు పరచదు. శరీరంలో ఏర్పడిన అస్తవ్యస్త పరిస్థితిని చక్కదిద్దడానికి అవసరమైనదేదో చేస్తాడు. లేదంటే దాని గతికి దానిని వదిలేస్తాడు.

**పృ :** ప్రాణాపాయం సంభవించేటంతటి రుగ్మతకు గురవుతారనుకోండి. మీ కప్పుడు దుఃఖమూ, రోషమూ, కోపమూ కలగవంటారా?

**ని :** ఇప్పటికే మరణించి ఉన్న నాకు ఇవన్నీ కలిగే ప్రసక్తి ఏముంటుంది? పోనీ అలా కాదంటే , నేను జీవించీలేను, మృతిచెందీ లేనని భావించవచ్చు. నీ మనసులో నువ్వు తేల్చుకున్న అభిప్రాయాలు, నిన్ను బంధిస్తాయే కానీ, మరొకర్ని బంధించవని గుర్తుంచుకో. నన్ను గురించి నీవేర్పరచుకున్న మనో చిత్రం సరియైనది కాదేమో, సరిగా చూడు. నిన్ను గురించి నీ మనసులో నువ్వు చిత్రించుకున్న 'ప్రతిమ' కూడా దోషపూరితమే. అయితే ఆ సమస్య నీది కాని, నాది కాదనుకో. కానీ నువ్వు నాకు సమస్యలు సృష్టించి, వాటిని నన్న పరిష్కరించమని అడగనవసరం లేదు. నా వరకు నేను సమస్యలను సృష్టించేదీ లేదు, పరిష్కరించేది లేదు.

# ఆశ్రమస్థాపన

కొందరికి కాస్తంత దైవచింతన ప్రారంభమయ్యేలోగానే ఏవో ఒకటి రెండు ఆధ్యాత్మికానుభూతులు కలిగినవనుకొని, స్వప్నంలోని ఏ దేవతో కనిపించి ఏదో ఆదేశ మిచ్చినట్లు భావించి, ఒక ఆశ్రమం స్థాపించాలనే ప్రయత్నంలో పడతారు.

అదైనా తా మొక్కరూ ఏ నిర్జన ప్రదేశంలోనో గుడిసె వేసుకొని ఏదో సాధన ప్రారంభిద్దామనే ఆలోచనతో సరిపుచ్చుకోరు. నగరాలకు అల్లంత దూరంగా (మరీ ఎవరూ సందర్శించుకోడానికి వీల్లేనంత దూరంగా కాదు సుమండీ) మంచినీటి వసతీ, విద్యుచ్ఛక్తి సరఫరా ఉండే చోటును ఎన్నుకొని ఆశ్రమానికి గాను ఎవరిచేతనో ఇంత భూమిని దానం చేయించి పని ప్రారంభిస్తామంటారు. తానే గాక మరి పదిమందిని అక్కడ చేర్చి సామూహిక ప్రార్థనలు, యోగ తరగతులు, ప్రాణాయమ శిక్షణలు, చికిత్సకై ఒక డిస్‌పెన్సరీ, ఇవన్నీ కూడా ప్రారంభించా లంటారు. ఆశ్రమాన్ని స్వయం పోషకం చేయడానికి చీనీ తోటలు, సపోటా చెట్లూ, మరేవేవో పథకాలు చేపట్టాడు. అనతికాలంలో అదొక లంపటంగా తయారవుతుంటుంది. ఇక్కడ జరిగే ధ్యానం, ఆధ్యాత్మిక సాధన ఎంతగా ఫలిస్తాయో చెప్పలేము. కానీ, ఆశ్రమ స్థాపకుని శ్రద్ధ మాత్రం ఆశ్రమాన్ని ఆర్థికంగా స్వయంపోషకం చేయడం మీదనే కేంద్రీకృత మవుతుంది.

అనేక చిన్న మఠాలు మానేజ్‌మెంట్లు కూడా నిధులు చాలక ఎంతసేపూ వదాన్యుల వితరణశీలం మీద ఆధారపడుతుంటై. అనుకోకుండా మఠంలో రెండు వర్గాలు గనక ఏర్పడితే, ఆధిపత్యం ఎవరికుండాలి అనే విషయంపై ఇరువర్గాల మధ్య ఏకాభిప్రాయం కుదరక, పరిష్కారానికై కోర్టుకెక్కుతుంటై. ఇలాంటి వాతావరణంలో ధ్యానమెలా కొనసాగుతుందో ఎవరైనా ఊహించుకోవచ్చు.

మఠంలో ఏ రాజకీయాలూ లేకపోయినా, మఠం కట్టుబాట్లు, నియమనిబంధనల మధ్య సాధకుడు ఎంత ధ్యానించగలుగుతాడు అనేది కూడా చర్చనీయాంశమే. ఆశ్రమాల చట్రంలో నిర్బంధింపబడి, వారీ వీరి అదుపాజ్ఞలో ఉంటూ ధ్యానం కొనసాగించడం కష్టమనీ, స్వేచ్ఛా వాతావరణంలో తన అంతరాత్మలోనే గురువును కనుగొని అతడినే

అనుసరించి, ధ్యానమార్గాన్ని అవలంబిస్తేనే పూర్తి వికాసం సాధ్యమనీ కర్ణాటకలో ఆనందాశ్రమం స్థాపించిన స్వామీ రామదాస్ (పాపా) అభిప్రాయం !

ఇక జిడ్డు కృష్ణమూర్తి గారైతే నేటి గురువులు స్థాపించే ఆశ్రమాలను మఠాలను 'కాన్‌సెన్‌ట్రేషన్ కాంప్స్'గా అభివర్ణిస్తుండేవాడు. తానొకసారి సరదాగా కొన్నాళ్ళు ఒక మఠంలో (విదేశాల్లో ఉంది) నివసించి అక్కడి వారి క్రమశిక్షణంతా జాగ్రత్తగా పాటించి కూడా చూశానని చెప్పుకున్నాడు. తెల్లవారుజామునే గంటకొట్టగానే ఉలిక్కిపడి లేవడం, నియమానుసారంగా ధ్యానించడం, రోజుపొడుగూతా మౌన మాచరించడం, ఆ ఇనుప చట్రంలో మరేవో కఠిన నిబంధనల ప్రకారం జీవించడం, అన్నీ తానూ చేసి చూశాడు. ఫలితంగా "ఆ విధానమంతా ఓ రకమైన హింసండీ" అంటారు శ్రీ కృష్ణమూర్తి. ఆశ్రమాలలో పడే శ్రమ 'ఆ' (దైవపరమైన) 'శ్రమ'గా రూపొందాలి కానీ, అక్కడ కూడా ఇక్కడ మామూలు గృహస్తులలాగా పడే "ఈ" (లౌకికమైన) 'శ్రమే' గనక అయినట్లయితే, ఫలితాలు గూడా అందుకు అనుగుణంగానే ఉంటై. జీవితంలో ఏ ఆశ్రమమూ స్థాపించాలనుకోకుండా, బొంబాయి నగరంలోని ఒక ఇరుకు సందులోని చిన్న ఇంటి నుండే లోకానికి మహత్తర సందేశాన్ని అందించిన నిసర్గదత్త మహరాజ్, ఆశ్రమాలను గురించి ఏమని అభిప్రాయపడ్డాడో చూద్దాం.

**పృచ్ఛకుడు :** నాకే గనక ఒక పెద్ద భవనమూ, చుట్టూ కావలసినంత ఖాళీస్థలమూ ఉన్నట్లైతే, ఓ చక్కని ఆశ్రమం స్థాపించి ఉండేవాణ్ణి. అందులో సాధకులు నివసించడానికి విడివిడి గదులూ, అందరికీ ఉపయోగపడే ఒక ధ్యానమందిరం, ఫలహారశాల, గ్రంథాలయం, కార్యాలయం అన్నీ ఏర్పాటు చేసుండేవాణ్ణి.

**నిసర్గదత్త :** ఆశ్రమాలను, పూనుకొని స్థాపించడం అంటూ ఉండదు. అవి వాటంతట అవే సంభవించాలి, తమంతట తామే రూపు దిద్దుకోవాలి. వాటిని నువ్వు ప్రారంభించనూ లేవు. ఉద్భవించకుండా నిరోధించనూ లేవు. ఒక నదీ ప్రవాహాన్ని నువ్వెలా ప్రారంభించలేవో, ఎలా ఆపలేవో, అలాగే ఈ ఆశ్రమం విషయం కూడాను.

ఒక ఆశ్రమం స్థాపించి సమర్థవంతంగా నిర్వహించాలంటే చాలా విషయాలు కలిసిరావాలి. వాటిల్లో నీ అంతర్గత పరిపక్వత అనేది ఒక అంశం మాత్రమే. ఇక నీ నిజస్వరూపమేమిటో నీకు తెలియకుండా నువ్వు ఏది ప్రారంభించినా లేవు. ఒక నదీ ప్రవాహాన్నీ నువ్వెలా ప్రారంభించవలెనో, ఎలా ఆపలేవో, అలాగే ఈ ఆశ్రమం విషయం కూడాను.

ఒక ఆశ్రమం స్థాపించి సమర్థవంతంగా నిర్వహించాలంటే చాలా విషయాలు కలిసిరావాలి. వాటిల్లో నీ అంతర్గత పరిపక్వత అనేది ఒక అంశం మాత్రమే. ఇక నీ నిజస్వరూపమేమిటో నీకు తెలియకుండా నువ్వు ఏది ప్రారంభించినా అది చివరకు బూడిద అవుతుంది. ఎవరో గురువును అనుకరించ గలనని అనుకోవద్దు. ఎలాంటి కాపట్యం ప్రదర్శించినా అది తుదకు వినాశానికే దారితీస్తుంది.

**పృ :** సాధు పురుషుడు అవకముందే, అలా సాధువుగా ప్రవర్తించడంలో హాని ఏమిటంటారు?

**ని :** సాధుత్వాన్ని 'రిహార్సల్సు' చేస్తూ ఉండడ మనేది ఒకరకమైన సాధన. దాని వల్లనే ఏదో పుణ్యం దక్కుతుందని అనుకోకుండా ఉన్నంతసేపూ, అందుకు అభ్యంతరం లేదు.

# గురుకర్తవ్యం

గురు శిష్య సంప్రదాయం పేరిట ఇటీవలి కాలంలో సాగుతున్న పరస్పర వంచన, దోపిడీలను చూచి ఎందరో స్వచ్ఛమైన యోగులు ఈ పద్ధతిని తీవ్రంగా ఖండించారు. కానీ కొత్త గురువులు ఎప్పటికప్పుడు వెలుస్తూనే ఉన్నారు; తమ తమ ప్రయోజనాలను ఆశించిన శిష్యకోటి వారి చుట్టూ పోగవుతూనే ఉన్నారు. ఒక వర్గం వారి మనుగడ మరొక వర్గం మీద ఆధారపడుతుంటుంది.

ప్రపంచవ్యాప్తంగా కనిపించే ఇలాంటి 'ఆధ్యాత్మిక పరిశ్రమలు' వెదజల్లే కాలుష్యమంతా ఇంతా కాదు. అందుకనే జిడ్డు కృష్ణమూర్తి గారు ఈ పరస్పర దోపిడీని, వంచననూ నిశితంగా విమర్శించేవారు. తాను ఎవరికీ గురువును కాననీ, తనకు అనుచరులంటూ ఎవరూ లేరంటుండేవారు. తాను చెప్పేది అర్థం చేసుకుని అలాంటి అవగాహనతో జీవించేవారిని చూచి సంతోషించేవారు.

అరుణాచల రమణుడు కూడా ఈ 'గురు'పదాన్ని అవతలికి విసిరేశాడు. పాల్‌బ్రంటన్ ఆయనతో, "మిమ్మల్ని నేను గురువుగా భావించడాన్ని మీరెందుకు అడ్డుకుంటున్నారు?" అని ప్రశ్నించగా, "నీకు గురువు ఉండాలనే ఈ తీవ్రమైన కాంక్ష ఎక్కడిది? నిన్ను ముందుకు నడిపించేది నీలోనే ఉన్నదని నేను చెప్తుంటే నాకు గురువు ఉండాలనే నీ పట్టుదల ఏమిటి?" అని ఎదురు ప్రశ్నవేశారు.

నిజంగా మీ మేలు కోరేవాడెవడూ, తాను మీ గురువునని చెప్పుకోడు. మిమ్మల్ని వాడుకోడు, వంచించడు, మైత్రీ భావంతో మిమ్మల్ని తరింపజేస్తాడు.

గురునామం స్వీకరించినా, స్వీకరించకపోయినా, మిమ్మల్ని ఉద్ధరించాలని గాఢంగా కోరుకున్న శ్రీ నిసర్గదగ్గ మహరాజ్ గురు కర్తవ్యాన్ని ఎలా నిర్వచించాడో చూడండి.

**పృచ్ఛకుడు :** మీరూ, మీ పూర్వపు గురువులూ పరంపరానుగతంగా దత్తాత్రేయుని అవతారంగా మేము భావించవచ్చునా?

**నిసర్గదత్త :** మీరు ఏది నమ్మదలుచుకుంటే అది నమ్మండి. మీ నమ్మకాన్ని అనుసరించి మీరు కర్మనాచరిస్తే, అందుకు తగిన ఫలితాలు మీకు దక్కుతాయి. కానీ

వీటి వేటికీ నేనేమాత్రం ప్రాధాన్యమివ్వను. నేను ఇప్పుడు ఏమై ఉన్నానో అది నేను; నాకది చాలు. వేరొకరు ఎంత గొప్పవారైనప్పటికీ, వారితో నన్ను పోల్చుకోవాలనిగాని, వారిలో ఐక్యమవ్వాలని గానీ నాకు లేదు. అలాగే ఏవో పురాణ గాథలను వాస్తవాలుగా భావించే స్థితిలో లేను. నా వరకు నాకు ఈ కనిపించే అజ్ఞానం, దీని నుండి విముక్తిని గురించే నా శ్రద్ధ అంతాను.

తమ శిష్యుల్లోని మనస్సులలోనూ, హృదయాలలోనూ ఉండే అజ్ఞానాన్ని విచ్ఛేదం చేయడమే గురువుయొక్క అసలు కర్తవ్యం. శిష్యుడు ఇదంతా ఒకసారి అర్థం చేసుకున్న తర్వాత రుజువు చేసుకోడానికై ఆచరించవలసిన కర్మ యావత్తూ అతడు స్వయంగా ఆచరించు కోవలసిందే కానీ, ఒకరి తరఫున మరొకరెవరూ చేసిపెట్టగలిగిలేరు. శిష్యుడు గనక సరిగా ఆచరించలేకపోతే, అతడికి విషయం సుబోధకం కాలేదన్నమాట.

**పృ :** పూర్తిగా నిరాశ జనింపజేసే శిష్యులు కూడా మీకు తారిసిల్లుతూంటారను కుంటాను.

**ని :** సంపూర్తిగా నిరాశ కలిగించే శిష్యుడంటూ ఉండడు. ఆటంకాలను అధిగమించే వీలున్నది. జీవితం సరిచేయలేనటువంటిది, మరణం ఎలాగూ అంతం చేస్తుంది. కానీ గురువుకు అపజయమంటూ లేదు.

**పృ :** మీకీ భరోసా ఎలా కలిగింది?

**ని :** మరేంలేదు. గురువున్నూ, మనిషి అంతరంగంలోని వాస్తవమూ – రెండూ కూడా మనసుకు విముక్తి కలిగించి మనిషిని కడతేర్చడానికనే పాటుపడుతున్నాయి. వాటికి అపజయమనేది ఉండే వీలులేదు. ఏ బండరాళ్ళయితే వాటికి అవరోధాలుగా పరిణమిస్తాయో, వాటి ఆధారంగానే అవి తమకవసరమైన వారధి నిర్మించుకో గలుగుతాయి.

మానవుడిలో ఉండేదంతా చైతన్యమొక్కటే అనుకోరాదు. గురువుతోనూ, అంతరంగం తోనూ మరింతగా సహకరించే 'లెవెల్స్' (మట్టం) ఎన్నో ఉన్నాయి. గురువు ఈ 'లెవెల్స్' నన్నిటినీ బాగా ఎరిగున్నవాడు కాబట్టి, అతడికుండే శక్తి ఓర్పు అపారమైనవి కాబట్టి, గురువుకు ఓటమి లేదు.

నిజమైన గురువు నిన్ను ఎన్నటికీ పలుచన చేయడు. నీ నుండి నిన్ను వేరు చేయడు. నిరంతరం నీలోని సంపూర్ణతను నీకు గుర్తుచేస్తూ, నీలోన నీవు తరచి చూచుకునేట్లు ప్రోత్సహిస్తుంటాడు. వెలుపలి నుండి నువ్వు కోరదగింది ఏదీలేదనీ, ఆఖరికి గురువైన తాను కూడా అనవసరమేననీ, విసుగూ విరామం లేకుండా గుర్తుచేస్తుంటాడు.

కానీ తనంతట తానే గురువుగా ప్రకటించుకున్నవాడికి తనని గురించిన చింతే ఉంటుంది కానీ, శిష్యుల శ్రేయస్సు యెడల ఉండదు.

**పృ :** గురువుల్ని మార్చడం తప్పులేదంటారా?

**ని :** మార్చితే తప్పేమిటి? గురువులు మైలురాళ్ళ వంటివారు. ఒక దరి నుండి మరొక దరికి వెళ్ళడం సహజమే. ప్రతి ఒక్క గురువూ కూడా మైలురాయిలాగా దిక్కునూ దూరాన్నీ సూచిస్తుంటాడు.

ఇక నిత్యమూ శాశ్వతమూ అయిన సద్గురువంటావా, అతడు సాక్షాత్తూ నువ్వు ప్రయాణిస్తున్న ఆ మార్గమే. నీ మార్గమే నీ లక్ష్యమని, ఎల్లవేళలా దానినే నువ్వు అంటి పెట్టుకుని ఉండడం సంభవిస్తే ఇక సమస్యేలేదు. నువ్వు ఆ మార్గంమీద చేసే ప్రయాణం ఏ లక్ష్యాన్ని చేరడానికి కాదు సుమా, కేవలం ఆ సౌందర్యాన్ని అనుభవించడానికి, ఆ జ్ఞానాన్ని కనుగొనడానికి మాత్రమే ఈ ప్రయాణం. అప్పు డీ జీవితం భారమనిపించదు; ఎంతో సహజంగా సరళంగా ఒక మహదానందంగా రూపొందుతుంది.

# సహాయం

**మా**నవ సేవయే మాధవ సేవ అని ఒకవంక అంటూనే, "మరొకరికి సహాయ పడుతున్నానని గర్వపడకు. నీ సహాయంతో మరొకరు ఉద్ధరింపబడుతున్నాడని విర్రవీగకు. ఆ సృష్టికర్త నిర్మించిన ఈ లోకానికి నువ్వు సమాయపడేంతటి వాడివా? కాదు. ప్రధానంగా నువ్వు ఏది చేసినా నిన్ను ఉద్ధరించుకోడానికే ఈ లోకంలోకి వచ్చింది" అని మరోవంక హెచ్చరిస్తూంటారు మహాయోగులు.

ఆధ్యాత్మిక రంగంలో 'There is no help' అని ఖచ్చితంగా చెప్తుండేవారు శ్రీ జిడ్డు కృష్ణమూర్తిగారు. ఒకమారు వారణాసిలోకి రాజఘాట్ సమావేశంలో ఒక ఉత్తర హిందూస్థానీయుడు, "అరవై డెబ్బై ఏళ్ళబట్టీ దేశ దేశాల మానవజాతికి ఇంతటి సహాయ మందజేస్తూ కూడా నేను మీకు సహాయం చేయడంలేదని అంటారెందుకు?" అని ప్రశ్నించాడు. "ఈ విషయాల్లో నేనెవ్వరికీ సహాయం చేయడంలేదు అని ఎన్నిమార్లు చెప్పినా వినరేమి? నేను కేవలం ఉన్నది ఉన్నట్లు మీకు చూపిస్తున్నాను. మీకు అర్థమైతే మీకు మీరే సహాయం చేసుకుంటారు" అని ఆయన సమాధానం.

ఈ సందర్భంగా ఒకరిని మరొకరు ఉద్ధరించలేరనీ, ఎవరికివారే పూనుకుని కష్టించాలనీ అంటూండేవారు. మనిషి నిజంగా బాగుపడాలంటే, అది ఆత్మవిచారం ద్వారా జరగాలి. వెలుపలి నుండి ఇతరులు చేయగలిగిందల్లా నిమిత్త మాత్రమే.

లోకాన్ని మరమ్మతు చేయగలమనీ, చేస్తున్నామని భ్రమపడేవారిని గురించి నిసర్గదత్త ఏమంటాడో చూద్దాం.

**పృచ్ఛకుడు :** మీరు మరొకరికి అట్టే సహాయ పడగలరని నేననుకోను.

**నిసర్గదత్త :** అదేంమాట? నేనే కాదు, నువ్వూ సహాయపడగలవు. కానీ మనిషి దుఃఖం ఎప్పుడూ పునఃసృష్టించబడుతుంటుంది. మనిషి తనలోని బాధను సమూలంగా తనకు తానే నిర్మూలించుకోవాలి. ఇతరులు మన బాధను ఉపశమింపజేయగలరే కానీ, ఆ బాధ యొక్క మూలకారణాల విషయంలో వారేమీ చేయజాలరు; అడుగు అందని బుద్ధిమాంద్యమే ఈ మూలకారణం.

**పృ :** ఈ అగాధమైన బుద్ధిమాంద్యం ఏనాటికైనా అంతమవుతుందా?

**ని :** వ్యక్తిలో అయితే ఇది సాధ్యమే; ఏ క్షణాన్నైనా జరిగే వీలుంది. కానీ సమష్టిలో, మొత్తం మానవాళిలో – వారి గతి ఏమిటో చూస్తూనే ఉన్నాం కాబట్టి – బహుశా చాలా కాలం పట్టవచ్చు. కాని యావత్ సృష్టిలోనంటావా? ఎన్నటికీ జరగదు. ఎందువల్లనంటే, ఈ సృష్టే అజ్ఞానంలో వ్రేళ్ళూని ఉన్నది. భౌతిక పదార్థమే అజ్ఞానం. తెలియకపోవడం, తనకు తెలియదని కూడా తెలియకపోవడమే అంతులేని ఈ బాధ, ఈ దుఃఖానికి మూలం.

**పృ :** తనని తాను గుర్తుతెచ్చుకున్నందువల్ల, ఆత్మ దర్శనమవుతుందని మీరెలా చెప్పగలరు?

**ని :** ఆ రెండు దశలూ కూడా ఒకే స్థితికి చెందినవి కనుక, తనని తాను గుర్తెరగడ మనేది మనసుకు చెందినది. ఆత్మదర్శనం మనసు కావల జరిగేది. అద్దంలో కనిపించేది బింబం, అద్దానికావల నున్నది ముఖచిత్రమే.

**పృ :** సమంజసంగానే ఉన్నది. కానీ ఈ ఆత్మదర్శనం, ఆ ఆత్మసిద్ధికి, ప్రయోజన మేమంటారు?

**ని :** మరొకరికి సహాయపడాలంటే, తానే సహాయమర్థించే స్థితిలో ఉండకూడదు.

**పృ :** నేను హాయిగా ఉంటే నాకు చాలు.

**ని :** ఇతరులను హాయిగా ఉంచడానికి నీవు హాయిగా ఉండాల్సిందే.

**పృ :** ఇతరుల సంగతి నాకెందుకు? వారి సంగతి వారినే చూచుకోనివ్వండి.

**ని :** అయ్యా ! నువు వేరుగా లేవు. ఇతరులతో పంచుకోలేని నీ ఆనందం నకిలీ సరుకు; పంచుకోడానికి వీలైనదే వాంఛనీయమని గ్రహించు.

**పృ :** లోకాన్ని మార్చే ముందు ఆ మనిషే ముందు మారాలి అనే మీ వంటి వారి బోధ పాశ్చాత్యులు సహించలేరు. ఇది సాధ్యమయ్యేదీ కాదు, దీని అవసరమూ లేదని వారి అభిప్రాయం. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో విధానాల మార్పుకై మానవాళి ఎదురుచూస్తున్నది. మొత్తం ప్రపంచానికి ఒకే ప్రభుత్వం, ఒకే పోలీసు యంత్రాంగం, ఒకే ప్రణాళిక రూపొందించి, భౌగోళిక, సైద్ధాంతిక అడ్డుగోడలన్నిటినీ కూల్చేస్తే చాలు; మనిషి వ్యక్తిగతంగా మారాల్సిన అవసరం లేదని వారి వాదన.

**ని :** మనుషులు, సమాజాన్ని ప్రభావితం చేసి దాన్ని రూపొందిస్తుంటారు అనేది నిజమే; కానీ సమాజం కూడా మనిషి నదే విధంగా ప్రభావితం చేస్తూ ఉంటుంది కూడానూ. కానీ ఇలాంటిది త్వరితంగా అంతమవుతుంది. ఆ తర్వాత మనుషులు మళ్ళీ ఓ కడగండ్ల

చక్రంలో చిక్కుకుంటారు. భూమి మీద వ్యక్తమయ్యే దాని ప్రకృతి ఏమిటంటే, ఎప్పుడూ కూడా కొంత మంచి జరిగిన తర్వాత, దాని వెంటనే అంత చెడూ జరుగుతుంది. అందువల్ల మనిషి అవ్యక్తమైన (Unmanifested) దాని శరణుపొందడమే సరియైన మార్గం.

**పృ :** మీరు పలాయన వాదాన్ని బోధిస్తున్నట్లు కనిపిస్తున్నది.

**ని :** కానే కాదు. పునః సృష్టికి మార్గం పాతదానిని ధ్వంసం చేయడమే. కొత్త హారం తయారు చేయాలంటే పాతనగల హారాలనన్నిటినీ కరగేసి ముద్ద బంగారం తయారు చేయక తప్పదు. ఈ లోకానికి ఆవల నుంచున్నవారే ఈ లోకాన్ని మార్చగలరు. ఈ విధంగా కాక మరో విధంగా ఎన్నడూ జరగలేదు. మానవాళిపై దీర్ఘకాలం చెరగని ముద్ర వేసిన వారందరూ కూడా వాస్తవాన్ని ఎఱిగిన వారే. నువ్వు కూడా ఆ స్థాయినందుకొని, అటు తర్వాత లోకాన్ని మార్చడం సంగతి మాట్లాడు.

# అహింస

అహింస పరమధర్మమన్నారు. కానీ ఈ పరమ ధర్మాన్ని స్వయంగా కనుగొనడానికి చాలా శ్రద్ధగా, తీవ్ర జిజ్ఞాసువుగా జీవించాల్సి ఉంటుంది. నాగరిక మానవుడు కొంతవరకు తన దైనందిన జీవనంలో హింసను పక్కకుపెట్టి ఉండవచ్చు కానీ, మనసా వాచా అతడు హింసా ప్రవృత్తిని నిత్యమూ ప్రదర్శిస్తూనే ఉంటాడు. మనిషికుండే కామక్రోధ లోభ మోహ మదమాత్సర్యాలన్నింటిలోనూ హింస ఉన్నది. ఇవన్నీ తొలగితే గానీ అహింస సిద్ధించదు.

మనసులో ఒక తీర్మానం చేసి, 'ఇక నుండి నేను అహింసను ఆచరిస్తాను' అని అన్నందువల్ల ఏమీ సాధించలేము. మనిషి చాలా జాగ్రత్తగా, తనలో ఉన్న పోల్చుకునే లక్షణం, పోటీపడే లక్షణం, ఏంబిషన్, ఆశ, భయం మొదలైన వాటన్నిటిలో ఉన్న హింసను పరిశీలనగా చూస్తూ బతికితేగానీ హింసయొక్క పూర్తి స్వరూపం కనిపించదు. అది తనను ఎంత బండపారేట్లు చేస్తున్నదీ, తనని ఏ దుర్గతికి దిగజారుస్తున్నదీ కళ్ళారా చూస్తేగానీ, అది వీడిపోదు.

అహింస అనగానే బలప్రయోగం సర్వదా, సర్వథా నిషిద్ధమని అనుకునే వీలులేదు. జీవితంలో అనేక సన్నివేశాల్లో బలప్రయోగం లేకుండా అన్యాయాన్ని అత్యాచారాన్ని, అక్రమాన్ని అడ్డుకోడం సాధ్యంకాకపోవచ్చు. భీముడు బకాసురుణ్ణి వధించినా, శ్రీరాముడు, శ్రీకృష్ణుడు అనేకమంది దుష్ట స్వభావులను శిక్షించినా, సంహరించినా, వీరంతా హింస సలిపారు అని మనమెవరమూ అనుకోవడం లేదు.

ఏది ఏమైనప్పటికీ అహింస పరమధర్మంగా ఆచరించడం, పరిణతి చెందిన కొందరు కరుణాళువులైన వ్యక్తులకు వర్తిస్తుంది కానీ, సామూహికంగా పోలీసు వారికి, మిలటరీ దళానికి, మొత్తం జాతికీ వర్తింపజేద్దామనుకోడం హాస్యాస్పదం.

అహింస పరమధర్మమని ఘోషించిన హిందూ ధర్మంలోనే దేవతా మూర్తులుగా దేవుళ్ళుగా పరిగణింపబడే వారందరూ ఆయుధ పాణులే; ధర్మాన్ని రక్షించిన వారందరూ ఖడ్గధారులే !

అహంస అంటే ఏమిటి, ఎవర్ని మానవుడవచ్చు, మరొకరికి సహాయపడడమెలా అనే విషయాలను నిసర్గదత్త మహరాజ్ చర్చించిన తీరు చూడండి.

**పృచ్ఛకుడు :** ప్రపంచమంతటా ఎటుచూచినా సంకట పరిస్థితులే కనిపిస్తాయి. ఇక నా మనస్సు కూడా కలతతోనే నిండి ఉండడంలో ఆశ్చర్యమేముంటుంది?

**నిసర్గదత్త మహారాజ్ :** సంకటం, విపత్తు లేనటువంటి లోకం అంటూ ఎప్పుడైనా ఉందా? నువ్వొక వ్యక్తిగా జీవించడమనేది కూడా మరొకరిని హింసించడం మీద ఆధారపడి ఉంటుంది. ఆ మాట కొస్తే నీ దేహమే ఒక రణరంగం; అందులో మృతి చెందినవీ, చెందుతున్నవీ ఎన్ని కణాలో! భూమిపై ఉనికిలోనే హింస ఇమిడి ఉన్నది.

**పృ :** మనల్ని మనం శరీరాలుగా పరిగణించినప్పుడు మీరు చెప్పేమాట నిజమే ననుకోండి. కాని మనల్ని మానవులుగా చూచుకున్నప్పుడు మాత్రం మీరు చెప్పేది నిజం కాదంటాను. మానవుడి జీవనం అహింస అనే సూత్రం మీదనూ, అతడి మరణం హింస అనే సూత్రం మీదా ఆధారపడి ఉన్నది.

**ని :** ప్రకృతిలో అహింస అట్టే కనిపించదు.

**పృ :** దైవమూ, ప్రకృతీ మానవ పరిధికి చెందినవి కాదు. అందువల్ల అవి మానవత్వాన్ని ప్రదర్శించకపోయినా ఫరవాలేదు; నేను ప్రస్తావిస్తున్నది, ఆలోచిస్తున్నది మనిషిని గురించి మాత్రమే. మానవుడిగా జీవించాలంటే నేను సంపూర్తిగా కరుణతో బ్రతకాలి.

**ని :** కాపాడుకోడానికి నీకో 'సెల్ఫ్' ఉన్నంత కాలం నువ్వు. హింసాత్మకంగా ప్రవర్తించక తప్పదని నువు గ్రహించావా?

**పృ :** గ్రహించాను. నేను నిజంగా మానవుడిగా ప్రవర్తించాలంటే, స్వార్థరహితంగా జీవించాలి. నాలో స్వార్థమున్నంత కాలం నేను పూర్తిగా మనిషిని కాదు (Sub human) కేవలం మానవ ఆకారాన్ని (Humanoid) మాత్రమే.

**ని :** అంటే మనమెల్లరమూ సంపూర్ణ మానవులం కాదు. దాదాపు అందరమూ సబ్ హ్యూమనే అనచ్చు. మనలో కొందరే మానవులు. కొందరైనా ఎందరైనా మనల్ని మానవులుగా రూపొందించేది మన స్పష్టమైన చూపు, కనికరంతో నిండిన మన హృదయం. సబ్ హ్యూమన్ (అర్థ మానవులు) తామసిక రాజసిక గుణ ప్రధానులు, పూర్తి మానవులు సత్త్వగుణ ప్రధానులు, స్పష్టమైన చూపు, దయగల హృదయం, ఈ రెండూ మనిషి మనసునీ, మనిషి చేసే కర్మనీ సత్త్వ గుణంతో ప్రభావితం చేస్తుంటై. కానీ వాస్తవమైనటువంటిది, ఈ సత్త్వానికి కూడా ఆవలనున్నది. లాభ నష్టాలను గురించిన ఆలోచన వదిలేసిన వాడికి, మనసులో ఏ సంఘర్షణా ఉండదు కాబట్టి, అతడే అహింసావ్రతుడు.

**పృ :** నిజమే అహింస అనే అయిడియా నన్ను మొదట్నించీ ఎంతగానో ఆకర్షిస్తూ వచ్చింది.

**ని :** అహింస అనే పదానికి ప్రధానమైన అర్థం 'బాధించకు, హాని చేయకు' అని. దీనిలో ఇంకొకరికి మేలొనరించుట, మంచి చేయుట అనేది మొదటి స్థానంలో ఉండజాలదు అహింస అంటే ఓం ప్రథమంగా ఎవరినీ బాధించకుండా ఉండడం, ఇతరుల కష్టానికి మరింత కష్టం జతపరచకుండా బ్రతకడం. ఇతరులను సంతోషపెట్టజూడడం అహింస కిందికి రాదు.

**పృ :** ఇతరులను సంతోషపెట్టడం గురించి కాదు నే మాట్లాడుతున్నది; ఇతరులకు సహాయం చేయడమనేది మాత్రం నాకు పరమ కర్తవ్యంగా కనిపిస్తున్నది.

**ని :** మరోమారు సహాయంకోరే పరిస్థితి నుండి మనిషిని విముక్తి చెందించడానికై చేసే సహాయమే నిజమైన సహాయం. మళ్ళీ మళ్ళీ చేసే సహాయం, సహాయమే కాదు. సహాయమవసరం లేని స్థితికి మనిషిని తీసుకు వెళ్ళగలిగితే తప్పితే, మరొకరికి సహాయం చేయడం గురించి మాట్లాడకు.

**పృ :** సహాయ మవసరంలేని స్థితికి మనిషి ఎలా చేరగలడు? అలాంటి సహాయం ఒకరు మరికరికి చేయగలిగి ఉన్నారంటారా?

**ని :** ఈ సమస్తం నుండి వేరైపోయి పరిమితమైన బ్రతుకు బ్రతకడమనేది బాధాకరం అని నీకు తెలిసి వచ్చినప్పుడు, మొత్తం ఉనికితో ఒకటై, కేవలం స్వచ్ఛమైన సత్తగా జీవించాలని అనుకోడమూ, అలా జీవించ నారంభించడమూ రెండూ ఏక కాలమందు సంభవిస్తే అలాంటి పరిస్థితిలో నువ్వు సహాయానికి అతీతుడవు. నీ ధర్మ నియమమూ, నీ ప్రవర్తనా సరళిని చూచి మరొకరు నేర్చుకోవాలనుకోడం ద్వారా నీవు ఇంకొకరికి సహాయ పడగలవు. వీటికన్నా ప్రధానంగా నీ ఉనికి, నీ సత్త ద్వారానే అధికంగా తోటి మనుషులకు ఉపయోపడగలవు.

నీ వద్ద లేనిది నువ్వు మరొకనికి ఇవ్వగలిగి లేవు. నీవు కానిది నీ వద్ద ఎలాగూ ఉండదు.

**పృ :** ఈ ఉనికి యావత్తూ బాధాకరమేనంటారా?

**ని :** కాకపోతే, ఈ మొత్తం విశ్వంలో ప్రతి జీవీ సుఖం కోసం పడే ఈ తాపత్రయం ఏమిటి? ఆనందంలో ఉన్నవాడు ఆనందం కొఱకై వెతుకులాడతాడా? మనుషుల ఆరాటం చూడు. బాధపడుతున్నారు కాబట్టే సుఖంలో కొంత రిలీఫ్ దొరుకుతుందేమోనని వెతుకు

తుంటారు. ఈ సుఖం మళ్ళీ మళ్ళీ ఖాయంగా దక్కుతుందనే హామీ ఉంటే చాలు; సుఖాన్ని గురించి ఊహించగలిగిన మేరలో, ఆ హామీయే వారికి అత్యంత సుఖదాయకం.

**పృ :** కట్ట కడపటి స్థితిలో సౌఖ్యముండే అవకాశం లేదు.

**ని :** దుఃఖమూ ఉండదు. స్వేచ్ఛ మాత్రమే ఉంటుంది. సౌఖ్యమనేది ఏదో ఒక దానిపై ఆధారపడి ఉంటుంది. సమస్తమైన వాటి నుండి స్వేచ్ఛ అనేది, దేని మీదా ఆధారపడి ఉండదు కాబట్టి, అది పోగొట్టుకునే ప్రశ్న ఉదయించదు. దుఃఖ విముక్తి లేక స్వేచ్ఛ అనే దానికి కారణంలేదు కాబట్టి అది నాశం కాజాలదు. ఆ స్వేచ్ఛను కనుగొను.

## చైతన్య ప్రాధాన్యం

దైవత్వానికి ఈ మానవ చైతన్యం విత్తనంలాంటిది. దీని నిజ ప్రాధాన్యాన్ని గుర్తించి, దీనిని ప్రార్థించినట్లయితే, అప్పుడది దైవత్వంగా పుష్పిస్తుంది. దీనికి మనమెట్టి ప్రాధాన్య మివ్వని పక్షంలో అది దైవత్వంగా పరిణమించదు.

# కర్మ, దేవుడు, ఫ్రీవిల్

కర్మ అంటే శరీరావయవాలతో చేసే పనినే కర్మ అనుకుంటూ ఉంటాం. కానీ అసలైన కర్మ (Action) పరిశుద్ధమైన మనస్సు యొక్క అంతరాళాల్లో నుండి జనిస్తుంది. అవగాహన అత్యంత ముఖ్యమైన కర్మ సుమా ! అని జిడ్డు కృష్ణమూర్తి గారు హెచ్చరిస్తూ ఉండేవారు. కర్మను ఈ సంభాషణలో నిసర్గదత్త మహరాజ్ ఎలా నిర్వచించాడో చూడండి.

బాహ్యంగా ఒక దేవుడున్నాడని ఈ జగత్తులో జరిగే సమస్తమైన కృత్యాలకు, అకృత్యాలకు కూడా అతడిదే బాధ్యత అయి ఉంటుందనీ, తనకేమీ సంబంధం లేనట్లు బాధ్యతారహితంగ చరించడం సగటు మానవుడి లక్షణం. ఈ విషయంలో విముక్త మానవుడి కర్తవ్యమేమిటో నిసర్గదత్తుడు చెప్పిన మాటలు గమనించండి.

మనం అనుకున్నట్లల్లా మనం చేయగలిగి ఉన్నామనీ, మన కో 'ఫ్రీవిల్' ఉందనీ సగర్వంగా చాటుకుంటూ ఉంటాం. కానీ ఈ ఫ్రీవిల్ అనేది ఎంతటి మిథ్యో, మన మందరం విధి చేతిలో ఎటువంటి కీలుబొమ్మలమో, విముక్త స్థితి నొందకపోతే ఎటువంటి బానిస బ్రతుకు కొనసాగించవలసి ఉంటుందో నిసర్గదత్తుడు వివరించిన తీరు చూడండి.

**పృచ్ఛకుడు :** ప్రేమ, ఎఱుక ఈ రెండూ ఒకటేనా?

**నిసర్గదత్త :** ఒకటే, అయితే ఎఱుక క్రియాశక్తిగా (Dynamic) ప్రవర్తిల్లుతుంది. ప్రేమ సత్తగా (Being) ఉండిపోతుంది. ప్రేమ క్రియాశక్తిగా పనిచేస్తున్నప్పుడు ఎరుక అనిపించుకుంటుంది. మనసు స్వయంగా తనకు తోచినన్ని సాధ్యమైనన్ని పథకాలను తలపెట్టి, రూపొందిస్తూ ఉంటుంది. కానీ ఆ పథకాలు ప్రేమలో నుండి జనించకపోతే, వ్యర్థమైనవే అవుతాయి. సృష్టి జరిగేముందు ప్రేమ ఉండాలి. అది లేనిది అంతా చిందర వందరే.

**పృ :** ఎరుకలో క్రియాత్మకమైన చర్య లేక కర్మ ఎక్కడుంది?

**ని :** బాహ్యంగా ఆచరించే కర్మలు కంటికి కనుపిస్తే తప్పితే నువ్వు ఊరకుండలేవు సుమా ! అవిశ్రాంతంగా చేసేపని, కదలిక, చలనం, సంక్షోభం మొదలైనవన్నీ ఉన్నటువంటి వాటినే క్రియాత్మకమైన కర్మ అని నీ అభిప్రాయం లాగుంది. కానీ కేవలం కదలిక

కోసమే కదులుతూ ఉంటమనేది ఓ అధ్వాన్నమైన స్థితి. నిజమైన కర్మ దేనినీ పెకలించి వేయదు; ఉన్న స్వరూపాన్ని మారుస్తుంది. ఒక చోటి నుండి మరొక చోటికి చేరుతూ ఉండడం కేవలం రవాణా అనిపించుకుంటుంది. హృదయం పరివర్తనం చెందినప్పుడే అది కర్మ (Action) అనగలం. ఒకటి గుర్తుంచుకో. చర్మ చక్షువుకు కనిపించేదేదీ కూడా వాస్తవం కాదు. అనేక రకాల పనులు సతతమూ చేస్తూ ఉండడం (Activity) కర్మాచరణ కానేకాదు. నిజమైన కర్మ నిగూఢంగా ఉంటుంది. అది తెలియనిది, తెలియరానిది. నువ్వు చూచేదల్లా కర్మఫలం మాత్రమే.

**పృ :** కర్మలన్నీ ఆ భగవంతుడి చర్యలే కదా?

**ని :** ఎవరో ఇవన్నీ చేయిస్తున్నారని ఒక బాహ్యశక్తిని ప్రవేశపెట్టావెందుకు? ఈ ప్రపంచం ఎల్లప్పుడూ తనలో నుండే తనని సృష్టించుకుంటూ ఉంటుంది. ఈ అశాశ్వతమైనది మరో అశాశ్వతమైన దానినికంటూ ఉండడమనే ఈ ఉత్పత్తి క్రమానికి అంతు అనేది లేదు. దీనికంతటికీ ఎవరో కర్మాధికారి ఉన్నాడని అనుకోడం నీ అహం చేస్తున్నపని. నీ రూపం ఎంత భయంకరం, ఎంత దుఃఖకరమైనప్పటికీ; ఈ రూపంలోనే నీవొక భగవంతుణ్ణి సృష్టించుకుంటావ్.

నీ మనస్సనే ఫోటోగ్రాఫిక్ ఫిల్మ్ ద్వారా ఒక లోకాన్ని ముందుకు విసిరి, దానికి ఒక కారణం, ఒక ఉద్దేశం ఉండగలందులకుగాను, ఒక దేవుణ్ణి కూడా తయారు చేసుకుంటావ్. ఇదంతా నీ భ్రమ నుండి జనించిన లోకం. దీని నుండి వెలుపలికి నడిచిరా.

**పృ :** ఈ ప్రపంచం కేవలం మన మనో నిర్మాణంగా చూడగలగడం ఎంత కష్టమో ! స్పర్శనీయమైన ఈ లోక వాస్తవం ఎంతో నమ్మదగినట్లు కనిపిస్తుంది.

ని : అదే మన భ్రమ యొక్క నిగూడ రహస్యం. ఎంతో వాస్తవంగా కనిపించడంలోనే ఉన్నది దీని మర్మమంతా.

నీవు బ్రహ్మచారివవచ్చు, వివాహితుడివి కావచ్చు, సన్యాసివవచ్చు, గృహస్థువవచ్చు. ఇవేవీ ముఖ్యం కాదు. భ్రమ జనితమైన విక్షేప శక్తికి (Imagination). నువ్వు బానిసవా, కాదా అనేదే అసలు ప్రశ్న. నువ్వు ఏ నిర్ణయాలు చేస్తున్నా, నీవు ఏ పనిచేసినా, అది తప్పని సరిగా ఈ విక్షేపశక్తి మీదనే ఆధారపడి ఉంటుంది. నువ్వు అనుకునేదల్లా వాస్తవాలుగా నీ ముందు నడిచివెళ్తున్నట్లు కనిపించడం కూడా దీని మీదనే ఆధారపడి ఉంది.

**పృ :** ఇప్పుడు ఇక్కడ మీ ముందు కూచోనున్నాను. ఇందులో భ్రమ భాగమెంత అంటారు?

**ని :** మొత్తమూ భ్రాంతి జనితమే. ఆఖరికి దేశకాలాలు (Space and Time) కూడా భ్రాంతితో కూడుకున్నవే.

**పృ :** అంటే నేనసలు లేనంటారా?

**ని :** నువ్వే కాదు. నేనూ లేను. అసలు ఇక్కడి ఈ బ్రతుకే (Existence) భ్రాంతితో కూడుకున్నది.

**పృ :** సత్త (Being) కూడా భ్రమేనా?

**ని :** అన్నిటి నిండా ఉంటూ అన్నిటికీ అతీతంగా ఉండే స్వచ్ఛమైన సత్త ఈ పరిమితమైన ఉనికి కాదు. పరిమితమైన దెల్లా భ్రాంతి జనితమే. అపరిమితమైనదే సత్యం.

**పృ :** మీరు నన్ను చూచినప్పుడు  మీకేం కనిపిస్తున్నది?

**ని :** నిన్ను గురించి నువు భ్రమ చెందుతున్నట్లు కనిపిస్తుంటుంది.

**పృ :** నాలాంటి వాళ్ళు ఎందరో ఉన్నారు. అయినప్పటికీ ఎవరికి వారు వేర్వేరు మనుష్యులు కదా?

**ని :** ఈ రకంగా భ్రాంతికి గురయిన సమస్తమైన ఆకారాల సముదాయాన్నే మహా మాయ అంటారు.

**పృ :** అయితే మిమ్మల్ని మీరు చూచుకునేప్పుడు మీకేమి కనిపిస్తుంది?

**ని :** నా వంక నేనెలా చూచుకుంటాను అనే దానిపై ఆధారపడి ఉంటుంది. మనసు ద్వారా చూశానంటే అనేకమంది మనుష్యులు కనిపిస్తారు. మనసుకావల నుండి చూచినప్పుడు నాకు సాక్షి కనిపిస్తుంది. సాక్షికవతల శూన్య నిశ్శబ్దంతో కూడుకున్న అపారమైన తీవ్రత (Infinite Intensity) ఉన్నది.

**పృ :** మనుష్యులతో ఎలా వ్యవహరించాలంటారు?

**ని :** ఇందు గురించి ముందే పథకాలు తయారు చేయాల్సిన పనేముంది? ప్రయోజనం మాత్రం ఏముంటుంది? ఇలాంటి ప్రశ్నలు మనిషి పడే ఆదుర్దాను సూచిస్తయి, మానవ సంబంధం అనేది సజీవమైనది. నీ అంతరాత్మలో శాంతి సామరస్యాలు కలిగుండు; బాహ్యంగా అందరితోనూ అవే శాంతి సామరస్యాలు కొనసాగుతై. జరుగుతున్న దానికంతటికీ నువ్వు సర్వాధికారివి కావని తెలుసుకో. అచ్చం సాంకేతికపరమైన విషయాల్లో తప్పితే భవిష్యత్తును నువ్వు అనుకున్నట్లు తీర్చిదిద్దలేవన్న సంగతి గుర్తుంచుకో. మానవ

సంబంధాలను ఓ పథకాన్ననుసరించి నడవడం సాధ్యం కానిపని; ఆ సంబంధాలు ఎంతో వైవిధ్యంతో కూడుకున్నవి. ఎంతో సుసంపన్నమైనవి. మనుష్యుల్ని అర్థం చేసుకో. స్వార్థం నుండి విడివడి అందరి యెడలా దయగా ఉండు.

**పృ :** నిజమే ఈ జరుగుతున్న దానికి నేను సర్వాధికారిని కానని నాకు తెలుసు. అంతేకాక ఈ జరిగేదానికి నేను బానిసను అనిపిస్తుంటుంది.

**ని :** సర్వాధికారివీ అవక్కరలేదు, బానిసవీ కానక్కరలేదు. అడుగు అవతలకు వేసి నిలబడు.

**పృ :** ఈ మాటలకర్థం, ఇప్పుడు నే చేసే కర్మ యావత్తూ విసర్జించాలనా?

**ని :** చేసే కర్మను మానలేవు. మిగతా అన్నిటిలాగానే అది కూడా జరిగి తీరుతుంది.

**పృ :** నేను ఆచరించే కర్మను నేను అదుపులో పెట్టుకోలేకపోవడమేమిటి?

**ని :** ప్రయత్నించి చూడు. అనతికాంలోనే నీకేది విధాయకమో అది చేయనే చేస్తావు.

**పృ :** నా చిత్తాన్ననుసరించి నేను చేయగలిగి ఉన్నాను కదా?

**ని :** నువ్వు చేసిన తర్వాతనే నీ చిత్త మేమిటో నీకు తెలుస్తుంది.

**పృ :** నా కోరికలేమిటో నాకు తెలుసు. ఆ విషయంలో నేను ఏవి ఎంచుకున్నానో నాకు తెలుసు. అటుపైని వాటిని గురించి నేనేమి నిర్ణయాలు చేసుకున్నానో, వీటన్నిటినీ బట్టి నే చేయదలచుకున్నది చేస్తాను.

**ని :** అలా అయినప్పటికీ నీ స్మృతి ఈ నిర్ణయాలు చేస్తున్నది కానీ, నువ్వు కావు.

**పృ :** మరి ఇందులో నాపాత్రేమిటంటారు?

**ని :** ఆ పనియెడల ధ్యానమగ్నుడవైనందువల్ల అది జరగడానికి అవకాశం కల్పిస్తున్నావు.

**పృ :** అయితే నాకు ఫ్రీవిల్ (free will) అనేదే లేదంటారా? నేను కోరుకోదలచుకున్న దానికి కూడా నాకు స్వేచ్ఛ లేదంటారా?

**ని :** అలా కాదు. నువ్వు కోరుకోడమనేది బలవంతాన జరుగుతున్నది. హిందూ మతంలో అసలు ఈ ఫ్రీవిల్ అనేదే లేదు. అందుకు తగిన పదమే లేదు. విల్ అనేది ఒక దాని అధీనంలో ఉండడం. ఒక దానిలో నాటుకోడం, దానికి దాస్యం చేస్తూ ఉండడమనచ్చు.

**పృ :** నా పరిమితులు ఏవైై ఉండాలో వాటిని నేను స్వేచ్ఛగా ఎంపిక చేసుకోగలిగే ఉన్నాను.

**ని :** నువ్వు ముందు స్వేచ్ఛను, విముక్తిని పొందు. ప్రపంచంలో స్వేచ్ఛగా బ్రతకాలంటే ప్రపంచం నుండి ముందు విముక్తి చెందాలి. అలా కాని పక్షంలో నీ గతమే నిన్నూ, నీ భవిష్యత్తునూ రూపొందిస్తూ ఉంటుంది. జరిగిపోయిన దానికి, తప్పనిసరిగా జరగబోయే దానికి మధ్య నువ్వు చిక్కుకొని ఉన్నావు. విధి అను, కర్మ అను, అది ఏదైనా కానీ, దానిని స్వేచ్ఛ అని మాత్రం అనవద్దు. ఓం ప్రథమంగా నీ అసలు సత్త వద్దకు మళ్ళీ చేరు. ఇక అప్పుడు ఆ ప్రేమైక హృదయం నుండి పని ప్రారంభించు.

**పృ :** ఈ వ్యక్తమైన లోకంలో అవ్యక్త నిర్విశేషమైన దాని యొక్క ముద్రలేమిటి?

**ని :** ఏమీలేవు. ఆ మాటకొస్తే, ముద్రకై వెతికిన మరుక్షణాన ఈ వ్యక్తమైనదంతా కరిగిపోతుంది. అగ్నిని గనక కర్రపుల్లతో కదిపితే కర్ర కాలిపోయినట్లే అవ్యక్తమైన దానిని ఈ మనసుతో అర్థంచేసుకోడానికి ప్రయత్నిస్తే వెన్వెంటనే మనసు దగ్ధమై ఆవలికి వెళ్ళి పోతావు. వ్యక్తమైన దానిని తఱచి చూడడానికి మనసును ఉపయోగించు. గుడ్డులోని కోడిపిల్ల తన వెలుపలి పెంకును పొడిచినట్లే, వ్యక్తమైన దానిని పొడవడం నేర్చుకో. గుడ్డు వెలుపలి జీవితం ఎలా ఉంటుందోనని ఊహలల్లుతూ కూచుంటే లోపలున్న కోడిపిల్లకు ఒరిగేదేమీ ఉండదు. అలా కాకుండా గుడ్డు లోపలి నుండి పెంకును పొడుస్తూ ఉండడం మూలాన, లోపలి నుండే పెంకు బ్రద్దలై కోడిపిల్ల విడుదలవుతుంది. అదేవిధంగా మనసును తఱచడం ద్వారా దాని వైరుధ్యాలను ఎండగట్టి దానిని బ్రద్ధలు చేయడం నేర్చుకో.

**పృ :** ఈ పై పెంకును బ్రద్ధలు కొట్టాలనే ఈ గాఢమైన వాంఛ ఎక్కడి నుండి వస్తుంది?

**ని :** ఆ అవ్యక్త నిర్విశేషమైన దాని నుండి.

# శ్రద్ధగల జీవితం

మనిషికి భయం సహజ లక్షణం; అవసరం కూడాను. అయితే మనిషి, భయం వీడితేగానీ, సత్యాన్ని దర్శించలేడు, అంటారు. కాబట్టి ఏ భయం సహజం, ఏ భయం అసహజమే కాక అనవసరం, వర్జనీయం అనేది తెలుసుకోవాలి.

మనిషికి ప్రాణ భయం సహజం. మాటవరసకు, సరకుతో నిండిన ఓ పెద్ద లారీ రోడ్డున మన మీదికి దూసుకొస్తూ ఉంటే ప్రాణభయం కొద్దీ రోడ్డు పక్కకు దూకెయ్యడం సహజమైన భయం; ఉండతగిందే. అదే గనుక లేకపోతే ప్రాణం పోతుంది. తెర శాశ్వతంగా దిగుతుంది.

రెండోరకమైన భయం ఎటువంటిదంటే, సరకులతో నింపిన ఓ లారీ మన మీదికి వచ్చిపడుతుందేమోనంటూ ఎప్పుడూ ఒకరకమైన చింతతోనూ, వ్యాకులంతోనూ ఉంటూ ఉండటం. ఈ రకమైన భయమూ, ఆందోళనా అసహజమైనవి.

మొదటి భయమూ, రెండో భయమూ ఒకేరకంగా కనిపించినప్పటికీ, రెండూ వేర్వేరు అని స్పష్టంగా తెలియాలి. సహజ భయం వర్తమానంలో ఇప్పటికిప్పుడు ఎదురుగా కనిపిస్తున్నటువంటిది. అసహజమైన రెండవరకం భయం, పూర్వానుభవ కారణంచే ప్రారంభమై, భవిష్యత్తులోకి తొంగిచూచే లక్షణంవల్ల జనిస్తున్నది. గతానుభవం ఇప్పుడు ప్రత్యక్షమవుతున్నట్లే, ఒక భావం బలీయంగా కలిగినందువల్ల భయం అలము కుంటున్నది.

సహజమైన, నిజమైన భయం సకారణంగా కలిగినప్పుడు దానిని ఎదుర్కొనే ధైర్యమూ, తెలివీ మనసుకు, శరీరానికి అప్పటికప్పుడు ఏదోవిధంగా సిద్ధిస్తాయి. ఆలోచనల వల్ల కలిగే భయాలు మనిషిని వ్యాకులపరచి కుంగదీస్తూంటాయి. అలాంటి కృత్రిమమైన భయాలకు పరిష్కారం ఎవరికి వారే స్వయంగా కనుక్కోవాలి.

పాశ్చాత్య గ్రంథకర్తలు, వేదాంతులు కొందరు, మనిషి మౌలికమైన చింతతో పుడతాడనీ, పుట్టుకతో వచ్చిన ఈ ఆందోళన తొలగే మార్గం లేదనీ, పరిష్కారంలేని ఈ 'Angst' తో అలాగే జీవిస్తూంటాడనీ ఏవో సిద్ధాంతాలు చెప్తుంటారు. కానీ ఆలోచన మనిషిని బంధించినంతకాలం ఈ మౌలిక ఆందోళన ఉండక తప్పదు. దీని నుండి విముక్తి సాధించినప్పుడే సత్యాన్వేషణకు శ్రీకారం చుట్టే వీలుకలుగుతుంది.

మనిషికి మనఃపూర్వకమైన శ్రద్ధ గనుక ఉంటే, జీవితం నుండి మనిషి ఎంతైనా నేర్చుకోవచ్చు. శ్రద్ధ యొక్క ప్రాధాన్యాన్ని గురించి, ఆవశ్యకతను గూర్చి, నిసర్గదత్త మహరాజ్ చెప్పిన విషయాలు గ్రహించండి.

**నిసర్గదత్త :** అత్యంత శ్రద్ధగనక ఉంటే, నీవు ఏ విధానాన్ని ఎన్నుకున్నా అది నిన్ను లక్ష్యానికి చేరుస్తుంది. అన్నిటికన్నా ముఖ్యమైనది, ఈ విషయాన్ని అటో ఇటో తేల్చేసేది, ఈ శ్రద్ధేననవచ్చు.

**పృచ్ఛకుడు :** శ్రద్ధకు మూలమేమిటి?

**ని :** పక్షి తన గూటికి చేరాలని ఎందుకు వేగిరపడుతుందో, చేప ఏ కొండల మధ్య సెలయేరులో తాను జన్మించిందో మళ్ళీ అక్కడికే వెళ్ళాలని ఎందుకు తహతహ లాడుతుందో, అలాగే మనిషి తన మూలస్థానానికి వెళ్ళాలనే ఈ స్వభావ సిద్ధమైన గుణమే ఈ 'homing instinct' (గృహోన్ముఖతా' సహజాతం) అనేదే దీనికి మూలం. చెట్టుమీది కాయ పూర్తిగా పండిన తర్వాత, విత్తనం మళ్ళీ నేలకే చేరుతుంది. ఉన్నదంతా కాయ వండడంలో ఉన్నది.

**పృ :** మరి నేను వండడమెలా? మరింత అనుభవం ఉండాలంటారా?

**ని :** అవసరమైనంత అనుభవం నీకిప్పటికే ఉన్నది; లేకపోతే నువ్విక్కడికి వచ్చి ఉంటేవాడివే కాదు. మరింత అనుభవం సంతరించుకోవలసిన అవసరం లేదు. నిజానికి నువ్విప్పుడు నీ అనుభవం ఆవలికి వెళ్ళాల్సి ఉన్నది. నువ్వేవిధమైన ప్రయత్నం చేసినా, అవన్నీ మరింత అనుభవాన్ని సమకూర్చగలవే కానీ, నిన్ను ఆవలికి తీసుకువెళ్ళగలిగి ఉండవు.

పుస్తకాలు చదివీ ప్రయోజనం లేదు. అవి నీ మనసును సంపన్నం చేయగలవే కానీ, నువ్విప్పుడు ఏ రకమైన వ్యక్తిత్వం కలిగి ఉన్నావో, దానిని స్పృశించి వీసమెత్తయినా మార్చగలిగిన శక్తి కలిగున్నవి కాదు. భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక అన్వేషణ నుండి ఏవో సత్ఫలితాలు సిద్ధిస్తాయి అని నువ్వు ఆశిస్తున్నావు; కానీ ఇదే సమయంలో అసలు విషయం నుండి దూరమవుతున్నావు అని గ్రహించు.

సత్యం నీకెలాంటి ప్రయోజనమూ సాధించిపెట్టదనే విషయం గుర్తుంచుకో. అది నీకేవిధమైన ఔన్నత్యాన్నీ కలగజేయదు. ఎవరూ నీ అధీనంలో ఉండడం జరగదు; నీకు లభించేదల్లా కేవలం సత్యమూ, అసత్యం నుండి విముక్తి మాత్రమే.

**పృ :** నేను సత్యాన్ని కనుగొన్నానని నాకెప్పుడు తెలుస్తుంది?

**ని :** 'ఇది నిజం, అది నిజం' అనే భావం ఉదయించడం మానేసినప్పుడు. నిజమనేది తనని తాను స్థిరంగా ప్రకటించుకోవడం జరగదు. అసత్యమైన దానిన చూచినప్పుడు, ఇది అసత్యమని దానిని నిరాకరించడంలోనే సత్యమున్నది. అసత్యమైన దానిని చూడలేని అంధత్వంలో మనసు ఉన్నంతకాలం, సత్యమనే దానికై వెతుకులాడడం నిరర్థకం. అసత్యంతో నిండిన మనసుని సంపూర్తిగా పరిశుద్ధం చేస్తే గానీ సత్యం అక్కడ ఉదయించదు.

నీకు వాస్తవమే కావాలనుకుంటే, అన్ని రకాల పూర్వరంగాల నుండి నీవు విడివడాలి. అన్ని రకాల సంస్కృతుల నుండి విముక్తి చెందాలి. అన్ని ఆలోచనలు, అనుభూతుల నుండి చెఅవీడాలి. నేను పురుషుణ్ణి, స్త్రీని అనిగానీ, ఆఖరికి నేను మనిషిననే భావాన్ని గానీ, ఏదీ కలిగి ఉండకూడదు. ఈ జీవిత మహాసాగరంలో ఉండేది ఒక్క మనుషులే కాదు, మరెన్నో రకాల జీవరాసులున్నాయి. కాబట్టి నేను ఇదనీ, అదనీ, నేను ఫలానా వ్యక్తిని ఇంతటివాణ్ణి, అంతటివాణ్ణి, ఈ జాతికి చెందినవాణ్ణి. మానవుణ్ణి, మొదలైనవన్నీ గుర్తు తెచ్చుకోవడం సంపూర్తిగా వదిలెయ్.

నిన్ను గురించిన చింత మొత్తం వదిలిపెట్టు. నీ ప్రేయస్సును గురించి కానీ, నీ శ్రేయస్సును గురించి కానీ ఆలోచిస్తూ కూర్చోవద్దు. స్థూలమైన వాంఛలు కానీ, సూక్ష్మమైనవి కానీ అన్నిరకాల వాంఛలూ వదిలి పెట్టు. ఏదీ సాధించాలని అనుకోవద్దు. ఉన్నపళంగా ఇప్పుడూ ఇక్కడే నువ్వు పరిపూర్ణుడివి; నీకు అవసరమైనదంటూ ఏమీలేదు.

ఈ మాటలన్నిటి అర్థం నువ్వు తెలివి తక్కువగానూ, వెర్రి సాహసంతోనూ, అజాగ్రత్తగానూ, ముందు యోచన లేకుండానూ, ఉదాసీనంగానూ బతకమని కాదు; మనిషి తనని గురించి తాను అనుభవించే మౌలికమైన ఆదుర్దా లేకుండా పోవాలని మాత్రమే నే చెప్తున్నది.

నీకూ నీ వారికీ కాస్త తిండీ, బట్టా, వసతీ కావాలనే మాట నిజమే. కానీ ఇలాంటి అవసరాల విషయంలో పేరాశ లేకుండా గనుక బతికితే, ఈ కాసిని అవసరాలు అంత పెద్ద సమస్యగా పరిణమిస్తవని నేననుకోను. నీవు ఊహించిన విధంగా పరిస్థితులు ఉండాలి అనుకునే బదులు, ఉన్నది ఉన్నట్లుగా చూచి ఆ పరిస్థితులకు అనుగుణంగా జీవించడం నేర్చుకో. శ్రద్ధాళువై బతుకు; గమ్యం చేరుకుంటావ్.

# లోకంలో జ్ఞాని పాత్ర

**ఒ**కప్పుడు జ్ఞానిని అతడి చుట్టూ ఉన్న సమాజమూ, దేశ పాలకుడూ పోషించారంటే అందుకు కారణం, జ్ఞాని తన జీవితాన్ని సమాజానికి అర్పించడం మూలానేననవచ్చు. అట్టే ఖరీదు కాని గడ్డి తిని ఆవు మనిషికి, విలువైన పోషక పదార్థాలతో కూడిన తన పాలు ఇచ్చినట్లే, జ్ఞాని సమాజం నుండి కాస్త తిండి, బట్ట వసతి స్వీకరించి, మానవుడి దుఃఖ నివృత్తి చేయగలిగిన అతి విలువైన జ్ఞానాన్ని పంచుతాడు. ఈ సేవలో అతడు ఒక్కొక్క తఊి తన ఆరోగ్యాన్ని, ప్రాణాన్ని కూడా కోల్పోతుంటాడు.

యౌవన దశలో శ్రీ జిడ్డు కృష్ణమూర్తి రోజులో ఎక్కువ భాగం ప్రవచించడం, చర్చలు సాగించడం గమనించిన వైద్యులు 'నువ్విలాగే గనక కొనసాగిస్తే' అనారోగ్యానికి గురయి ప్రాణహాని కూడా తెచ్చిపెట్టుకుంటావ్' అని హెచ్చరించవలసి వచ్చింది. వారి సలహా ననుసరించి ఆయన రోజులో విశ్రాంతి సమయాన్ని కొంత పెంచుకున్నప్పటికీ, యూరోపియన్, అమెరికన్, లాటిన్ అమెరికన్ దేశాల పర్యటన విస్తృతంగా జరుపుతుండే వారు. ఆనాటి ఆయన పర్యటన కార్యక్రమాలు చూస్తే ఎక్కడెక్కడి దేశాలకో, మనకు తెలియని ఏయే ప్రాంతాలకో వెళ్ళి ప్రసంగిస్తుండేవాడనేది గమనించవచ్చు.

ఇలా ఊరు విడిచి ఊరు తిరుగుతుండడం, అక్కడి కొత్త వాతావరణానికి అలవాటు పడవలసి రావడం, ఎప్పటికప్పుడు కొత్త మనుష్యుల్ని కలుస్తూ ఉండడం, ఇవన్నీ కూడా ఆయన ఆరోగ్యాన్ని భంగపరుస్తూ ఉండేవి. డెబ్భై అయిదేళ్ళు దాటిన అనంతరం ఈ పర్యటనలు, ప్రసంగాలు తగ్గించుకున్నప్పటికీ, వయసుకు మించిన భారం మోస్తూనే గడిపాడు; తఱచూ చాలా అలసిపోతూండేవాడు.

ఆయన ప్రసంగాలు మౌఖికమే అయినా, అవి ఆలోచించే మెదడు నుండి కాక, హృదయ కుహరంలో నుండి పుట్టుకొచ్చినవి కాబట్టి, ఆయన తన శక్తిని చాలా ధారపోయాల్సి వచ్చేది. అందుకే ఒక గంట ప్రసంగించిన అనంతరం "నేను మాట్లాడడం ప్రారంభించి గంట గడిచినట్లుంది ఇవాల్టికి చాలనుకుంటాను. ఈ ప్రాసంగికుడు ఈ గంట బట్టీ మాట్లాడడంలో పడిన శ్రమ, నేర్చుకోవడంలో మీరూ గనక చేసి ఉంటే, ఎంతగానో అలసి ఉంటారండీ" అని ముగించేవాడు.

ఆ విధంగా జీవించినన్నాళ్ళు, తనని తాను మానవాళికి అర్పించుకున్నాడు శ్రీ జిడ్డు కృష్ణమూర్తి.

అరుణాచల రమణుడు అనారోగ్యంతో, ముఖ్యంగా చివరి దశలో తీవ్ర వ్యాధితో, ఎంత బాధ ననుభవించాడో అందరికీ తెలుసు. ఆ స్థితిలో ఆయనకు విశ్రాంతి ఎంతో అవసరమని తెలిసి ఉండి కూడా ఆయనను నిద్రపోనివ్వకుండా, విశ్రాంతి పొందన్వికుండా, తమ లబ్ధి తాము చూచుకుంటూ, భక్తులైన వారూ కాని వారూ కూడా ఆయన దర్శనార్థం, గది వెలుపల 'క్యూ'లలో నిలబడేవారు. ఆంతరంగిక శిష్యులు తలుపులు మూస్తామన్నా, "కాదు, తెరిచే పెట్టండి. దర్శనం వల్లవారికి మేలు జరుగుతుందని వారు అనుకుంటే, వారిని అడ్డుకోకండి" అని ఆ అవస్థంతా సహించాడు ఆ మహాపురుషుడు.

అంతకుముందు కాలంలో ఆరోగ్యం ఒక మాదిరిగా బాగున్నప్పుడు కూడా భక్తులు గిరి ప్రదక్షిణ చేయడానికి రండని స్వామిని ఆహ్వానిస్తే శ్రీరమణుడు ఆ రోజున అప్పటికే ఒకటి రెండుసార్లు ఇతర భక్త బృందాలతో ప్రదక్షిణ చేసి సంపూర్తిగా అలసిపోయినప్పటికీ, వీరి మాటను తీసెయ్యలేక, మళ్ళీ బయలుదేరేవాడు. స్వామి మోకాళ్ళు ఎంత నొప్పికి గురవుతుంటాయో ఎరిగిన అంతేవాసులు ఆయన్ని వారిద్దామని ప్రయత్నించినా కను సైగతో, అసలు విషయాన్ని బయటపెట్టవద్దని వారిని హెచ్చరించి, కొత్తగా వచ్చిన భక్త బృందం యొక్క కోరిక కూడా తీర్చేవాడు. అరుణగిరిని ఆశ్రయించుకొని జీవిత కాలమంతా మరెక్కడికీ వెళ్ళక, అక్కడే ఉండిపోయినప్పటికీ, అతడు చేసిన శారీరక శ్రమా, పడిన బాధా అంతా ఇంతా కాదు.

జీవికకై దుకాణం నడుపుకున్న శ్రీ నిసర్గదత్త మహరాజ్, చివరి సంవత్సరాల్లో తన చిన్న ఇంట్లోని గది నుండి బయటికి కదిలేవాడు కాదు. కానీ పొద్దునా సాయంత్రం కూడా, ఎడతెఱపి లేకుండా జిజ్ఞాసువులూ, భక్తులూ దేశ విదేశాల నుండి వచ్చిపోతూనే ఉండేవారు; ప్రశ్నిస్తూనే ఉండేవారు, వారందరికీ ఆయన సమాధానాలు చెప్తూనే ఉండేవాడు.

ఆయనకొచ్చిన స్వరపేటిక వ్యాధికి, ఈ ఆగని వాగ్ధార కొంత కారణమయి ఉంటుందనడానికి సందేహం లేదు. అడిగేవారు కూడా ఏ ప్రశ్న పడితే ఆ ప్రశ్న అడగడానికి వెనుదీసే వారు కాదు; అమర్యాదగా ఈసడిస్తున్నట్లుగా ప్రశ్నించిన సందర్భాలు కూడా ఉన్నై. అంతా ఓర్చుకునేవాడు. అనారోగ్యం ద్వారా ఏర్పడిన బాధా, అజ్ఞాన అహంభావాలలో నుండి జనించిన తుంటరి ప్రశ్నల హింసా, అన్నిటినీ ప్రశాంతంగా భరిస్తూ సమాధానాలు చెప్పేవాడు; మనకీ అమృత ఝరి మిగిల్చిపోయాడు.

ఇక ఇప్పుడు, లోకంలో నిజమైన జ్ఞాని యొక్క పాత్ర ఏమిటో నిసర్గదత్త మహరాజ్ వివరించిన తీరు చదవండి.

**నిసర్గ :** జ్ఞాని అందరికీ చెందుతాడు. ఎవరు తన వద్ద కొచ్చినా వారందరికీ తననీ, తన సమస్తాన్నీ విసుగూ విరామం లేకుండా ఇచ్చేస్తూ ఉంటాడు. ఇచ్చే గుణం లేకపోతే అతడు జ్ఞానే కాదు. తన వద్ద ఏదైతే ఉందో అది పంచిపెడుతూనే ఉంటాడు.

**పృచ్ఛకుడు :** కానీ తానై ఉన్నదాన్ని, అతడు పంచగల దంటారా?

**ని :** అనగా, ఇతరులను అతను జ్ఞానులుగా రూపొందించగలడా అని నీ ప్రశ్న. అసాధ్యమనే నా సమాధానం జ్ఞానుల్ని తయారుచేయడం సాధ్యంకాని పని; మనుషులు తమ మూలస్థానానికి, తమ అసలు స్వభావం వద్దకు చేరినప్పుడు తమలోని జ్ఞానాన్ని యధార్థం చేసుకుంటారు. నువ్వీసరికే ఏదై ఉన్నావో, దానినిగానే మళ్ళీ నిన్ను ఎలా తయారు చేస్తాను? నే చేయగలిగినదల్లా, నేనే దోవన పయనించానో చెప్పి, నిన్నూ అలా చేయమని ఆహ్వానించగలనే కానీ, మరేమీ చేయజాలను.

**పృ :** మీరు పొందిన శిక్షణ యావత్తూ మాకు చెప్పడానికి సిద్ధంగా ఉన్నారు కానీ, దానివల్ల ఏ ఫలితాలు సిద్ధించాయో చెప్పమంటే మాత్రం చెప్పరు. మీ స్థితి మాటల కతీతమైనదని ఊరుకుంటారు. లేదా మీకూ మాకూ తేడా ఏమీలేదనైనా అంటారు; మాకు తేడా కనిపించినా, మీకే తేడా కనిపించదు. ఈ రెండు సందర్భాల్లోనూ మీ స్థితి ఏమిటో తెలుసుకునే ప్రావీణ్యత (insight) మాకు లేనట్లే అవుతున్నది.

**ని :** నీ స్థితిలోకి చూచుకునే ప్రావీణ్యంలేని నీకు నా స్థితిలోకి చూచే ప్రావీణ్యం రమ్మంటే ఎలా వస్తుంది? ఈ వీక్షించే ప్రావీణ్యాన్ని ప్రసాదించే పనిముట్టే నీ వద్ద లేపప్పుడు, ముందు దాని కోసం వెతుక్కోవద్దా? గుడ్డివాడు ముందు తన కంటి చూపు సంపాదంచుకోడానికై ప్రయత్నించాలి గానీ, అది లేకుండా తైలవర్ణ చిత్రాలు గీయడానికి ప్రయత్నిస్తే ఏమి ప్రయోజనం? నీకు నా స్థితి తెలుసుకోవాలని ఉంది. అదట్లా ఉంచి, నువ్వు నిత్యమూ చూచే నీ భార్య మానసిక స్థితి కానీ, నీ పనిమనిషి స్థితి కానీ నీకు తెలుసునంటావా?

**పృ :** ఏవో కొన్ని సూచనలైనా ఇమ్మని నా ప్రార్థన.

**ని :** చెప్పాను గదా. కనుక్కునేందుకు ఉపకరించే ఓ ముఖ్యమైన జాడ చూచాయగా చెప్పనే చెప్పాను. నీకు భేదాలు కనిపించే చోటల్లా నాకు భేదాలు కనిపించవని చెప్పాను. నాకది చాలు. అది చాలదని నువ్వంటావనుకో. – నే చేయగల్గినదల్లా ఆ మాటనే

పునరుద్ధాటించి 'అది చాలు' అంటాను. దానిని గురించి బాగా లోతుగా ఆలోచించు – అప్పుడు నే చూచేదే నువ్వూ చూస్తావు.

అంతర్ దృష్టిలో నీకు తక్షణ ప్రావీణ్యం లభించాలనే నీ కాంక్ష. కాని క్షణంలో అది లభించడానికి వెనుక చాలా సన్నాహం ఉన్నదన్న సంగతి మరచిపోతున్నావు. చెట్టుపై నుండి పండు అకస్మాత్తుగా నేలమీద పడే మాట నిజమే; కానీ అది పండడానికి చాలా కాలం పట్టి ఉంటుంది. ఇచ్చేవాళ్ళు చాలామందే ఉన్నారు; కానీ తీసుకునేవారెందరున్నారు?

**పృ :** మీకున్న సున్నితత్వం, నాజూకైన ఈ స్పృహ (Sensitivity) నైనా మాతో పంచుకోలేరా?

**ని :** సాధ్యమే. కానీ ఈ పంపిణీకి ఇరుపక్షాలు సిద్ధంగా ఉండాలి. నేనివ్వదలుచుకున్నది తీసుకోవడానికి అంగీకరించేవారేరి?

**పృ :** మన మందరం ఒకటేనని మీరంటుంటారు. ఇది చాలదా?

**ని :** నేను నీతో ఒకటే. కానీ నువ్వు నాతో ఒకటేనా? అయి ఉంటే, నువ్వు, నన్నీ ప్రశ్నలడగవు. అలా కానప్పుడు, నే చూచేది నువ్వు చూడలేని సందర్భంలో, నీ చూపును నిశితం చేసుకోడానికి మార్గం సూచించడం తప్ప, నేను మరేమి చేయగలను?

# అంతటా మేల్కొన్న మనిషి !

**శ్రీ** రామకృష్ణ పరమహంస ఒకమారు 'నా మాటల్లో ఏ ఒక్కటి అసత్యమైనా, నే చెప్పినదంతా అసత్యమే'నన్నాడు. శ్రీ జిడ్డు కృష్ణమూర్తి గారు తాను చెప్తున్న విషయాన్ని గురించి ప్రస్తావిస్తూ "ఈ ప్రాసంగికుడికి ప్రాధాన్యంలేదు. కానీ ఇతడు చెప్తున్నది మాత్రం చాలా ముఖ్యమైనది. జాగ్రత్తగా వినండి" అంటుండేవారు. సత్యానికి' సత్యవాక్కుకు ఉండే విలువేమిటో, శ్రీ నిసర్గదత్త మహరాజ్ మాటల్లో తెలియజేస్తాను.

ఓ పృచ్ఛకుడు ఆయన్ని "ఈ సంభాషణలన్నీ ప్రచురించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని వింటున్నాను. పాఠకుడిపై వీటి ప్రభావం ఎలా ఉంటుందంటారు?" అని అడిగినప్పుడు – "శ్రద్ధాసక్తులు, జిజ్ఞాస వున్నటువంటి పాఠకుడిలో ఇవి ఫలవంత మవుతాయి. సత్యంమీద ఆధారపడిన వాక్యాలను జాగ్రత్తగా పరిశీలించి ఎవరి జీవితంలో వారు ప్రయోగించి చూచుకుంటే, వాటికుండే శక్తి తెలుస్తుంది" అని ఎంతో వినయ పూర్వకంగా చెప్పారు. సత్యమెరిగిన వారెవరైనా వినయ సంపన్నులే.

**పృ :** ఆత్మదర్శనానికై మీరేరకమైన ప్రయత్నమూ చేయలేదా?

**ని :** ఏమి చేయలేదు. నమ్ము, నమ్మకపో, ఆఖరికి దీనికై ఆతురత కూడా నాలో లేకుండాపోయెను. నా గురువు నాకు "నువ్వు ఆ మహాతత్త్వానివి" (Supreme) అని మాత్రం చెప్పి గతించాడు. ఆయన మీద నాకున్న గురికొద్దీ, ఆయన మాటను విశ్వసించకుండా ఉండలేకపోయాను. మిగతాదంతా దానంతట అదే జరిగిపోయింది. నాలో మార్పు రావడం గమనించాను – అంతే, నిజం చెప్పాలంటే నా పరిస్థితికి నేను ఆశ్చర్యపోయాననవచ్చు. నా గురువు మాటలు నిజమా, కాదా అని నాకు నేను నిరూపించుకోవాలని నిశ్చయించుకున్నాను. కానీ ఏం చేయాలో తెలియలేదు. ఆయన అంత కచ్చితంగా అన్న మాటలు గురించీ, ఆయన్ని గురించీ గంటల తరబడి ఆలోచిస్తూ కూచునేవాణ్ణి.

**పృ :** అప్పుడు మీకు ఏమయింది? మీరా మహత్తత్త్వమని మీకెట్లా తెలిసిందంటారు?

**ని :** ఎవరూ వచ్చి నాకా మాట చెప్పలేదు. నా లోపల కూడా అటువంటి మాట నాకేదీ వినిపించలేదు.

నిజం చెప్పాలంటే, నేను ఎప్పుడో పలు ప్రయత్నాలు చేస్తున్న ప్రారంభ దశలో నాకు అనేక విచిత్రమైన అనుభూతులు, దృశ్యాలు (Visions) కలుగుతుండేవి; వింత కాంతులు కనిపించడం, కంఠస్వరాలు వినిపించడం, దేవుళ్ళనూ, దేవతలనూ కలిసి సంభాషించడం, ఇలాంటివన్నీ ఆ కాలంలో సంభవిస్తూ ఉండేవి. ఎప్పుడైతే నా గురువు "నువ్వు ఆ మహత్తత్త్వానివే" (Supreme Reality) అని అన్నాడో, ఆనాటి నుండి విచిత్రానుభూతులు, దృశ్యాలు, ఇవన్నీ మాయమైనై. నా మనసు పూర్తిగా నెమ్మదించింది. నా జీవితం అతి సరళమైపోయింది. నా కోరికలు క్షీణించనారంభించినవనీ, నాకు 'తెలిసినది' తగ్గిపోనారంభించిందనీ కనుగొన్నాను. ఆశ్చర్యమేమిటంటే, నాకు నేను "నా కేమీ తెలియదు. నాకేమీ అక్కరలేదు" అనే స్థితికి వచ్చేశాను.

**పృ :** మీరు నిజంగా కోరిక నుండి, తెలిసిన దాని (Known) నుండి విముక్తి చెందారా, లేక మీ గురువు 'జ్ఞానిని' వర్ణించిన దానినిబట్టి ఒక మనోరూపం సృష్టించుకొని దానిననుసరించి ప్రవర్తించ మొదలెట్టారా?

**ని :** నాకు నా గురువు ఏరకమైన మనోచిత్రం ఇవ్వలేదు. నాకు నేనై అలాంటిదేదీ సృష్టించుకోనూ లేదు. నేను దేనికై ఎదురుచూడాలో నా గురువు నాకేమీ చెప్పలేదు.

**పృ :** మీరు అందుకోదగినట్లుగా చెప్పిన ఆ మహాతత్త్వ మేమిటి?

**ని :** మోసపోయిన స్థితి నుండి బయటపడ్డాను. అంతే. అంతకుమునుపు నాకు నేనే ఏదో లోకాన్ని సృష్టించుకొని దానినిండా అనేకమంది మనుష్యుల్ని నింపుకుంటుండే వాణ్ణి. ఇప్పుడు ఆ పని చేయడం మానేశాను.

**పృ :** మరి మీరెక్కడ జీవిస్తుంటారు?

**ని :** ఉనికి ఉండేచోటు, ఉనికి లేనిచోటు, ఈ రెండింటి ఆవలనున్న శూన్యంలో, చైతన్యం ఆవల. ఈ శూన్యమని అంటున్నానే, ఇది పూర్ణత్వం కూడాను. నామీద జాలి పడాల్సిన అవసరంలేదు. "నా పనిచేసేశాను. ఇక నేను చేయాల్సింది ఏమీ లేదు" అని ఎవరైనా అంటే ఎట్లానో, ఇదీ అట్లానేననుకో."

**పృ :** మీ ఆత్మసాక్షాత్కారానికి మీరో తేదీని చెప్తున్నారు. దాని అర్థం ఆ రోజున మీకేదో జరిగిందనే అనుకోవాలి. అదేమిటో సరిగా చెప్పండి.

**ని :** మనసు సంఘటనలను ఉత్పత్తి చేయడం మానేసింది. అంతులేని ఆ పురాతనమైన అన్వేషణ ఆగిపోయింది – నా కేమీ అక్కడలేకుండా పోయింది, ఇక నేను దేనికై కూడా ఎదురుచూసే లక్షణం నశించింది– ఏ ఒక్కటీ నా స్వంతం అనుకోడం వదిలిపోయింది. సాధించేందుకు నేనంటూ, నాకంటూ ఏదీ మిగలలేదు. తుదకు 'నేనున్నాను' అనే భావం కూడా చెఱిగిపోయింది.

నే గమనించిన మరో విషయమేమిటంటే, నేనంతకుమందు నా అలవాటు ప్రకారం నిశ్చయంగా రూఢిగా భావిస్తున్నవన్నీ, అలా కనిపించడం మానేసినై. మునుపు ఎన్నో విషయాలను గురించి నాకు కచ్చితంగా తెలుసుననుకునేవాణ్ణి. కానీ ఇప్పుడేదీ కూడా నిస్సంశయంగా ఇలానే జరుగుతుందని చెప్పగలిగిలేను. కానీ ఇలాంటి తెలియని స్థితికి వచ్చినందుకు నే పోగొట్టుకున్నది కూడా ఏమీ లేదనిపిస్తుంది; అందుకు కారణం, ఒకప్పుడు నాకు తెలిసిందంతా అసత్యమైనదే కాబట్టి. తెలిసినదంతా (Known) అజ్ఞానమేననే సత్యమెరుగడమే నా "తెలియనితనం" అనవచ్చు. 'నాకు తెలియదు' అనే సత్యమొక్కటే మనసుకు ఖాయంగా తెలిసిన విషయం.

మాటవరసకు 'నేను పుట్టాను' అనే వాక్యమే తీసుకో. నీకది సత్యంగా కనిపించవచ్చు. కానీ అది సత్యంకాదు. నువ్వేనాడూ పుట్టలేదు; నీకేనాటికీ మరణం లేదు. పుట్టినదల్లా ఒక భావం (Idea). అదెలాగూ చనిపోతుంది, కాని నువ్వు కాదు. ఈ భావంతో తాదాత్మ్యం చెంది నువ్వు జనన మరణాలు అనుభవిస్తున్నావు. సినిమా తెరమీద కనిపించేదంతా దానిపైపడే వెలుగే అయినట్లు, చైతన్యమే ఈ విశాల ప్రపంచంగా రూపొందింది. పరీక్షగా చూడు, ఇక్కడి నామరూపాలన్నీ ఈ చైతన్యసాగరంలో వచ్చీపోయే తరంగాలనీ, చైతన్యమొక్కటే ఉన్నట్లు చెప్పవచ్చును కానీ, ఆ చైతన్యం పొందే అనేక మార్పులు నిజంకావని నీకే తెలుస్తుంది. ఈ బ్రహ్మాండమైన చైతన్యంలో ఒక దీపం ప్రత్యక్ష మవుతుంది. అదో చిన్న చుక్కలాంటిది. వేగంగా అటూ ఇటూ కదులాడుతుంటుంది. కాగితం మీద కలంరాసినట్లు దాని కదలికవల్ల ఆకారాలు, ఆలోచనలు, అనుభూతులు, భావాలు, సిద్ధాంతాలు ఎన్నో రూపుదిద్దుకుంటై. కలంలోని సిరా మిగిల్చిన మరక స్మృతి అని గ్రహించు.

నువ్వే ఆ చిన్న దీపపు చుక్కవి. నీ చలనం, నీ కదలిక వల్లనే ప్రపంచం మళ్ళీ మళ్ళీ సృష్టించబడుతున్నది. కదలడం, చలించడం మానెయ్; ప్రపంచం ఉండదు. నీలోనికి జాగ్రత్తగా చూడు. నీ శరీరమంతా అలముకొన్న "నేనున్నాను" అనే భావాన్ని కలుగజేసే

ఆ బ్రహ్మాండమైన వెలుగు యొక్క ప్రతిబంబమే ఈ చిన్ని వెలుతురు చుక్క అని గ్రహించు. ఉన్నదంతా వెలుతురే, మిగతాదంతా ఊరక అలా కనిపించేది మాత్రమే.

**పృ :** మీరా వెలుగు నెరుగుదురా? మీరు చూచారా?

**ని :** మనస్సుకు అది పెను చీకటిగా కనిపిస్తుంది. దాని ప్రతిబంబాల ద్వారానే దానిని ఎఱుగవచ్చు.

**పృ :** మన ఇద్దరి మనసులు ఒకేరకంగా ఉన్నాయని అర్థం చేసుకోవాలా?

**ని :** అదెలా? ఎన్నో జ్ఞాపకాలతో నేసిన నీ ప్రత్యేకమైన మనసు నీకున్నది. ఆ ప్రైవేట్ మనసులో నీ కోరికలు భయాలు, దానిని అలా నిలబెట్టి ఉంచుతున్నై. ఇక నా కంటావా, నాకసలు స్వంత మనసే లేదు.

నేను తిండి తినాల్సి వచ్చినప్పుడు ఎలాగైతే నాకీ విశ్వం ఇంత తిండి సమకూర్చి పెడుతున్నదో, అలాగే నేనేదైనా తెలుసుకోవలసి ఉంటే, ఈ విశ్వమే దానిని నా ముందుకు తెచ్చి ఉంచుతుంది.

**పృ :** మీరు తెలుసుకో దలచినదంతా మీకు తెలుస్తుంటుందా?

**ని :** నాకు ఏదీ తెలుసుకోవాలని ఉండదు. కానీ ఏదైతే తెలుసుకోవలసిన అవసర ముందో, అది నాకు తెలుస్తూ వుంటుంది.

**పృ :** ఈ తెలియడం లేక జ్ఞానం మీ లోపలి నుండి వస్తుందా, లేక వెలుపల నుండి వస్తుందా?

**ని :** ఇక్కడ నీ ప్రశ్న వర్తించదు. నాలోన ఉన్నదే నా వెలువలది. నాకు వెలువలనున్నదే నాలోనిది. నాకరవసరమైన జ్ఞానం ఈ క్షణాన నీ వద్ద నుండి పొందవచ్చు. కానీ నువ్వు నాకు వేరుగా లేవు.

**పృ :** మీ పరిస్థితిలో ఏదైనా అభివృద్ధి ఉంటుందా? నిన్నటితో పోల్చుకున్నప్పుడు మీలో ఇవాళ ఏదైనా మార్పు కానీ, ప్రగతికానీ కనిపిస్తుందా? వాస్తవం యెడల మీకేర్పడిన దృష్టి, వైశాల్యంలో కానీ, లోతులో కానీ పెరుగుతుంటుందా?

**ని :** వాస్తవమనేది అచలం. అచలమై ఉండి కూడా అది ఎప్పుడూ కదులుతూనే ఉంటుంది. అదొక మహానదిలాంటిది – ప్రవహిస్తూనే ఉంటుంది. అయినప్పటికీ ఎల్ల కాలం అక్కడే ఉంటుంది. నదీప్రవాహం, నదీ గర్భమూ, నదీ తీరాలూ కాదు – దాని నీరు. అదేవిధంగా ఈ సత్త్వగుణం, ఈ విశ్వసత్త్వం అంధకార నైరాశ్యశక్తులైన తామస రాజస గుణాలతో ఆటాడుతూనే ఉంటుంది. సత్త్వంలో మార్పు, ప్రగతి ఎప్పుడూ

ఉంటూనే ఉంటై. రాజసంలో మార్పు, తిరోగమనం ఉండక తప్పదు. తామస మంటే చిందరవందర, గజిబిజి. ఈ త్రిగుణాలు ఒక దానితో ఒకటి ఎప్పటికీ ఆడుకుంటూనే ఉంటై. ఉన్న విసయం మిది – దీనిని మనం కాదనలేము.

**పృ :** నేను ఎల్లప్పటికీ, తామసంతో మందమతినై, రాజసంతో ఈ దిక్కుమాలిన స్థితికి రావలసిందేనా? అయితే సత్త్వం మాటేమిటి?

**ని :** సత్త్వం నీ నిజ స్వభావం యొక్క కాంతులు విరజిమ్మే తేజస్సు. అది నీ మనసు కావల, ఆ మనసు సృష్టించే లోకాల కావల దర్శనమివ్వడానికి ఎల్లప్పుడూ సంసిద్ధంగానే ఉన్నది. కాని నీకు ఈ లోకం కావాలని ఉంటే, నీవీ మూడు గుణాలను ఏకంగా స్వీకరించక తప్పదు. భౌతిక పదార్థమూ, శక్తీ, ప్రాణమూ అనే ఈ మూడు వేర్వేరుగా కనిపించినా, సారంలో ఈ మూడూ ఒక్కటే. మూడూ కలిసి మిశ్రమంగా చైతన్యంలో ప్రవహిస్తూ ఉంటై. దేశ కాలావస్థల్లో ఎల్లప్పుడూ ఈ ప్రవాహం సాగుతూనే ఉంటుంది. నిత్యం జరిగే జనన మరణాలు, ఒక సమయాన కొంత పురోగమనం తర్వాత కొంత తిరోగమనం, మళ్ళీ కాస్త పురోగమనం, తిరోగమనం, ఇలా ఒకదాని వెంట మరొకటి ఆదీ అంతూ లేకుండా సాగుతూనే ఉంటుంది.

ఇక వాస్తవమంటావా? అది కాలాతీతమైనది; మార్పుకు లోనుకానిది శరీర, రూప రహితమైనది; మనసు లేనిది; ఈ వాస్తవమనే ఎఱుకే పరమానందం.

## మీ చెందనే వుండిపోతాను

**పృ :** నేనిక్కడే, మహరాజ్‌తో ఎంతకాలం వీలైతే, అంతకాలం ఉండిపోవాలని ఉంది.

**ని :** నువ్వు నీ ఇంటికి వెళ్ళిపోయినప్పటికీ, ఇక్కడ ఏ విత్తనమయితే నాటబడిందో, ఏదైతే నువ్వు అందిపుచ్చుకున్నావో, అది నిన్ను మార్చనున్నది. అది నిన్ను పూర్తిగా తన వశం చేసుకున్నది.

# 'నేను', 'నాది'కి స్వతహాగా ఉనికి లేదు

దేహం వేరు, ఆత్మవేరు అని తెలియడమే 'తెలివి' అని నిఘంటువర్థం. ధనమార్జించే తెలివి, కీర్తినార్జించే తెలివి, మోసం చేయగలిగిన తెలివి చాలా మందికి వుంటుంది కానీ, ఆత్మని గుర్తించగలిగిన, కనుగొనగలిగిన తెలివి వుండడం అరుదు. మనిషి సమస్తమైన కష్టాలకు ఈ తెలివి తక్కువే కారణమనే విషయాన్ని వివరిస్తున్నాడు నిసర్గదత్త మహరాజ్.

నిసర్గ : కాలంలో విస్తరిల్లే మనసున్నది నీకు. ఒకదాని తర్వాత మరొకటిగా ఏవో సంఘటనలు నీ జీవితంలో సంభవిస్తూ వుంటై; తత్సంబంధమైన జ్ఞప్తి ఉండిపోతుంది. అందులో దోషమేమీ లేదు. కానీ గడచిపోయిన బాధలు, సుఖాలు జీవపదార్థానికి అత్యవసరమైన ఈ అనుభవాలన్నీ–ఒక అసంకల్పిత ప్రతిక్రియగా ఉండిపోయి, ఇప్పటి ఈ జీవితాన్ని, నీ ప్రవర్తనను శాసిస్తేనే, సమస్య ఉత్పన్నమవుతున్నది. ఈ 'అసంకల్పిత ప్రతిక్రియ' 'నేను' రూపం ధరించి, శరీరాన్నీ మనసునూ తన ప్రయోజనాలకు – ఈ ప్రయోజనాలేమో ఎల్లవేళలా ఏ కాస్త మార్పుకూడా లేకుండా, సుఖాన్వేషణకూ, బాధాకరమైన వాటినుండి పరిగెట్టిపోవడానికే అంకితమై వుంటై – 'స్వ'వినియోగించుకుంటుంది.

'నేను', లేక 'స్వ' అనేది, కేవలం కోర్కెల భయాల మూట మాత్రమేనని ఉన్నది ఉన్నట్లు గ్రహిస్తే, సుఖాన్ని పదిలపరచుకోడానికీ, భయాన్ని తప్పించుకోడానికీ ఏ వస్తువులు ఏ మనుషులు ఉపకరిస్తారో, వాటినీ వారినీ మాత్రమే తనలో ఇముడ్చుకోవాలనే ఉద్దేశ్యం కలిగినదే ఈ 'నాది' అనే భావన. ఇది నువ్వు అర్థంచేసుకుంటే ఈ 'నేను, నాది' అనేవి రెండు మిథ్యాపూరిత భావనలనీ, వాటికి వాస్తవంలో పునాదిలేదనీ నువ్వు కనుగొంటావు. మనసుచే సృష్టింపబడిన వీటిని సృష్టించినవాడు నిజమనుకుంటున్నంత కాలం, అవి అతడిపై అధికారం చెలాయిస్తై; ఎదురు తిరిగి ప్రశ్నిస్తే ఇట్టే మాయమవుతై.

'నేను, నాది' అనే వాటికి స్వతహాగా ఉనికిలేదు; వాటికేదో ఒక ఆసరా కావాలి ! ఆ ఆసరా వాటికీ శరీరంలో లభిస్తుంది. శరీరమే వాటిని నిర్దేశించే కేంద్రబిందువవుతుంది. 'నా భర్త, నా పిల్లలు' అని నువ్వు మాట్లాడేటప్పుడు, నీ ఉద్దేశం నీ శరీరంయొక్క భర్త, పిల్లలనీ సూచించడమే. ఈ శరీరమే నేననే భావన వదిలేసి, 'నేనెవరు?' అన్న ఈ

సవాల్‌ను నేరుగా ఎదుర్కో. వెన్వెంటనే, వాస్తవాన్ని వెనక్కు తీసుకువచ్చే ఓ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఇంకాస్త గట్టిగా చెప్పాలంటే, మనసును వాస్తవం చెంతకుచేర్చే క్రియారంభం జరుగుతుండవచ్చు.

**ప్రశ్న :** 'నేను'ను ప్రేమించే మనుషులున్నారు. వాళ్ళని వదిలేయాలంటారా?

**ని :** వారిమీద నీ పట్టు మాత్రమే వదిలేస్తావు. ఇక మిగతా వ్యవహారమంతా వారి మీదనే ఆధారపడి వుంటుంది. వారికి నీ మీద ఆసక్తి తగ్గిపోనూవచ్చు.

**ప్ర :** అలా ఎలా సంభవిస్తుంది? వాళ్ళు నావాళ్ళు కాదా?

**ని :** వాళ్ళు నీ దేహానికి సంబంధించిన వారు, కేవలం నీ సొంత మనుషులు కాదు. ఇంకా బాగా చెప్పాలంటే, నీకు 'కానివారంటూ' ఎవరూ లేరు.

❖ ❖ ❖ ❖

"నాతో, నేనెలా వ్యవహరించాలి' అనే ప్రశ్న గనక ఉదయిస్తే, నిసర్గదత్త సమాధానం: "వస్తువులతో వ్యవహరించడానికి ఆయా వస్తువుల గురించి సమాచారం, జ్ఞానం అవసరం. మనుష్యులతో వ్యవహరించడానికి అంతర్ దృష్టి, సానుభూతి అవసరం. నీతో నీవు వ్యవహరించడానికి ఏదీ అవసరం లేదు. ఎలా వున్నావో అలాగే వుండు. అనగా చైతన్య వంతమైన సత్త కలిగుండడం, నీనుంచి నువ్వు దారితప్పి ఎటో పడిపోకుండా వుండడం.'

# నీ ఊహ లేకపోతే ప్రపంచమే లేదు

'బ్రహ్మసత్యం, జగన్మిథ్య'; సత్యం సంగతి తెలియకపోయినా, జగం మిథ్య అన్నప్పుడు చాలామంది అభ్యంతరం లేవదీస్తారు. మిథ్య అంటే 'లేనిది' అని కాదు. ఉన్న వాడికి ఉన్నట్లు, లేనివాడికి లేనట్లు వారి వారి దృష్టికి పలురకాలుగా గోచరిస్తుండేది. మనిషికి దైవాభిలాష వుండి, సత్యాన్వేషణకే తన జీవితాన్ని అంకితం చేసుకుంటే, ప్రాణికి అవసరమైన తిండి బట్ట వసతి అందరికీ లభింపజేయగలిగి వుంది; ఈ ప్రపంచం. ఆకాశమే హద్దుగాగల మనిషి ఆశను మాత్రం తీర్చగలిగిలేదు; మిగతావారేమైనా, తాను భద్రంగా వుండాలనే భావం, ఆ భద్రతకు ఎక్కడ లోపం వాటిల్లుతుందోననే భయం, తొలగించలేదు. మనిషికీ ప్రపంచానికీ వుండే సంబంధం ఈ ఆశాభయాల మీదే ఆధారపడి వుంటుంది, అంటారు నిసర్గదత్త మహరాజ్.

**నిసర్గ :** ప్రపంచంతో వచ్చిన బాధేమీ లేదు; వచ్చిన బాధల్లా, ఆ ప్రపంచాన్ని నువ్వు ఎలా వీక్షిస్తున్నావన్నదే. నీ ఊహే నిన్ను అపమార్గం పట్టిస్తున్నది. ఊహలేకపోతే ప్రపంచమే లేదు. ప్రపంచమనేది ఒకటున్నదనే నీ దృఢమైన నమ్మకమే ప్రపంచం. నువ్వు చూస్తున్న ఈ ప్రపంచం చైతన్యంతో నిర్మితమయింది. భౌతిక పదార్థం అని నువ్వు పేరు పెట్టుకున్నది చైతన్యమే. అది 'నీవు' అనే ఆకాశంలో కదులాడుతున్నది. మమతను తెగటార్చు, ఏమి మిగులుతుంది?

**పృచ్ఛకుడు :** ప్రపంచం వుంటుంది, నేనుంటాను.

**ని :** అంతే. కానీ కోర్కె భయం అనే తెర తొలగించి, ఉన్నది ఉన్నట్లే చూస్తే ఎంత తేడానో!

ఒకదాని యెడల కోర్కె మరొక దాని యెడల భయమూ ఉండటమే తప్పనుకో నక్కరలేదు. సక్రమమైన దానిని కోరుకో, అక్రమమైన దానిని చూచి భయపడు. అలా కాకుండా మనుషులు ఏది అక్రమమో దానిని కోరుకొని, ఏది సక్రమమో దానిని చూచి వెఱిస్తే, గందరగోళం, నైరాశ్యం సృష్టించినట్లవుతుంది.

**పృ :** ఏది సక్రమం, ఏది అక్రమం?

**ని :** సాపేక్ష న్యాయంగా చూస్తే, ఏది దుఃఖాన్ని, బాధనీ తెస్తుందో అది చెడ్డది. అక్రమమైనది; ఏదైతే దుఃఖ నివారణకూ, బాధ తొలగించడానికి దారి తీస్తుందో, అది సక్రమమైనది; పరిపూర్ణము, అనుత్తమముగా అయినట్లయితే, ఏది నిన్ను వాస్తవంవద్దకు తీసుకువెళ్తుందో అది సక్రమమైనది. ఏది వాస్తవాన్ని, కాంతిహీనం చేస్తుందో అది అక్రమమైనది. మార్జాలం ఏ విధంగానైతే తన సంతానాన్ని నోట కరచుకొని తీసుకు వెళ్తుంటుందో, ఆ పసికూనలు తమవంతుగా చేయవలసింది ఏమీ వుండదో, అలాగే భక్తుడు గురువుకో, భగవంతుడికో శరణాగతి అయి వూరుకుంటే, అతడే తనని దరిజేర్చ గలడని అనేస్తుంటారు కొందరు. అలాంటి వారికి శరణాగతి అంటే ఏమిటో సరిగా తెలియదు; ఆధ్యాత్మికంగా తమ సోమరితనాన్ని సమర్థించుకుంటూ ఉంటానికి ఈ మాటలు ఉపకరిస్తుంటై.

సత్సంగానికి చాలా ప్రభావం వుంటుందన్నమాట నిజమైనప్పటికీ, గురువు చెప్తున్న మాటలతో, జరుగుతున్న సంభాషణలతో తానూ హృదయపూర్వకంగా ఏకమై ఆయనతో జతగా చరించాలి. అప్పుడు సాధకుని చైతన్యంలో చాలా కృషి జరుగుతుంటుంది. శారీరక శ్రమకన్నా, ఈ మానసిక శ్రమ మరింత కష్టమైనది. ఈ గ్రహింపుతోనే సత్సంగంలో పాలొనాలి.

**పృచ్ఛకుడు :** సత్సంగం దానంతట అదే మనిషిని విముక్తపరుస్తుంది అని నా కొకరు తెలియజేశారు. నది, ఏ విధంగానైతే మనిషిని నదీ ముఖద్వారం వద్దకు తీసుకు వెళ్తుందో, అదే విధంగా మంచివారి నిశ్శబ్ద సూక్ష్మ ప్రభావం, నన్ను వాస్తవం వద్దకు చేరుస్తుందని అన్నారు.

**నిసర్గ :** నిన్ను అది నది వద్దకు కొనిపోతుంది అనేమాట నిజమే, కానీ నదిని దాటవలసింది నువ్వే. 'స్వేచ్ఛను బడయాలి' అనే సంకల్పం లేకుండా, స్వేచ్ఛను పొందలేవు. నిలబెట్టుకోలేవు. విముక్తికై కష్టించాలి. కనీసం దానికి అడ్డం నిలుస్తున్న ఆటంకాలను శ్రద్ధగా తొలగించక తప్పదు. శాంతి కావాలంటే, శాంతికై కృషి సల్పాలి. ఊరకచూస్తూ కూచొని, శాంతిని రమ్మంటే రాదు.

# మనో శరీరాల యెడల మరణించి, జీవించు

మనిషికి చిత్త స్వాస్థ్యముంటేగానీ, ఆరోగ్యం తిన్నగా ఉండదు. ప్రతి వ్యక్తినీ తీరికగా పరీక్షించి, అంటే శారీరక ఆరోగ్యమేకాక, మానసిక ఆరోగ్యం కూడా బాగుంటున్నదా లేదా అని విమర్శగా చూచి చికిత్సచేసే అవకాశం నేటి యాంత్రిక యుగంలో చాలా తక్కువ. మనసున్న వైద్యుడికి అనేక ప్రశ్నలుదయించుతై. శ్రీ నిసర్గదత్తతో ఒక వైద్యుడు చేసిన సంభాషణ పొందుపరుస్తున్నాను.

**ప్రశ్న :** వృత్తి రీత్యా నేను వైద్యుణ్ణి. శస్త్ర చికిత్సలతో ప్రారంభించాను. అటు తర్వాత మానసిక చికిత్సా విధానం కొనసాగించాను. మానసిక స్థైర్య ఆధారంగా మనిషికి ఆరోగ్యం చేకూర్చడం మొదలైన విషయాలు గురించి పుస్తకాలు కూడా రాశాను. ఆధ్యాత్మిక ఆరోగ్య సూత్రాలేమిటో తెలుసుకుందామని మీవద్దకొచ్చాను.

**నిసర్గదత్త :** రోగికి చికిత్స చేయాలనుకున్నప్పుడు, మీరు సరిగ్గా దేనికి ఆరోగ్యం కలిగించాలని చూస్తున్నారు? వ్యాధి నయం చేయడం, తొలగించడమంటే ఏమిటి? ఒక మనిషికి వ్యాధి నివారింపబడిందని మీరు ఎప్పుడు నిర్ధారణ చేస్తారు?

**ప్ర :** శరీరానికి ఆరోగ్యం చేకూర్చడం, ఆ తర్వాత శరీరానికి మనసుకీ మధ్యనున్న సంబంధాన్ని మరింత బాగుచేయడానికి ప్రయత్నిస్తుండటం, మనసు తిన్నగా ప్రవర్తిల్లేట్లు చేయాలని చూస్తుంటాను.

**ని :** మనసుకూ శరీరానికీ వున్న సంబంధాన్ని మీరు సూక్ష్మంగా పరిశీలించారా? ఏ సందర్భంలో అవి రెండూ పరస్పర సంబంధం కలిగున్నాయో తెలుసుకున్నారా?

**ప్ర :** శరీరమూ, అంతర్గత చైతన్యం మధ్యన, మనస్సు ప్రవర్తిల్లుతుంటుంది.

**ని :** శరీరం ఆహార నిర్మితంకదా? మరి ఆహారం లేకుండా మనసు ఉంటుందంటారా?

ప్ర : శరీరం ఆహారం ద్వారా నిర్మితం, ఆహారం ఆధారంగానే అది కొనసాగుతుంటుంది. అన్నం లేకపోతే మనసు సాధారణంగా బలహీనమవుతుంది. కానీ మనసు కేవలం ఆహారం కాదు. ఏదో పరివర్తన చెందించే అంశమొకటి దేహంలో మనసును సృష్టిస్తుంది. ఆ పరివర్తన చెందించే అంశమేమై వుంటుంది?

**ని :** కట్టెలో నుండి పుట్టుకొచ్చే అగ్ని కట్టెకానట్లే, మనిషి శరీరం కూడా, శరీరం కాని మనసును తయరుచేస్తున్నది. కానీ ఈ మనసు ఎవరికి కనిపిస్తున్నది? దేనికైతే మీరు 'మనసు' అని పేరు పెట్టారో, దాని ఆలోచనలను అనుభూతులను చూస్తున్నదెవరు? ఇవతల కఱ్ఱ వున్నది, అగ్ని వున్నది. ఈ అగ్నిని అనుభవిస్తున్న భోక్త వున్నాడు. ఈ మనసును అనుభవిస్తున్న భోక్త ఎవరు? ఈ భోక్త కూడా ఆహార ఫలితమేనంటారా లేక ఇతర ఆహారంతో నిమిత్తం లేకుండా ఉన్నాడంటారా?

**ప్ర :** వీటన్నిటినీ చూచేవాడు స్వతంత్రుడు.

**ని :** అని మీకెలా తెలుసు? మీ అనుభవాన్ని అనుసరించే మాట్లాడండి. మీరు శరీరమూ కాదు. మనసూ కాదు. ఆ మాట మీరే అంటున్నారు. కానీ అది మీకెలా తెలుసు?

**ప్ర :** నిజానికి నాకు తెలియదు. అనుకుంటున్నాను, అంతే.

**ని :** సత్యం శాశ్వతమైనది. వాస్తవమైన దానికి మార్పులేదు. మార్పు చెందేదేదీ వాస్తవంకాదు. వాస్తవమైనది మార్పు చెందదు. మరిప్పుడు మీలో మార్పు చెందనిదేది? ఆహారం ఉన్నంతసేపూ, శరీరమూ మనసూ రెండూ వుంటై. ఆహారం అంతమైపోతే శరీరం మరణిస్తుంది. మనసు కరిగిపోతుంది. కానీ గమనించేవాడు నాశనమవుతాడా?

**ప్ర :** అవడనే అనుకుంటున్నాను. కానీ ఈ మాటకు నావద్ద రుజువేమీ లేదు.

**ని :** మీకు మీరే రుజువు. అంతకన్నా మరే రుజువూ లేదు, మహా ప్రమాణం ఉండే అవకాశమూ లేదు. మీరున్నారు, మిమ్మల్ని మీరెరుగుదురు, మీరంటే మీకు ప్రీతి ఉన్నది, మనసు ఏది చేసినా తన ఆత్మానందంకోసమే చేస్తుంది. ఆ ఆత్మయొక్క స్వభావమే ప్రేమ. అదే ప్రేమింపబడుతుంది, ప్రేమిస్తుంది, ప్రేమించదగింది. ఈ శరీరమూ, ఈ మనసూ ఇంత ఆసక్తిదాయకంగా ఇంత ప్రీతికరంగా వుంటానికి కారణం ఈ ఆత్మే. వాటి యెడల మనం చూపించే శ్రద్ధ యావత్తూ ఈ ఆత్మనుండే పుట్టుకొస్తున్నై.

**ప్ర :** ఆత్మగనక శరీరమూ మనసూ కాకపోతే, ఈ రెండూ లేకుండా ఆత్మ ఉండగలదా?

**ని :** ఉండగలదు. మనసు, దేహాలతో నిమిత్తం లేకుండా, ఆత్మ ఉండగలదనడానికి ప్రత్యక్షానుభవం వున్నది. అది సత్త–ఎఱుక–ఆనందం. సత్తయొక్క ఎఱుక ఆనందాబ్ధిని కలిగిస్తుంది.

ప్ర : మీకది ప్రత్యక్షానుభవమవచ్చు గాక; కానీ నా విషయంలో కాదు. అదే అనుభవానికి నేనెలా రావాలి? ఏ పద్ధతులవలంబించమంటారు. ఏ సాధనలు ప్రారంభించమంటారు?

ని : మీరు ఈ శరీరమూ, మనస్సూకాదని తెలుసుకోడానికి మిమ్మల్ని మీరు స్థిరంగా గమనించుకుంటూ వుండండి. ఈ దేహమూ మనస్సులకు పూర్తిగా ఎడంగా, మరణించాననే భావనతో జీవించ నేర్చుకోండి.

ప్ర : ప్రమాద భరితంగా వున్నదే.

ని : మిమ్మల్ని ఆత్మహత్య చేసుకోమని కాదు, నేనంటున్నది, చేసుకోనూ లేరు. ఈ శరీరాన్ని సంహరించగలరు కానీ ఈ మానసిక ప్రక్రియను అపజాలరు. మిమ్మల్ని మీరు ఎవరుగా ఊహించుకుంటున్నారో, ఆ వ్యక్తిని కూడా అంతం చేయలేరు.

నే సూచిస్తున్నదల్లా కేవలం మీ శరీరము మనసు యెడల ఉదాసీనంగా వుండి పోండి. ఈ విధంగా వీటి నుండి ఎడంగా వుండలిగి వుండటం, వాటిని పట్టించుకోకుండా జీవించగలగడం – మీ మనసు నుండి శరీరం నుండి విడివడేట్లు చేయడానికి మీరిప్పటికి ఏమి చేశారో చెప్పండి.

ప్ర : నేను వైద్య వృత్తిలోనున్న వాణ్ణి; ఇప్పటికి చాలా చదివాను. కొన్ని సాధనా విధానాల ద్వారా నాపై నేనొక కఠిన నియమావళిని అమలుచేసుకున్నాను.

ని : కానీ మీ హృదయాంతరాళాల్లో మీరు నిజంగా కోరేదేమిటి?

ప్ర : వాస్తవం కనుగొనాలని వున్నది.

ని : అది సఫలీకృతమవడానికి ఏమి మూల్యం చెల్లించడానికి సిద్ధంగా వున్నారు?

ప్ర : సిద్ధాంతపరంగా చూచేట్లయితే ఏ మూల్యమైనా చెల్లించగల ననుకుంటున్నాను. కానీ నిత్య జీవితంలో నే చేసే పనులను నాకు కలిగే ప్రేరణలను చూస్తే నాకూ వాస్తవానికీ మధ్య అవి అడ్డం వస్తూనే వుంటై. కోరిక నన్ను తనతో తీసుకువెళ్ళిపోతుంటుంది.

ని : వాస్తవం తప్పితే మరేదీ మీ కోర్కెల్ని తీర్చలేనంతగా కోర్కెల్ని అధికంచేసి విస్తృతపరచండి. కోర్కెల్లో దోషమేమీ లేదు; అవి చిన్నవీ సంకుచితమైనవై యుండడమే వాటి దోషం. కోర్కె అనేది ప్రేమ భక్తి స్వరూపమే. వాస్తవాన్ని, అనంతాన్ని, సత్త యొక్క హృదయాన్ని ప్రేమభక్తితో ఆరాధించండి, అంకితమవండి. మీ కోర్కెను ప్రేమగా మలుచుకోండి, సమస్తమైన కోర్కెలూ – అవి ఎలాంటివైనా – ఆనందాబ్ధికై మీ వెంపర్లాట యొక్క చిహ్నలే. మౌలికంగా మీరు సంతోషంగా ఉండాలనే మీ అభీష్టం.

**ప్ర :** అలాంటి కోరిక నాకుండరాదని నాకు తెలుసు.

**ని :** ఆగండి. 'అలా' ఉండకూడదు అని మీకెవరు చెప్పారు? సంతోసంగా ఉండాలని కోరుకోడంలో అపరాధమేమిటి?

**ప్ర :** ఈ 'స్వ' అనేది పోవాలి అని నాకు తెలుసు.

**ని :** కానీ ఆ 'స్వ' అనేది ఉండనే వున్నది. అటు మీ కోర్కెలున్నై. సంతోషాన్ని కలిగుండాలనే గాఢమైన మీ వాంఛ వున్నది. ఎందుకని? మీ మీద మీకు ప్రేమకాబట్టి. మిమ్మల్ని మీరు స్వేచ్ఛగా ప్రేమించుకోండి – కానీ, తెలివిగా; ఇంద్రియలోలత్వం మూర్ఖపు పద్ధతి, తపస్చర్య తెలివైన మార్గం.

**ప్ర :** తపస్ అంటే ఏమిటి?

**ని :** ఒకసారి గనక ఒక అనుభవం పూర్తయితే, మళ్ళీ అదే అనుభవంలో చిక్కుకోకుండా ఉండడం, తపస్సంటే, అనవసరమైన దానిని దరిచేరనివ్వకుండా వుండడం. తపస్సు, రానున్న సుఖ దుఃఖాలను తలపోయకుండా ఉండడం. తపస్సు, అన్ని విషయాలను ఎల్లవేళలా మీ అధీనంలో వుంచుకోడం. కోరిక కలిగుండడమే దోసమనుకోరాదు. కోరిక జీవితమే; ఎదగాలనీ, జ్ఞానం అభివృద్ధి చేసుకోవాలనీ, అనుభవాన్ని విస్తృత పరచుకోవాలనే ఈ కోరిక, జీవితానికి సహజ లక్షణమే. మీరు మీ కోరిక తీర్చుకోడానికి ఎంపిక చేసుకునే విషయాలలో మాత్రమే దోషమున్నది. ఏదో అల్పమైనది, అనగా ఆహార పదార్థాల ఆరగింపు, లైంగికానుభవం, అధికారం సంపాదించడం, కీర్తినార్జించడం మొదలైనవి మీకు ఆనందం చేకూర్చుతై అని భావించడం ఆత్మవంచన అవుతుంది. మీ ఆత్మ ఎంత విశాలమైనదో, ఎంత లోతైనదో, దానితో సమానమైన వైశాల్యం, లోతుగలదే మీకు నిజమైన శాశ్వతానందమివ్వగలదు.

**ప్ర :** ఆత్మను ప్రేమించడాన్ని అభివ్యక్తీకరించేదే వాంచ అనుకున్నప్పుడు, అందులో మౌలికంగా దోషమేమీ లేదనుకుంటే, ఈ వాంఛను జీవితంలో ఎలా నడిపించాలి?

**ని :** మీ అంతరాత్మ యొక్క శ్రద్ధ ప్రధానంగా దేనిమీద కేంద్రీకృతమై వుందో, దానిని సతతమూ మీ దృష్టియందిడుకొని, మీ జీవితాన్ని తెలివిగా జీవించండి. అంతా చేస్తే, చివరకు నిజంగా మీరు కోరుకునేదేమిటి? పరిపూర్ణత్వం కాదు; ఎందుకంటే మీరిప్పటికే పరిపూర్ణులు. మీరేదైయున్నారో దానిని అభివ్యక్తీకరించాలనే మీరు కోరుకుంటున్నది. మనసూ దేహమూ రెంటినీ స్వాధీనపరచుకొని వాటిచేత సేవ చేయించుకోండి.

ప్ర : ఈ చేయించేవాడెవడు?

ని : పరిశుద్ధమైన మనసు, ఆత్మకు నమ్మినబంటు. అది నీలోని పనిముట్టును బాహ్య పనిముట్టును స్వాధీనపరచుకొని, వాటి విధులను అది నిర్వహించేట్లు చేస్తుంది.

ప్ర : ఏమిటి వాటి విధులు?

ని : ఆత్మ, విశ్వవ్యాప్తం; దాని లక్ష్యాలు కూడా విశ్వవ్యాప్తమే. ఈ ఆత్మకు 'స్వ' అనేది లేదు. స్థిరమైన నడవడితో కూడిన జీవితం గడపండి; కానీ దానినే ఒక లక్ష్యంగా పెట్టుకోకండి. ఓ మహా సాహసయాత్రకు, ఇది తొలి అడుగు మాత్రమే.

ప్ర : నాకు స్వేచ్ఛ వున్నట్లైతే, నేను ఈ శరీరంలో ఎందుకున్నాను?

ని : మీరు శరీరంలో వుండడం కాదు; శరీరం మీలో వున్నది. మనస్సు మీలో వున్నది. అవి రెండూ మీకు సంభవించినై. మీకు వాటి యెడల ఆసక్తి వున్నది కాబట్టి అవి మీవద్ద నున్నై. మీ నిజ స్వభావం అనంతంగా ఆనందించగల శక్తి కలిగినది. అది ఎంతో అభిరుచి, వాత్సల్యంతో నిండి వుంటుంది. తన ఎఱుక పరిధిలోనికి వచ్చిన వాటన్నిటి మీదా అది తన కాంతి కిరణాలను ప్రసరిస్తూ వుంటుంది; దేనినీ మినహాయించదు. దానికి పాపిష్ఠి తనమూ, కురూపమూ తెలియదు. దానికుండే గుణాలు ఆశించడమూ, విశ్వసించడమూ, ప్రేమించడమూను. మీ నిజమైన ఆత్మను ఎరుగనందువల్ల మీరు ఎంత కోల్పోతున్నారో మీకెవరికీ తెలియదు. మీరు ఈ శరీరమూ కాదు, మనసూ కాదు, కాలే కట్టెలూ అందులో నుండి పుట్టే అగ్గికాదు. అవి, వాటివాటి న్యాయాన్ననుసరించి వాటి పాటికి అవి కనిపిస్తై, అదృశ్యమవుతై.

మీరు ఏ సత్యాత్మ అయితే అయివున్నారో, దానిమీద ప్రేమకొద్దీ ఈ సమస్తమైన పనులూ చేస్తున్నారు. అన్నీ మీ ఆనందం కోసమే చేస్తున్నారు. ఆ ఆత్మను కనుగొనుట, దానిని తెలుసుకొనుట, దానిని ప్రేమతో పదిలంగా మనసులో నిలుపుకొనుట, ఇదే మౌలికంగా మీ ప్రబలమైన కోరిక. యుగయుగాలుగా నిన్ను నువ్వు ప్రేమించుకున్నావు. కానీ తెలివితో ప్రేమించుకోలేదు. నీ శరీరాన్నీ మనసునూ తెలివిగా ఆ ఆత్మ సేవలో వాడుకో. నే చెప్పేదంతే. నీ ఆత్మకు నీవు ద్రోహం చేసుకోకు. దానిని సంపూర్తిగా ప్రేమించు. నీమీద నీకెంత ప్రేమో, 'ఇతర్లపైన కూడా నీకంతే ప్రేమ' అని నటించకు. వారంతా సాక్షాత్తూ నువ్వేనని నీవు గ్రహించేంతవరకూ, వారిని నువ్వు ప్రేమించజాలవు. నువ్వు కానిదేదో, అది నేనన్నట్లు నటించకు; నువ్వు ఏది అవునో, అది కాకుండా వుండద్దు.

నీ ఆత్మజ్ఞాన ఫలితగా నువ్వు ఇతర్లను ప్రేమించడం సంభవిస్తుంది కానీ, ఇతర్లపై నీవు ప్రకటించే ప్రేమ నీ ఆత్మజ్ఞానానికి కారణంకాదు. ఆత్మ సిద్ధించేవరకూ, ఏ సద్గుణమూ సత్యమైనది కాదు. ఏమాత్రం సందేహం, ఇసుమంత కూడా లేకుండా, ఉన్న అన్నిటిలోనూ ఒకే జీవిత ప్రవాహం సాగిపోతున్నదనీ, ఈ జీవితమే నువ్వనీ తెలిసినప్పుడు, అందర్నీ సహజంగా సద్యఃస్ఫురణతో ప్రేమిస్తూ వుంటావు. నీపై నీకున్న ప్రేమ యొక్క లోతు కనుగొన్నప్పుడు, ప్రతి ప్రాణీ, ఈ మొత్తం విశ్వంతో సహా, నీ వాత్సల్యాన్ని చూరగొంటై.

అలాకాక, దేనినైనా నువ్వు వేరుగా భావిస్తే, అదంటే నీకు భయం కలుగుతుంది కాబట్టి దానిని ప్రేమించజాలవు. పరాయిది అనుకున్నప్పుడు భయం జనిస్తుంది; భయం, ఈ పరాయితనాన్ని మరింత పెంచుతుంటుంది. అది ఒక విషవలయం. ఆత్మజ్ఞాన మొక్కటే దీనిని ఛేధించగలదు; పట్టుదలతో ఆ పనిని సాధించండి.

# కాలమూ, దేశమూ, నీ మనసులోనివి

అనాసక్తంగా వుండు, నిర్లిప్తంగా వుంటం నేర్చుకోమని, సలహాలిచ్చేవారుంటారు. కానీ ఇది చెప్పినంత తేలికైన విషయం కాదు; అందుకని చేయలేనిదని అనుకోనక్కర లేదు. అయితే ఇది కేవలం ఆలోచనతో నిర్మించి ప్రతిష్ఠించగలిగింది కాదు; సాధనతో పొందగలిగిందీ కాదు. దీనికి ఒక గొప్ప అవగాహన కావాలి. నిసర్గదత్త మహరాజ్ ఈ విషయాన్ని ఎలా చర్చిస్తాడో చూద్దాం.

**ప్రశ్న :** కాబట్టి నిర్లిప్తతను సాధించే మార్గమంటూ ఏదీ లేదంటారు.

**నిసర్గ :** సాధించడమంటూ ఏదీలేదు. అన్ని రకాల ఊహాపోహలు వదిలేసి, ఉన్నది ఉన్నట్లు నిన్ను నువ్వు చూచుకో, కనుక్కో. ఆత్మజ్ఞానమే నిర్లిప్తత, తటస్థ వైఖరినీ. బలీయమైన కోర్కె మొత్తానికి మూలకారణం, ఏదో కొఱవడుతున్నదన్న భావమే. నీకేమీ కొదవలేదనీ, ఉన్నదంతా నీవూ, నీదేననీ తెలిసిన తర్వాత వాంఛ అంతమవుతుంది.

**ప్ర :** నన్ను నేను తెలుసుకోడానికి, ఎఱుకను సాధన చేస్తుండాలా?

**ని :** అది ఇక్కడే ఇప్పుడే సంభవించి ఉండగా నువ్వు దేనికై నిరీక్షిస్తున్నట్లు? నువ్వు చేయవలసినదల్లా కలయజూచి దృష్టిసారించడమే. నీ వంక తిన్నగా చూడు. నువ్వున్నావన్న సంగతి నీకు తెలుసు. అది నీకిష్టమనీ నీకు తెలుసు. అన్ని రకాల ఊహల్నీ వదిలెయ్. అంతే, మరేమీ అక్కరలేదు. కాలంమీద ఆధారపడవద్దు. కాలం మృత్యువని గ్రహించు. నిరీక్షించేవాడు – మరణిస్తాడు. జీవితం ఈ క్షణానే.

నేను వాంఛనుండీ, భయంనుండీ విముక్తుణ్ణై ఉన్నానంటే, అందుకు కారణం నా గతాన్ని గుర్తుతెచ్చుకోను కాబట్టీ, నా భవిష్యత్తును ఊహించుకోను కాబట్టినీ. వాంఛా రాహిత్యంలో కాలాతీత స్థితి సిద్ధిస్తుంది. ఏదైతే లేదో అది 'ఉన్న దానిని' ముట్టుకోగలిగి లేదు. కాబట్టి నేను భద్రంగా వున్నాను. నీవు అపాయాలను ఊహిస్తుంటావు కాబట్టి, నీకు అభద్రతాభావం కలుగుతుంటుంది. పలు భాగాలున్న ఈ శరీరం సంక్లిష్టమైనది కాబట్టి, గాయపడే స్థితిలో వుంటం మూలాన దానికి రక్షణ కావలసిందే. కానీ 'నీ'కు రక్షణ అక్కరలేదు.

ప్ర : లోకం ఇంతగా బాధపడుతూ వుంటే, నాకు శాంతి ఎలా లభించేను?

ని : ప్రపంచం బాధ పడడానికి తగిన బలమైన కారణాలున్నై. ప్రపంచానికి నీవు సహాయపడాలనుకుంటే, నీకు ఇతర్ల సహాయ మవసరమయ్యే స్థితిని దాటాల్సి వుంటుంది. అప్పుడు నువ్వు ఏది చేసినా, ఏది చేయకున్నా ప్రపంచానికి అమిత లాభకరంగా వుంటుంది.

ప్ర : చేయవలసిన అవసరం వుండగా, ఏమిచేయకుండా వుండడం ఎలా లాభం కలిగిస్తుంది?

ని : చేయవలసినదేదైనా వున్నప్పుడు చేయడం జరుగుతుంది. కర్మనాచరించేవాడు మనిషికాడు; అతడి కర్తవ్యమల్లా జరుగుతున్న దాని యెడల ఎఱుకతో వుండడమే. అతడక్కడ వుండడమే కర్మ. కిటికీ అనేది ఆ ప్రదేశంలో గోడ లేకపోవడమే; అది శూన్యంగా వుంటుంది కాబట్టే గాలీ, వెల్తురూ ఇస్తుంటుంది. మనసులో ఏవిధమైన భావ సముదాయాన్ని ఊహా లోకాన్ని, యత్నించే లక్షణాన్ని లేని, మానసిక స్థితిని కలగజేసుకో; ఈ ఆటంకాలన్నీ లేని మరుక్షణమే వాస్తవం తోసుకుంటూ లోనికి వస్తుంది. మనిషికెవరికైనా నిజంగా సహాయపడదలుచుకుంటే, ఎడంగా వుండు. సహాయపడడం అనే దానికి మానసికోద్వేగంతో అంకితమయావంటే, సహాయమందించలేవు.

దుఃఖమూ, బాధా చూచినప్పుడు, దానితో ఉండిపో. వెన్వెంటనే ఏదో ఒక చర్య చేపట్టాలనుకోవద్దు. శాస్త్రం వల్లించడమూ, చర్యలు గైకొనడమూ, నిజంగా సహాయపడవు. దుఃఖంతో కలిసి వుండు; దాని వ్రేళ్ళను వెలికితీసి చూపించు. అవతలి మనిషికి అవగాహన కలగజేయడమే నిజమైన సహాయం.

ప్ర : నా మరణం దగ్గర పడుతున్నది.

ని : నీ శరీరానికి తగినంత కాలవ్యవధి లేదు, కానీ నీకు కాదు. కాలమూ, దేశమూ అనేవి నీ మనసులో వున్నటువంటివి. నువ్వు వాటిచే బంధితుడివి కాదు. నిన్ను నువ్వు అర్థంచేసుకో – అదే శాశ్వతత్వం.

**ఉనికి**

దేశకాలాతీతమైన ఉనికికి తానున్నట్లు తెలియదు. అదే ఉన్నది, అదే సత్యం.

# ఆగు, చూడు అర్థం చేసుకో

**ఈ** ప్రపంచం ఆ జగన్నాటక సూత్రధారి ఆజ్ఞానుసారమే నడుస్తుండవచ్చు గాక. కానీ భూమిమీద జరిగే వినాశనానికి, ఉద్ధరణకు మనిషే బాధ్యత వహించాలి. మనిషి మారితే ప్రపంచం మారుతుంది. అయితే ఆ మార్పు, తనతోనే ప్రారంభమవాలి; మరొకరితో కాదు.

సైనికుల కాల్పుల్లో, అకారణంగా మరణించిన ఒక పిల్లవాని ప్రస్తావన తెచ్చి, ఒకతడు నిసర్గదత్త మహరాజ్‌ను ఇలా అడుగుతాడు.

**ప్ర :** ఆ పిల్లవాడి మరణానికి ఎవరు బాధ్యులు?

**ని :** ఎవరూ కాదు, అందరూను. ఈ ప్రపంచంలో ఏవేవైతే వున్నాయో, అవన్నీ కలిసి ఈ ప్రపంచమంతా ఉన్నది; ఇందులోని ప్రతి ఒక్కటీ మరన్నిటినీ ప్రభావితం చేస్తూనే వుంటుంది.

మనమందరం ఆ పిల్లవాణ్ణి చంపుతాం. మనమందరం ఆ పిల్లవాడితో చనిపోతాం. ప్రతి సంఘటనకూ లెక్కకు మించిన కారణాలుంటై. ఆ సంఘటన పర్యవసానంగా లెక్క లేనన్ని ఫలితాలుంటై. వీటన్నిటినీ లెక్కించి, ఏదో తేల్చడానికి ప్రయత్నం చేయడం వ్యర్థం; దీని యొక్క మూలాన్ని కనుగొనలేవు.

**ప్ర :** మీ హిందువులు కర్మ, పాపఫలం గురించి మాట్లాడుతుంటారు కదా?

**ని :** అది కేవలం మొత్తంమీద స్థూలంగా పలికేమాట. నిజానికి మనమందరం కూడా, పరస్పరం సృష్టించుకుంటూ, సృష్టించబడుతూ వున్నవాళ్ళం. జీవితంలో ఒకరి భారానికి మరొకరం కారణభూతమవుతూ వారి భారాన్ని మరొకరు మోస్తూ బ్రతుకు తుంటాం.

**ప్ర :** అందువల్ల అపరాధం చేసిన వారి బదులు అమాయకులు బాధపడాల్సి వుందన్న మాట.

**ని :** మన అజ్ఞానంలో మనం అమాయకులం; మన కర్మాచరణలో మనం అపరాధులం. తెలియనందువల్ల పాపం చేస్తాం, అవగాహన లేనందువల్ల బాధపడతాం.

మనకున్న తరణోపాయమొక్కటే. ఆగు చూడు, అర్థం చేసుకో, స్మృతుల వలలనుండి బయటపడు. ఈ స్మృతే నీ ఊహను పోషిస్తున్నది ఆ ఊహలో నుండే కోరిక, భయం జనిస్తున్నై.

**ప్ర :** నేనసలు ఎందుకు ఊహ చేయాల్సి వస్తున్నది?

**ని :** చైతన్యం యొక్క వెలుగు నీ స్మృతి అనే ఫిల్మ్‌మీదుగా ప్రయాణిస్తూ, చిత్రాలను నీ మెదడు మీద పడేస్తుంది. చిందరవందరగా వుండే నీ అసమర్థమైన మెదడు మీదపడిన ఈ చిత్రాలు, నీ ఇష్టాఇష్టాల ఆధారంగా రంగులు పులుముకొని, వక్రీకరింపబడుతై. నీ ఆలోచనా విధానాన్ని క్రమబద్ధం చేసుకో; ఉద్వేగపూరితమైన భావజాలాన్ని వదిలెయ్. అప్పుడు మనుషుల్ని, వస్తువుల్ని ఉన్నది ఉన్నట్లు స్పష్టంగా ఉదారతతో చూస్తావు.

**నీవు కోరికవే; అర్థంచేసుకో**

**నిసర్గ :** నా మాట నమ్ము. లక్ష్యమంటూ ఏదీ లేదు, దానిని చేరే మార్గమూ లేదు. నువ్వే మార్గానివి, నీవే లక్ష్యానివి; నిన్ను నువ్వు చేరడం తప్పితే మరేమీ లేదు. చేయాల్సిందల్లా అర్థంచేసుకోవడమే. మనసుయొక్క ప్రవాహమే అర్థంచేసుకోవడం. నీవు తెలుసుకోదగింది. మునుపు ఏం జరిగింది, ముందేమి జరుగనున్నది కాదు; ఇప్పుడేమి జరుగుతున్నదనేదే. నీ కోరికే ఈ విశ్వాన్ని సృష్టిస్తున్నది. ఈ ప్రపంచం నీ సృష్టేనన్న సంగతి గ్రహించి, స్వేచ్ఛనొందు.

# ఆత్మదర్శనానికి అవగాహన అత్యావశ్యకం

నిజమైన అవగాహన ఏర్పడ్డప్పుడు తత్ఫలితంగా జరిగే కర్మాచరణను ఆపే ప్రసక్తిలేదు. అవగాహన ఫలితం మనిషి మాటలోనూ చేష్టలోనూ ప్రతిబింబించి తీరుతుంది. ఆలోచనాత్మకమైన కర్మ మనిషి స్వార్థాన్ని బహిర్గతం చేస్తుంది; అవగాహనాత్మకమైన కర్మ లోకోపకారంగా పరిణమిస్తుంది. మనిషి ఆత్మసాక్షాత్కారం పొందినవాడా కాదా అనేది సహజ స్ఫూర్తితో అతడాచరించే కర్మ ద్వారానే తెలుస్తుంది. మనకే కాదు. అతడికి కూడా తానాచరించిన కర్మ ద్వారానే సాక్షాత్కారం పొందినట్లు తెలిసి వస్తుంది.

జిడ్డు కృష్ణమూర్తిగారితో 'మీరు చెప్పేవన్నీ అర్థంచేసుకొని, ఆ అవగాహనతో బ్రతికితే చాలనుకుంటాను. సంప్రదాయ విరుద్ధంగా పెద్దల మనసులు నొచ్చుకునేట్లు, ఆచరణలో చేసి చూపించవలసిన అవసరం లేదేమో?'నని ఎవరో సందేహం వెలిబుచ్చినప్పుడు, కృష్ణమూర్తిగారు 'సందర్భాన్నిబట్టి, పెద్దలతో సంఘర్షణ ఏర్పడుతుందేమోనని ఆచరణను మానే వీలులేదండీ. కత్తులు ఖణేల్‌మనే అవసరం ఏర్పడ్డప్పుడు వెనుదీసే ప్రసక్తి వుండదు. అప్పుడుగానీ అటో ఇటో తేలిపోదు' అని సమాధానమిచ్చారు. నిసర్గదత్త ఏమంటాడో చూద్దాం.

**ప్రశ్న :** సత్యానికి అర్హత సంపాదించడమూ, భవిష్యత్తు రెండూ ఒకటేనా?

**నిసర్గదత్త :** అవును. రెండూ కూడా అవ్యక్త చైతన్యంలోనే వున్నాయి. వ్యక్తచేతనలో కనిపించే పుణ్యం కేవలం స్వాతిశయం; వ్యక్తచేతనలో వుండేదంతా ఆటంకాలే. అడ్డంకులు లేకపోయినప్పుడు, దానిని దాటివెళ్ళిపోతావు.

**ప్ర :** నేనీ దేహాన్ని కానని తెలుసుకున్నప్పుడు, నిగ్రహం పాటించగలిగిన శీల సంపదనిస్తుందా?

**ని :** నీవీ దేహానివి కావు, ఈ మనసువీ కావు అని తెలిసినప్పుడు, అవి రెండూ చెప్పినట్లు చేయవు. సత్యాన్ని అనుసరించి, అది ఎక్కడికి తీసుకువెళ్తే అక్కడికల్లా వెళ్తావు; ఎంత మూల్యమైనా చెల్లించి, ఏది చేయాల్సివుందో అదే చేస్తావు.

**ప్ర :** ఆత్మసాక్షాత్కారానికి కర్మచేయడం అవశ్యకమా?

ని : ఆత్మసాక్షాత్కారానికి అవగాహన అత్యావశ్యకం, కర్మచేయడమనేది, అనుషంగికం, సందర్భవశంగా జరిగేది. నిలకడగల అవగాహన కలవాడు కర్మ ఆచరించ డానికి వెనుదీయడు. కర్మాచరణే సత్యానికి పరీక్ష, గీటురాయి.

ప్ర : ఈ పరీక్ష లవసరమంటారా?

ని : అన్ని సమయాల్లోనూ నిన్ను నీవు పరీక్షించుకోకపోతే వాస్తవానికి, భ్రాంతికి తేడా తెలుసుకోలేవు. పరిశీలన, సునిశితమైన తర్కమూ, కొంతవరకు సహాయపడతై; కానీ వాస్తవం అన్యోన్య విరుద్ధత కలిగి వుంటుంది. నీ ఆలోచనలు, అనుభూతులు, మాటలు చేతులు, వీటన్నిటిలో నీకు తెలియకుండానే ఆశ్చర్యకరమైన మార్పులు ఎందుకు, ఎలా సంభవిస్తున్నాయో స్వయంగా గమనించకపోతే, నీకు ఆత్మసాక్షాత్కరించిందని ఎలా తెలుస్తుంది? ఆ మార్పులు అంత ఆశ్చర్యజనకంగా వుటాయి కాబట్టే, అవి వాస్తవమైనవని నీకు తెలుస్తుంది. ఎదురుచూచినదీ, ముందే ఊహించినదీ, ఆశించినదీ వాస్తవమవడం అరుదుగా సంభవిస్తుంది.

మరణాన్ని గురించి మాట్లాడుతూ నిసర్గదత్త "మరణాన్ని నేనొక విపత్తుగా భావించను. శిశు జననాన్ని గురించి విని, ఆనందించను. శిశువు భవిష్యత్తులో బాధలను భవింపక తప్పదు; మరణించిన మనిషి వాటిని దాటి వెళ్ళిపోతాడు. జీవితానికి అంటి పెట్టుకోడం, దుఃఖానికి అంటిపెట్టుకోడమన్న మాట. నొప్పి కలిగించే దానిమీద మనకెంతో ప్రేమ; మన స్వభావమటువంటిది. నా మట్టుకు నాకు నా మరనక్షణం, నా ఆనంద క్షణమవుతుంది కానీ, భీతావహమవదు. పుట్టేటప్పుడు ఏడుస్తూ పుట్టాను, చనిపోయేటప్పుడు నవ్వుతూ చనిపోతాను" అన్నాడు.

సందర్భాన్నిబట్టి నిసర్గ మాటలు అర్థంచేసుకోవాలి. 'దుఃఖమయమైన ఈ జీవితం ఎందుకని, పుట్టిన శిశువును ముందే సంహరిస్తావా?' అని ఓ పృచ్ఛకుణ్ణి అడిగిన సందర్భమూ వున్నది. భూమిపై ఈ నరజన్మ విలువైనదే అని నిసర్గ అభిప్రాయం. 'నేర్చుకోడానికి' ఇది రంగస్థలమని గ్రహించి, ఇక్కడి కష్టసుఖాలను సరిగా అర్థంచేసుకొని, నిసర్గ చెప్పినట్లు, జీవిస్తే మనమూ ఆయనలాగానే నువ్వుతూనే నిర్గమించవచ్చు అన్నాడు మిత్రశ్రీ.

# అవాస్తవాన్ని గట్టిగా చూడు: వాస్తవమవుతుంది

మనిషిని భావుకుడుగా వర్ణించవచ్చు. జీవితంలో ప్రేమను కనుగొనేబదులు, ప్రేమ అనే మానసిక భావాన్ని పెంచి పోషిస్తానంటాడు. ఆ 'మహాశక్తి'ని నిజ జీవితంలో సాక్షాత్కరించుకునేందుకు ప్రత్యామ్నాయంగా 'దైవారాధన' అనే భావాన్ని ఆదరిస్తానంటాడు. అసలు వస్తువుకన్నా తత్సంబంధిత భావాన్నే ఎంచుకుంటాడు.

వాస్తవమైన దానిని పొందాలంటే శ్రమించాలి; జీవితాన్ని తదనుగుణంగా మలుచుకోవాలి. కపటం విడనాడాలి. కేవలం దానికి సంబంధించిన సంక్షిప్త భావాన్ని కలిగుండడానికి ఈ అవస్థేమీ అక్కరలేదు. భావాలు తేలికగానే లభ్యమవుతై. 'వాస్తవం' స్థానంలో, భావాలతో సరిపెట్టుకునే స్థితిని గురించి నిసర్గదత్త ఏమంటాడో చూద్దాం.

**నిసర్గ :** జ్ఞాని అనుభవానికి అతీతుడు; అతడి స్మృతిపథంలో 'గత'ముండదు. ఏ ఒక్కదానితో అతడికే సంబంధమూ ఉండదు. కానీ ఈ మనసు అనేక రకాల సిద్ధాంతాలు, నిర్వచనాలకై వెంపఋలాడుతూ వుంటుంది. వాస్తవాన్ని పిండి, దానిని మాటల రూపంలో బంధించాలని ఆత్రపడుతుంటుంది. ప్రతి ఒక్క దానికీ ఓ భావం ఏర్పరచుకోవాలంటుంది. భావం లేనిదే మనసుకు అసలు ఉనికే లేదు.

వాస్తవం, నిజానికి ఏకాంతంగా వుంటుంది. కానీ మనసు దానితో అలా వ్యవహరించదు. మనసెప్పుడూ అవాస్తవమైన దానితోనే వ్యవహరిస్తుంటుంది. మనసు చేయగలిగింది కూడా అంతే మరి – అవాస్తవమైన దాన్ని, అవాస్తవం అని కనుక్కోవడమే.

**ప్రశ్న :** వాస్తవాన్ని వాస్తవంగా చూడడమే.

**ని :** వాస్తవాన్ని చూడడమనేది లేదు. ఎవరు దేనిని చూస్తారు? వాస్తవంగా ఉండగలవు, అంతే నువ్వెలాగూ అదేననుకో. సమస్య యావత్తూ మేధాపరమే. అవాస్తకమైన భావాలను వదిలెయ్, నువ్వు చేయాల్సిందంతే. వాస్తవమైన భావాల అవసరం లేదు. అలాంటివేమీ లేవు.

**ప్రశ్న :** అయితే మరి వాస్తవాన్ని దర్శించమని మనల్ని ఎందుకు ప్రోత్సహిస్తున్నట్లు?

**ని :** మనసుకు ఏదో ఒక ఉద్దేశం, ప్రయోజనం వుండాలి అనిపిస్తుంటుంది.

అవాస్తవం నుండి విడివడడానికి, అందుకు ప్రత్యామ్నాయంగా దానికేదో ఒకటి చూపించాలి. నిజానికి, ఏ ఉద్దేశమూ ప్రయోజమూ, అవసరం లేదు. అవాస్తవం నుండి విముక్తి చెందడం, దానికదే చాలు; అందుకు వేరే బహుమతి ఉండాల్సిన పని లేదు. పరిశుభ్రత పాటించడం వంటిది–దానికతే బహుమానం.

**ప్ర :** ఆత్మజ్ఞానం లభించడమనేది బహుమతి కాదా?

**ని :** ఆత్మజ్ఞానం అనే బహుమతి, వ్యక్తిగతమైన 'స్వ' నుండి విడుదల. జ్ఞాతవు నువ్వే కాబట్టి జ్ఞాతను నువ్వు "తెలుసుకోలేవు;" అసలు తెలుసుకోడమే, తెలుసుకునే వాడికి రుజువు అని గ్రహించాలి. మరే రుజువూ అక్కరలేదు. తెలిసిన దానిని తెలుసుకున్నవాణ్ణి, తెలుసుకోగలిగిలేము. వెలుతురును, రంగుల్లో మాత్రమే చూడగలిగినట్లు, తెలుసుకున్నవాణ్ణి, జ్ఞానంలోనే తెలుసుకోగలిగి వున్నాం.

### మనసు ఉపయోగం

అస్పష్టమైన దాని ముద్రకై వెతక నారంభించిన క్షణాన స్పష్టంగా కనిపించేది కరిగిపోతుంది. నిప్పును గనక కర్రతో కదిలిస్తే కర్ర కాలిపోయినట్లు, అవ్యక్తమైన దానిని మనసుతో అర్థంచేసుకోడానికి ప్రయత్నిస్తే అదే క్షణాన మనసును దాటిపోతావు. అందుచేత, వ్యక్తమైన దానిని స్పష్టంగా కనిపిస్తున్న దానిని పరిశోధిచడానికి, తఙచడానికి ఈ మనసును ఉపయోగించు.

# సృష్టించేది విశ్వజనీనమైన ప్రేమ

సమాధి స్థితిని గురించి నిసర్గదత్త మహరాజ్ మాట్లాడుతూ, "నీవు సరియైన స్థితిలో వుంటే, ప్రపంచంలో దేనిని చూసినా సమాధిలోకి ప్రవేశిస్తావు. నిజానికి సమాధి ఏమంత అసాధారణమయిన స్థితి కాదు. మనసు గనక ఏ విషయంలోనైనా తీవ్రంగా ప్రవర్తిల్లితే, అత్యంత శ్రద్ధ జనిస్తే, ఆసక్తి కలిగిన ఆ వస్తువుతో ఒకటైపోతుంది. చూచేవాడూ, చూడబడినదీ, చూపులో ఒకటవుతై. శ్రవణంలో వినేవాడు, వినబడినది ఒకటవుతై. ప్రేమికుడు, ప్రేమింపబడినది, ప్రేమలో ఒకటవుతై. ప్రతి తీవ్రానుభవమూ, సమాధిని ఆవిష్కరిస్తుంది.

"సృష్టి కనిపిస్తున్నది; సృష్టికర్త కనిపించడంలేదు. తమ కంటికి కనిపించకపోతే, అది లేనట్టేనని అనుకునేవారందరూ, సృష్టికర్త లేడనేస్తారు. కర్తకు ఒక రూపం, ఒక నామం వున్నదనుకోడం సబబుకాదు" అన్నాడు మిత్రశ్రీ.

"ఈ ప్రపంచాన్ని సృష్టించినవారెవరు?" అని నిసర్గదత్తను ప్రశ్నించారు.

**నిసర్గ :** "సమస్తాన్నీ సృష్టించేది, లయింపజేసేది విశ్వవ్యాప్తమైన ఆ చిదాకాశం. ఆ విధంగా ఉనికిలో ప్రవేశించిన వాటన్నిటినీ ఆ పరమాకాశం వాస్తవంగా చేస్తుంది. సృష్టించేది ఆ విశ్వజనీనమైన ప్రేమ అని మాత్రమే చెప్పగలం; మాటలతో అంతకన్నా మరి చెప్పలేము. ప్రతి దానినీ వాస్తవంగానూ, అందంగానూ, కోరుకోదగినదిగానూ చేసేది అదే.

**ప్రశ్న :** కోరుకోదగినది అయి వుంటందేనికి?

**నిసర్గ :** ఎందుకు అయివుండరాదు? అని అడుగుతాను. సృష్టింపబడిన వాటి మధ్య కనిపించే బలీయమైన ఆకర్షణ, స్పందన మూలంగా మనుషులు ఒకరికొకరు చేరువయ్యే లక్షణం, ఆ పరమాకాశం నుండి కాక, మరి ఎక్కణ్ణుంచి పుట్టుకొస్తున్నది? కోరికను తిరస్కరించకండి. అది సక్రమమైన దారుల్లోకి వెళ్ళేట్లు చూడండి. కోరిక లేకపోతే నువ్వు చచ్చిపోయినట్లే. కానీ నీచమైన కోర్కెలు కలిగుంటే నువ్వొక పిశాచానివి.

**ప్రశ్న :** పరమాకాశానికి సమీపంగా వుండే అనుభవమేమిటి?

**నిసర్గ :** బ్రహ్మాండమైన శాంతి, హద్దులు లేని ప్రేమ, ఈ విశ్వంలో సత్యమూ, ఉదాత్తమూ, సుందరమైనదంతా నీనుండే ప్రవహిస్తున్నదనే విషయాన్ని సాక్షాత్కరించుకో. ఈ ప్రపంచాన్ని పర్యవేక్షించే దేవుళ్ళు దేవతలు గొప్ప జీవులయి వుండచ్చు గాక, కానీ వారంతా కూడా, యజమాని యొక్క శక్తినీ వైభవాన్ని చాటెడి చీని, చీనాంబరాలు ధరించిన పరిచారకులు మాత్రమేనని గ్రహించు.

అనుభవాల ప్రాధాన్యతను గురించి ఒకరు నిసర్గను ఇలా ప్రశ్నించారు. "నేనింతకన్నా చిన్నవాణ్ణయి ఉన్నప్పుడు, నాకేవో వింత అనుభవాలు - చిన్నవే అయినప్పటికీ జ్ఞాపకముంచుకోదగినవి - కలుగుతుండేవి; నేనేమీ కాదనీ, కేవలం ఏదో శూన్యమన్నట్లుగానూ వుండేది, కానీ చైతన్యంలో వుండేవాణ్ణి. ఇక్కడ వచ్చిన ప్రమాదమల్లా ఒకటే - అలా జరిగిపోయిన క్షణాలను మళ్ళీమళ్ళీ తలచుకొని వాటిని పునః సృష్టించుకోవాలనే కోరిక బయలుదేరడం-

నిసర్గ : ఇదంతా ఊహ, చైతన్యం వెలుగులో అనేకం సంభవిస్తూ వుంటై. వాటికి ప్రత్యేకమైన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరంలేదు. భగవంతుడి రూప దర్శనమెంతో ఒక పుష్పం కనిపించడం కూడా అంత అద్భుతమైనదే. వాటి పాటికి వాటినలా ఉండనీ, వాటిని గుర్తుతెచ్చుకోడం దేనికి, ఆ తర్వాత జ్ఞాపకాలు ఒక సమస్య చేసుకోవడం దేనికి? వాటి యెడల చప్పగా ఉండిపో; వాటికి ఉచ్ఛనీచాలు ఆపాదించకు; గొప్పవనీ, అధమమనీ, అంతర్గతమైనవనీ, విభజిస్తూ కూచోవద్దు. ఏది జరుగుతున్నప్పటికీ వీటన్నిటికీ మూలమైన నీ ఆత్మవద్దకు వెళ్ళు. నువ్వీ ప్రపంచంలో పుట్టావని నీవేర్పరచుకున్న నమ్మకం, నీ బలహీనత, నిజానికి ఈ ప్రపంచం నీలో నీచేత ఎల్లవేళలా పునఃసృష్టింపబడుతున్నది. నీ సత్తకు మూలమైన కాంతి, వెలుగునుండే ఇవన్నీ జనిస్తున్నవనే విషయం చూడు; ఆ వెలుగులో ప్రేమ, అనంతమైన శక్తీ వున్నాయని నీవే గ్రహిస్తావు.

**ప్ర :** భూమి మీద బ్రతికుండడానికే, నేను 'చూడాల్సిన' అవసరముందంటారా?

**ని :** నువ్వు ఏమిటిగా వున్నావో చూడు. వారినీ వీరినీ అడగకు; నిన్ను గురించి నీకు, ఇతర్లను చెప్పనివ్వకు. నీలోనికి నువ్వు చూసుకొని గ్రహించు. మార్గదర్శకుడు చెప్పగలిగిందల్లా ఇంతే. ఒకరివద్ద నుండి మరొకరివద్దకు వెళ్ళాల్సిన అవసరంలేదు. అన్ని బావుల్లో వుండే నీరూ ఒకటే. ఏ బావికి సమీపంగా వుంటే, దానినుండి నీరు తోడుకో. నా విషయానికి వస్తే, నాలో ఆ నీరు వున్నది, నేనా నీరునే.

# కాలాతీతమైన గురువు

"గురువూ నీవే, శిష్యుడూ నీవే" అని జిడ్డు కృష్ణమూర్తిగారు అన్నప్పుడు మనం ఉలిక్కిపడతాం. కానీ మన ఉలికిపాటు అర్థరహితం. ఆయన గురువు అక్కరలేదని ఎక్కడన్నాడు? ఎఱుకతో శ్రద్ధాన్వితమైన జీవితం గడుపుతూ నిజమైన శిష్యుడికుండాల్సిన లక్షణాలు అలవరచుకుంటే, ఆ గురువు నీలోనే లభిస్తాడు, అనే ఆ మాటలకర్థం.

అరుణాచల రమణుడు కూడా మరో విధంగా చెప్పిన మాటల సారాంశం చూడండి.

**ప్రశ్న :** ఈ రంగంలో విజయసాధనకై గురుకృప మీద ఆధారపడవలసిందే కదా?

**శ్రీరమణులు :** నిజమే నువ్వు చేసే సాధన మాత్రం గురుకృప వలన కాదా? నీకందుతున్నదంతా ఈ సాధన ద్వారానే, వాటంతట అవే అందుతున్నై. 'కైవల్య' గ్రంథంలో ఒక శ్లోకం ఇలా అంటుంది. 'ఓ గురువరా, నీవు నాతోనే ఎప్పుడూ ఉంటూ జన్మజన్మలుగా నన్ను గమనిస్తూనే, నేను మోక్షమందుకునేవరకూ నన్ను నిర్దేశిస్తూ వస్తున్నావు. సందర్భం వచ్చినప్పుడు, ఆత్మ బాహ్యంగా అవతరిస్తుంది. అలాంటి పరిస్థితి ఏర్పడనప్పుడు, అతడు ఎల్లప్పుడూ లోననే వుంటూ అవసరమైనదంతా చేస్తూనే వుంటాడు. మరోసారి మరెవరో అడిగిన ప్రశ్నకు శ్రీ రమణులవారి సమాధానం చూడండి.

ప్రశ్న : **మేము అనుసరించడానికి మాకు భగవానులు ఏదైనా ఉపదేశమను గ్రహిస్తారా? లేకపోతే ఆరువందల మైళ్ళు అవతలనున్న మాకు సహాయమందేదెలా?**

**శ్రీరమణ :** ఆ సద్గురువు నీలోనే వున్నాడు.

ప్ర : **అది అర్థంచేసుకోడానికి నాకు సద్గురువు అవసరం.**

**శ్రీ రమ :** ఆ సద్గురువు లోన వున్నాడు.

ప్ర : **అది అర్థంచేసుకోడానికి నాకు సద్గురువు అవసరం.**

శ్రీ రమ : ఆ సద్గురువు లోన వున్నాడు.

ప్ర : **నాకు కంటికి కనిపించే గురువు కావాలి.**

శ్రీ రమ : ఈ కనిపించే గురువు, ఆ సద్గురువు లోన వున్నాడని చెప్తున్నాడు.

ప్ర : **నా సద్గురువు పాదాల మీద పడితే సరిపోతుందా?**

శ్రీ రమ : ఆహా. తనని తాను సమర్పించుకోనంత కాలమే ఉపదేశాలు కావలసి వుంటై.

ఒక నిసర్గ మహరాజ్ దృష్టి ఎలా వుందో చూద్దాం.

**ప్రశ్న : భారతీయ సంప్రదాయంలో గురువు, ఆవశ్యం వుండి తీరాలి అంటారు. అతడి పాత్ర పరిమితమైనదంటారా? లేక మొత్తంమీద గురువు అవసరమేనంటారా? అది లేనిది ఏమీ జరగదా?**

**నిసర్గ :** అంతరంగంలోని లోతుల్లో వుండే దీపం దాని పాటికి అది ప్రశాంతంగా, కాలాతీతంగా హృదయంలో వెలుగుతూనే వుంటుంది. అదే నిజమైన గురువు. మిగతా వారంతా దోవ చూపించేవారే.

**ప్ర : నాకా లోతుల్లో వుండే గురువు సంగతి అక్కర్లేదు. మార్గదర్శకుడైన గురువు సంగతే నేనడుగుతున్నది. గురువులేనిదే యోగసాధన సాధ్యంకాదని నమ్మేవారున్నారు. అలాంటివారు సరియైన గురువుకై ఎల్లప్పుడూ వెతుకుతూనే వుంటారు. ఒక గురువును మార్చి మరో గురువుని అనుసరిస్తూనే వుంటారు. ఇలాంటి గురువుల ప్రయోజనమేమిటి?**

**ని :** వీరంతా తాత్కాలిక గురువులు. కాలబద్ధులైన గురువులు. జీవితంలో ఏ రంగంలోనైనా ఇలాంటి గురువులు దర్శనమిస్తూనే వుంటారు; ఏ విద్య నేర్వాలన్నా, ఏ నైపుణ్యం సాధించాలన్నా వీరి ఆవశ్యకత ఉండనే ఉన్నది.

**ప్ర : ప్రతి జ్ఞానము, ప్రతి నైపుణ్యానికి నాకు ఆధ్యాత్మిక గురువు వుండాలంటారా?**

ని : వీటిని గురించి, నియామకంగా ఇలా వుండాలి అని ఏదీ చెప్పగలిగేము. ఒక్కటే చెప్పే వీలుంది. బాహ్యంగా కనిపించేది అస్థిరమూ అశాశ్వతమూను. అంతర్గతంగా వుండేది శాశ్వతమైనది, మార్పుచెందనిది; అయివుండి కూడా నిత్యనూతనంగా వెలుగు తుండేది. వినూత్నంగా చరిస్తూ వుంటుంది. లోని గురువు తన సమయానికై వేచి వుంటాడు. మొద్దుతనమూ, జడస్వభావమూ కలిగుండి అపమార్గాలు పట్టి నడవడము, మనిషిని ఒక క్లిష్ట పరిస్థితికి తీసుకువస్తై; సాధకుడికి తన గతి ఏమిటో అప్పుడు తెలిసివస్తుంది. మనిషిని అదరగొట్టే ఇంతటి షాక్ వచ్చేవరకూ ఆగకుండా, ఇప్పుడే ఇటు మళ్ళేవాడు తెలివిమంతుడు. ఈలోన వుండే గురువు అహింసా వ్రతుడనుకోవద్దు; కొన్ని సందర్భాల్లో మొద్దు స్వభావం వుండే మనిషిని, లేక విపరీత చర్యలనాచరించేవాణ్ణి. సర్వనాశనం చేసేటి దౌర్జన్యపరమైన చర్యనాచరించవచ్చు. సుఖసంతోషాల ననుగ్రహించినట్లే, మరణమూ దుఃఖమూ అనుభవింపజేస్తుంది. ఒక్క ద్వంద్వ మనస్తత్వానికే, అహింస ఒక ఏకీకృత సూత్రంగా కనిపిస్తుంది.

**ప్రశ్న : మనిషి తన ఆత్మను చూసి భయపడుతుండాలా?**

నిసర్గ : భయపడాలనడం లేదు; ఆత్మ నీ శ్రేయస్సునే కోరుతున్నది. కానీ దానిని శ్రద్ధా పూరితంగా గమనించాలి. ఆషామాషీగా కాదు, తాను చెప్పినట్లు నువ్వు చేయాలని ఎదురుచూస్తుంది. దాని మాట వినవనుకో. మెల్లగా, సుతిమెత్తని పలుకులతో నిన్ను దారి మళ్ళించలేకపోయినప్పుడు బలవంతంగా చేయించడానికి పూనుకుంటుంది. అది వేచి వుండగలదనే మాట నిజమే కానీ, దాని ఆదేశాలు మాత్రం అనుల్లంఘనీయం. అసలు చికాకు బాహ్య గురువా, లోని గురువా అనే విషయంలో కాదు; గురువు ఎప్పుడూ వుండనే వున్నాడు. వచ్చేతంటా అల్లా, శిష్యుడు పరిపక్వ స్థితినందుకున్నాడా లేదా అనేదే సమస్య. శిష్యుడు సిద్ధంగా లేనప్పుడు, ఎవరుమాత్రం ఏమి చేయగలరు?

**ప్ర : ఈ లక్షణంతో సిద్ధంగా వుండకపోవడమా, లేక మారడానికి అనుకూలత చూపకపోవడమా?**

ని : రెండూను, రెండూ కూడ ఒకదానికే దారితీస్తాయి. భారతదేశంలో మేము ఈ స్థితిని 'అధికారి' అగుట, కాకపోవుట అని నిర్వచిస్తాం. అందుకు అర్థం తగిన సామర్థ్యముండటం, అర్హత కలిగి వుండటమని.

**ప్ర : బాహ్య గురువు దీక్షనివ్వవచ్చా?**

ని : ఎన్ని దీక్షలైనా అనుగ్రహించవచ్చు కానీ, వాస్తవంలోకి ప్రవేశించడానికి దీక్ష గైకొనడమనేది సాధకునిలో నుండి పుట్టుకురావాలి.

**ప్ర : చిట్టచివరకు దీక్ష ఇచ్చేదెవరు?**

ని : ఆత్మే ఇచ్చుకుంటుంది.

**ప్ర : గురువులో విశ్వాసమెలా కలగాలి?**

ని : గురువు లభించడం, అతడిలో విశ్వాసమేర్పడడం అనేది ఒక అపూర్వమైన అదృష్టం. అది తరచూ సంభవించేది కాదు.

**ప్ర : ఇది విధి నిర్ణీతమా?**

ని : విధి అనే పేరు పెట్టినందువల్ల మనకర్థమయ్యేది ఏమీలేదు. అది ఘటిల్లినప్పుడు అది ఎందుకు సంభవించిందో మనం చెప్పలేము. మన అజ్ఞానం కప్పి పుచ్చుకోడానికి దానిని కర్మ అనీ, కృప అనీ, భగవదేచ్ఛ అనీ పేరు పెట్టుకుంటాం.

**ప్ర : జిడ్డు కృష్ణమూర్తిగారు గురువు అక్కరలేదంటాడే?**

ని : ఆ పరమోత్కృష్టమైన వాస్తవాన్ని గురించీ, దాని దరికి వెళ్ళేదారిని గురించీ ఎవరో ఒకరు నీకు చెప్పాలికదా? అదే కృష్ణమూర్తి చేస్తున్నది. ఒక విధంగా చూస్తే

ఆయన అనేమాట నిజమే; శిష్యులమని చెప్పుకునేవారు ఎక్కువమంది తమ గురువులను విశ్వసించరు. గురువుల మాటను ఉల్లంఘిస్తారు, చివరకు వారిని వదిలేస్తారు. అలాంటి శిష్యులకు గురువు లేకుండా ఉండడమే ఎంతో శ్రేయస్కరం. మార్గదర్శకత్వం కోసం తమలోకి తాము చూచుకోడమే మేలు. సజీవ గురువు లభించడం ఒక అపురూపమైన అవకాశమూ, అతి పెద్ద బాధ్యత కూడానూ. ఇలాంటి విషయాలను తేలికగా భావించరాదు. మీరంతా స్వర్గాన్ని కొనేయగలమనీ, ఈ గురువనేవాడు, మీకేదో ధరకి దానిని ఇప్పించ గలడనీ అనుకుంటుంటారు. ఏదో కొద్దిగా సమర్పించుకొని, మంచి లాభసాటి బేరం కదుర్చుకోగలమని మీ ఉద్దేశం. మిమ్మల్ని మీరు వంచించుకుంటున్నారే కానీ, మరొకర్ని వంచిస్తున్నారనుకోవద్దు."

తాను స్వయంగా ఒక గురువును ఆశ్రయించి, ఆయన మాటనే సంపూర్తిగా విశ్వసించి, తత్వం తలపోసి, జ్ఞానిగా రూపొందిన నిసర్గదత్త మహరాజ్, గురువావశ్యకతే లేదని జీవితం పొడుగూతా ప్రవచిస్తూ వచ్చిన జిడ్డు కృష్ణమూర్తిగారిని ఒక్కమాట అనకుండా, సాధారణ గురువుల ఆడంబరమూ శిష్యుల దురాశా గురించి ప్రసంగిస్తున్నాడు. సద్గురువు లభించడం ఒక మహదవకాశం అనేది చెప్తూ, అదొక మహా బాధ్యత అని కూడా అనడం గమనార్హం. సద్గురువు లభించినప్పుడు, అతడినోట వెలువడే సత్యవాక్కు శ్రద్ధాన్వితుడైన వాని హృదయానికి సూటిగా తగులుతుంది. అలా తగిలినప్పుడు అది అనుల్లంఘనీయం. సత్యాన్ని శ్రద్ధగా విని అర్థంచేసుకున్న తర్వాత దానిని ఆచరించకపోతే, ఆ సత్యం విషంగా మారుతుందని కృష్ణమూర్తిగారు అంటుండేవాడు. నిసర్గదత్త ఈ బాధ్యతనే గుర్తుచేస్తున్నాడనుకోవాలి. శక్తివంతమైన సత్యవాక్కు శ్రద్ధగలవాని హృదయంలో నాటు కున్నప్పుడు, దానియెడల నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించడం, ద్రోహం తలపెట్టడం, మనిషిని నాశనం చేస్తుందని హెచ్చరిక; అదే బాధ్యత అంటే.

**నా గురువు**

నా గురువుతో భూతలంపై నా సంబంధం కేవలం రెండున్నర సంవత్సరాలు మాత్రమే. నేనుండే ఈ బొంబైకి ఆయన రెండువందల కిలోమీటర్ల దూరాన వుండేవాడు. ఇక్కడికాయన నాలుగు నెలలకోసారి వచ్చి, ఓ పక్షంరోజులపాటు ఉండి వెళ్ళేవాడు. ఈ నేర్చినదంతా ఆ సంపర్క ఫలమే.

*నిసర్గ*

# ఇతడే నీ గురువని ఎలా తెలియాలి?

**ఆ**ధ్యాత్మిక పంథాలో గురువుయొక్క స్థానాన్ని పలు కోణాల నుండి పరీక్షించి, వివరిస్తాడు నిసర్గదత్త.

**నిసర్గదత్త :** సత్యం ఎరిగిన వానితో జీవిస్తూ, అతడియొక్క మార్గదర్శకత్వం ద్వారా నిన్ను రూపొందించే ప్రభావానికైనా లోనవాలి, లేనిపక్షంలో అంతర్ గురువుని నీలో వెతుక్కొని ఆ లోవెలుగుని–అది నిన్నెక్కడికి తీసుకువెళ్ళినా– అనుసరించాలి. రెండు విధానాల్లోనూ నీ వ్యక్తిగత కోర్కెలను, భయాలను ప్రవర్తిల్లనివ్వరాదు.

గురువుతో సమీపంగా నివసించడం ద్వారా గానీ, లేక విచారణ ద్వారా గానీ చురుకుగా ప్రయత్నాలుచేస్తూ, నేర్చుకోవాల్సి వుంటుంది. నీ గురువు ప్రాతినిధ్యం వహించే ఈ జీవన స్రవంతి, ఈ ప్రేమఝరిలోనైనా తేలియాడుతూ, ముందుకు సాగాలి; లేదా నీ అంతర్ ధృవతార చూపించే మార్గాన్నైనా అనుసరిస్తూ నీ సాధన నీవు కొనసాగించాలి.

**ప్రశ్న :** నన్ను తీసుకువెళ్ళి, తీరా ఆయన చేతుల్లోపెట్టే ముందు, గురువును పరీక్షించవలసిన అవసరం వుందంటారా? లేదంటారా?

**నిసర్గ :** అన్నివిధాలా పరీక్షించాల్సిందే. కానీ నీవు కనుగొనగలిగిందేమిటి? నీ స్థాయిలో నీకతడు ఎలా కనిపిస్తున్నాడో, అంతేకదా నీవు చూడగలిగేది?

**ప్ర :** ఆ మనిషి జీవితం పొందికగా ఏకరీతిగా వున్నదా, అతడు బోధించే విషయానికి అతడి జీవన విధానం అనుగుణ్యంగా వుందా అనేది గమనిస్తాను.

**నిసర్గ :** ఆ రెంటిమధ్యా చాలా వైరుధ్యముండచ్చు, అసంగతంగా కనిపించవచ్చు. అయితేనేమి? దానివల్ల రుజువయ్యేదేమిటి? అతడి ఉద్దేశాలు మాత్రమే నికరమైనవి; అతడి ఉద్దేశాలను నువ్వెలా గ్రహిస్తావు?

**ప్ర :** కనీసం స్థిరమైన నడవడి కలిగి వుంటాడని, తన స్వాధీనంలో తానుంటాడని, ధర్మంగా జీవిస్తాడని ఆశిస్తాను.

నిసర్గ : అలాంటివాళ్ళు చాలామంది కనిపిస్తారు– కానీ వారెవరూ నీకు ఉపయోగ పడరు. నీ సత్యాత్మ తన స్వగృహానికి వెళ్ళేందుకు మార్గం చూపించగల్గినవాడే గురువు.

దీనికిన్నీ అతడిలో నీకు కనిపించే శీల సంపద, అతడి స్వభావం, వీటన్నిటికీ సంబంధ మేమిటి? అతడి సమక్షంలో నువ్వు వుండే వేళలో నీలో సంభవించే మార్పునుబట్టే నువ్వు అతణ్ణి అంచనా కట్టాల్సి వుంటుంది. అతడి సాంగత్యంలో నీకు మరింత శాంతి లభించి నువ్వు సంతోషంతో వుండగలిగావంటేనూ, మామూలుకన్నా అధికమైన స్పష్టతతో లోలోతుల్లో నిన్ను నువ్వు అర్థం చేసుకోగలిగావంటేనూ, నువ్వు సరియైన మనిషినే తారసిల్లానన్నమాట.

గురువూ శిష్యుడూ, వారిద్దరి మధ్యా వుండే ప్రేమ, విశ్వాసం, ఇవన్నీ కలిపి ఒకటే సత్యం, వేర్వేరు సత్యాలుకావు. ఒకదానిలో ఇంకొకటి భాగం మాత్రమే. ప్రేమ, విశ్వాసం లేకుండా గురువులేడు, శిష్యుడూ లేడు, వారిద్దరిమధ్యా సంబంధమూ లేదు. ఈ గదిలోని ఎలెక్ట్రిక్ బల్బు, దీనికి సంబంధించిన విద్యుత్ తీగెలు స్విచ్, ట్రాన్స్‌ఫార్మర్, ట్రాన్స్‌మిషన్ లైన్లు, పవర్ హౌస్, ఈ మొత్తం ఒకటిగా వున్నాయి కాబట్టే, ఇక్కడికీ వెల్తురు రావడం సాధ్యమైంది. ఏ ఒక్క అంశం ఇందులో లేకుండాపోయినా వెలుతురు ఉండే అవకాశం లేదు. విడదీయడానికి వీల్లేని దానిని విడగొట్టరాదు. పదాలు వాస్తవాన్ని సృష్టించలేవు; అవి కేవలం వాస్తవాన్ని వర్ణించనైనా వర్ణిస్తై, లేదా వక్రీకరిస్తై. వాస్తవం ఎప్పుడైనా, శాబ్దికమైనది కాదు.

ఈ ప్రపంచంలో ఏవి ఎట్లాగైతే వున్నాయో, అవి అట్లాగే వున్నాయి. కానీ మనం వాటన్నిటినీ, మనం మాట్లాడే భాషయొక్క నిర్మాణాన్ననుసరించి, ఒక నమూనాలోకి అమరుస్తుంటాం. ఈ అలవాటు మనలో ఎంత బలంగా పాతుకుపోయిందంటే, దేనినైతే మనం మన పదాల్లోకి ఇమడ్చగలిగిలేమో, దానిని గుర్తించకుండా, అది 'లేదు' అనేస్తాం.

పదాలు కేవలం మన జీవితాల్లో పునరావృత్తమవుతూ ఉండే అనుభవాలకు సంకేతాలు; లోకామోదం ఉంటం మూలాన, అలవాటైన కారణంచేతా, వాటిని మనం అలావాడుతూ వుంటాం. పదాలనేవి ఇంతమాత్రమేనని గ్రహించడానికి నిరాకరిస్తాం.

# మార్పు అవసరాన్ని స్పష్టంగా గుర్తించు

**మ**నసునూ, భౌతిక పదార్థాన్నీ వేర్వేరుగా కాక ఒకటిగా గుర్తిస్తూ, ఒక కోణం నుండి చూస్తే సైన్సుగానూ, మరో కోణం నుండి చూస్తే మత ధర్మంగానూ, ఒకే సంపూర్ణత్వానికి చెందినవనే విషయం స్పష్టంచేస్తూ నిసర్గ మాట్లాడిన మాటలు ఎంత విజ్ఞానదాయకమో గమనించండి.

**ప్రశ్న :** ఆత్మను సాక్షాత్కరింపజేయడానికి కాలం పట్టుందంటారా, లేక కాలం సహాయపడ గలిగిలేదంటారా? నా ఉద్దేశ్యం, ఆత్మసాక్షాత్కారం కాలంపై ఆధారపడి వుందా లేక కాలంతో నిమిత్తంలేని ఇతర అంశాలపై ఆధారపడి వుందా?

**నిసర్గ :** నిరీక్షణ యావత్తూ వ్యర్థం. మన సమస్యల్ని పరిష్కరించడానికి, కాలం మీద ఆధారపడడం భ్రమ. భవిష్యత్తును, దానికి దానిని, వదిలేసి కూచుంటే, కేవలం గతాన్ని పునరావృతం చేస్తూ వుంటుంది. మార్పు అనేది ఇప్పటికిప్పుడు సంభవించాల్సిందే కానీ, భవిష్యత్తులో కాదు.

**ప్ర :** మార్పును ఏది సాధిస్తుంది?

**ని :** స్ఫటికమంత స్పష్టంగా తేటతెల్లంగా మార్పుయొక్క అవసరాన్ని గ్రహించు. అంతే కావలసింది.

**ప్ర :** ఆత్మసాక్షాత్కారం ఈ భౌతిక పదార్థంతో జరుగుతుందా లేక, ఇందుకు అతీతంగా జరుగుతుందా? అది సంభవించడానికి, ఈ శరీరమూ మనస్సు మీద ఆధార పడదు కదా?

**ని :** అనుభవమంతా భ్రాంతి; ఇది పరిమితమైనది, కాలానికి చెందినది. అనుభవం నుండి దేన్నికై కూడా ఎదురుచూడకు. తనకుతానుగా సంభవించే ఈ సాక్షాత్కారం, అనుభవం కానేకాదు; కానీ అటు తర్వాత కలిగే అనుభవాల స్థాయి వేరుగా వుండచ్చు. ఆ కొత్త అనుభవాలు ఎంత ఆసక్తిదాయకంగా ఉన్నా, ఒకప్పటి అనుభవాలకన్నా వాస్తవమైనవేమీ కాదు. సాక్షాత్కారమంటే వినూత్న అనుభవమనుకోరాదు; అది ప్రతి ఒక్క అనుభవంలోని కాలాతీత అంశాన్ని కనుగొనడం మాత్రమే. అది అనుభవ సమయాన ఎఱుక కలిగి

వుండడం. రంగులన్నిటిలోనూ ఏ రంగూ లేని కాంతి ఎలాంటిదో అదే విధంగా ప్రతి అనుభవంలోనూ ఎఱుకైతే వుంటుంటుంది కానీ, ఆ ఎఱుకే ఒక అనుభవ మనిపించుకోదు.

**ప్ర :** ఎఱుక, అనుభవం లేని పక్షంలో, దానిని ఎలా సాక్షాత్కరింపజేసుకోవడం?

**ని :** ఎఱుక ఎల్లప్పుడూ ఉంటుంటుంది. దానిని సాక్షాత్కారింపజేసుకోవలసిన అవసరం లేదు. మనసు కవాటం తెరిస్తే చాలు, మొత్తం వెలుతురుతో నిండిపోతుంది.

**ప్ర :** భౌతిక పదార్థమేమిటి?

**ని :** నీకు అర్థంకానిది భౌతిక పదార్థం.

**ప్ర :** సైన్సు భౌతిక పదార్థాన్ని అర్థంచేసుకోగలదు.

**ని :** సైన్సు మన అజ్ఞానం సరిహద్దుల్ని మాత్రమే మరికాస్త అవతలికి తోయగలిగి వుంది.

**ప్ర :** మరి ప్రకృతి అంటే ఏమిటంటారు?

**ని :** చైతన్యవంతమైన అనుభవాలు సమస్తం కలిపితే ప్రకృతి అవుతుంది. చైతన్య వంతమైన ఆత్మగా నీవు ఆ ప్రకృతిలో ఒక భాగానివి. ఎఱుకగా, నీవు దీనికి అతీతమైన మనిషివి. ప్రకృతిని కేవల చైతన్యంగా చూడగలగడమే, ఎఱుక.

**ప్ర :** ఎఱుకలో స్థాయిలున్నాయా?

**ని :** చైతన్యానికి స్థాయిలున్నాయి, ఎఱుకకు కాదు. ఎఱుక సమరూపంగల ఏక ఖండం. మనసులో దాని ప్రతిబింబం ప్రేమ, అవగాహన రూపంలో వుంటుంది. అవగాహనలో స్పష్టత, పలు స్థాయిలలో వుంటుంది. అలాగే ప్రేమయొక్క తీవ్రతలో స్థాయిలుంటై కానీ, ఆ రెంటికీ మూలమైన స్థానంలో, స్థాయిలేమీ వుండవు. మూలం సరళంగానూ ఏకంగానూ వుంటుంది. కానీ అది అందించే బహుమతులు అనంతం. అయితే ఈ బహుమానాలను, ఆ 'మూలం'గా మాత్రం భావించకు. నువ్వే ఆ మూలానివి అనే విషయం గ్రహించు. అంతేకానీ నువ్వు ఈ ప్రవహించే నదివి కావు అని తెలుసుకుంటే చాలు.

**ప్ర :** నేను నదిని కూడాను.

**నిసర్గ :** ఆ మాటా నిజమేననుకో, నువ్వు నదివి కూడాను. 'నేను'గానున్న శరీరం అనే ఆనకట్టల మధ్య ప్రవహించే నదివే. అయినప్పటికీ నువు దీనికి మూలానివి. సముద్రానివి, ఆకాశంలోని ఆ మేఘాలవు కూడాను. ఎక్కడెక్కడ జీవమూ చైతన్యమూ విలసిల్లుతున్నాయో, అక్కడల్లా నువ్వు చిన్న ప్రాణుల్లోని అతి చిన్న ప్రాణివి, పెద్ద వాటిల్లో అతి పెద్ద ప్రాణివి. ఉన్నది నువ్వే, మిగతా దంతా కనిపిస్తూ వుండేది.

**ప్రశ్న : సత్త కలిగున్నాననే స్పృహ, జీవిస్తున్నాననే స్పృహ, ఈ రెండూ ఒకటేనా, లేక వేర్వేరా?**

**ని :** ప్రదేశంలో ఉండే ఉనికి ఒకటిగా చేస్తె; కాలంలో అనున్యూతంగా సాగిపోయేది రెండవ దానిని సృష్టిస్తుంది.

**ప్ర : ఒకసారి మీరు, ద్రష్ట దృక్కు దృశ్యం మూడు కూడా వేర్వేరుగా లేవు, ఒకటేనన్నారు, నాకు మాత్రం అవి మూడూ, మూడుగా కనిపిస్తె. మీ మాటపై నాకు విశ్వాసం లేదనను కానీ, నాకైతే అర్థంకావడం లేదంటాను.**

ని : సమీపంగా చేరి చూడు. చూచేటప్పుడు మాత్రమే చూచేవాడు,చూడబడేది అనేవి కనిపిస్తె. అవి రెండూ చూపుయొక్క లక్షణాలు. 'ఇది నేను చూస్తున్నాను' అని అన్నప్పుడు, నేను ఇది, అనేవి చూపుతోబాటు దిగి వస్తె; అంతకుమునుపు కాదు. కనిపించని 'ఇది'కానీ, 'చూడని' నేను కానీ రమ్మంటే రావు.

**ప్ర : 'నేను చూడడం లేదు' అని అనగలిగి వున్నాను కదా?**

**ని :** 'ఇది నేను చూస్తున్నాను' అనేదే 'నేను చూడడం లేదనేది చూస్తున్నాను' అయింది; లేదా 'చీకట్ని చూస్తున్నాను' అయింది. చూడడం అనేది ఉండనే వుంటుంది. ఈ మూడిటిలో, అనగా తెలుసుకొనబడేది, తెలుసుకొనుట, తెలుసుకొనువాడు అనే ఈ మూటిలో తెలుసుకొనుట అనేది ఒక్కటే సత్యం. 'నేను', 'ఇది' అనేవి సందేహాస్పదమైనవి. ఎవరికి తెలుస్తున్నది? ఏమి తెలుస్తున్నది? వాటిని గురించి నిశ్చయంగా ఏమీ చెప్పగలిగేము; ఒక్క తెలుసుకోడం గురించి ఖాయంగా మాట్లాడగలిగివున్నాం.

**ప్ర : తెలుసుకోడం ఒక్కటే ఖచ్చితంగా తెలుస్తూ, తెలుసుకునేవాణ్ణి గురంచి ఖచ్చితంగా తెలియపోవడ మేమిటంటారు?**

**ని :** తెలుసుకోడమనేది సత్త, ప్రేమలతో కూడుకున్న నీ నిజస్వభావం యొక్క ప్రతిబింబం. తెలుసుకునేవాడు, తెలుసుకోబడేది, ఆ తెలుసుకోడానికి నీ మనసు కలిపే వస్తువులు, లేనటువంటి గ్రహించేవాడి నొకడ్నీ, గ్రహింపబడే దానినీ, ఈ రెండింటి ద్వంద్వాన్ని సృష్టించడం మనసు స్వభావం. ఉన్నదేదో వున్నది. అది జీవాత్మ; అది వ్యక్తిపరమైనది కాదు, వస్తుపరమైనది కాదు. భౌతికపదార్థం, మనస్సూ వేర్వేరు కావు. అవి రెండూ కూడా ఒకే శక్తియొక్క అంశాలు. భౌతిక పదార్థంయొక్క వస్తుధర్మంగా మనసును చూడు, నీకు సైన్సు అందివస్తుంది. భౌతిక పదార్థాన్ని మనసుయొక్క ఉత్పత్తిగా చూడు.

**ప్ర : కానీ, ఏది నిజమంటారు? ఈ రెంటిలో ఏది ప్రథమం? మనస్సా, భౌతిక పదార్థమా?**

**ని :** ఏ ఒక్కటీ ప్రథమంలో ఆవిర్భవించడమనే ప్రశ్న ఉండదు; కారణమేమిటంటే ఈ రెండూ విడివిడిగా పుట్టడంకాక, ఒక్కటిగా పుట్టుతై కాబట్టి, భౌతిక పదార్థం, దాని యొక్క రూపం, మనసేమో దాని నామం. ఈ రెంటినీ దాటి వ్యాపించేది వాస్తవం–స్వచ్ఛమైన సత్త–ఎఱుక–ఆనందం– నీ అసలు సారం.

## మనిషిలో మార్పు

మనిషిలో మార్పు క్రమంగా వస్తుందా లేక తక్షణం సంభవిస్తుందా అనే విషయంలో ఏకాభిప్రాయం లేదు. ఈ సందర్భంగా నిసర్గ ఏమన్నాడో చూద్దాం.

**ప్రశ్న : ఏదైనప్పటికీ, క్రమంగా జరగడమనేది జీవిత సూత్రం కాదా?**

నిసర్గ : అబ్బే ఎంతమాత్రం కాదు. ఆధ్యాత్మిక రంగంలో సన్నాహం మాత్రమే క్రమానుగతంగా సాగుతుంది. కానీ సంభవించే మార్పు మాత్రం అకస్మాత్తుగానూ, సంపూర్ణంగానూ సంభవిస్తుంది. క్రమానుగతంగా జరిగేటటువంటి ప్రక్రియ, నిన్ను జాగరూకమైన సత్తలో ఒక నూతన స్థాయికి తీసుకుపోగలిగి లేదు. ఏదైనా ఛట్టున వదిలేయడానికి ధైర్యం కావాలి సుమా.

**ప్రశ్న : నేనొక్కణ్ణే మారంగానే...**

నిసర్గ : ప్రతిదీ, ప్రతి ఒక్కదాని మీద తన ప్రభావం చూపుతుంటుంది. ఈ విశ్వంలో ఒకటి మార్పు చెందితే, అన్నీ మారుతూ వుంటై.



# అమృతధార ఖడ్గధార

పశువుల కాపరి పరమజ్ఞాని అయ్యాడు.

బీడీలు కాల్చేవాడు కాబట్టి ప్రజలు నిసర్గను 'బీడీబాబా' అనేవారు. సంవాదంలో మనుషుల్ని చీరేసేవాడు కాబట్టి పాశ్చాత్యులు నిసర్గ దత్త మహారాజ్‌ను టైగర్ అని వ్యవహరించేవారు. ఈయన విప్లవాత్మకమైన వేదాంత బోధను గ్రహించడానికి విదేశీయులు ముఖ్యంగా యువతీ యువకులు బొంబైకి దారి కట్టారు. ఇంగ్లాండ్‌లో వీపున బాక్ ప్యాక్ తగిలించుకొని, హీత్‌రో విమానాశ్రయంలో ఎయిరో ప్లేన్ ఎక్కి బొంబై వచ్చి, ఏదో చవుక హొటల్‌లో దిగి (ఇలా వచ్చినవారు చాలామంది 'లేని'వారే) నేరుగా ఖేట్‌వాడీలోని ఈ బీడీబాబా ఇంటికి వచ్చి, ఈయన మాటల్ని వినసాగేవారు. కూర్చోడానికి కుర్చీలు లేవు. క్రిక్కిరిసిన గదిలో నేలమీద కూర్చునేవారు. నిసర్గ మాట్లాడేది మరాఠీ భాషలో; వినడానికి వచ్చినవారికి ఇంగ్లీష్ తప్పితే ఏ భారతీయ భాషారాదు. అనువాదకుల మీద ఆధారపడే వారు. ఈ అమృతధార వారిని పూర్తిగా ఆకట్టుకుంది. ఆయన కోపాన్ని, చిరాకును కూడా చవిచూశారు. కానీ లేచిపోయేవారు కాదు. బోధ ఎంత స్తవనీయమో, అంత పదునుగానూ ఉండేది. సమ్మోహితులై అలాగే కూర్చునేవారు. వాడిగా వేడిగా ప్రశ్నలడిగే వారు; సమాధానాలు అలాగే ఉండేవి. పది, పదిహేను రోజుల పాటు ఈ సంభాషణల్లోపాల్గొని బొంబై విమానాశ్రయంలో ప్లేన్ ఎక్కి ఇంగ్లాండ్ వెళ్లిపోయేవారు. బొంబైలో వారికి చూడదగినది ఈ నిసర్గ నిలయమొక్కటే! మరే ఆకర్షణా లేదు. ఆత్మజ్ఞాన దాహమొక్కటే వుండేది.

నీలంరాజు లక్ష్మీప్రసాద్